మే
2017

133

సంపుటి : 12 సంచిక : 1

వెల రు. 10 /-

## ఈ సంచికలో........

ప్రజాస్వామ్యానికి ఎదురౌతున్న సవాళ్లు
పార్టీలో ఆంతరంగిక పోరాటం
వర్గ, సామాజిక పోరాటాల మధ్య సంబంధం
సమకాలీన భారతదేశంలో ప్రభుత్వ భూ కబ్జాలు
మాతృత్వానికి రక్షణ కల్పించిన సోవియట్ ప్రభుత్వం
కార్పొరేట్ల కోసం రూపొందించిన నూతన ఆరోగ్య విధానం
వలసలపై కాదు దోపిడిపై పోరాడాలి
సిరియా ఆక్రమణే అమెరికా ధ్యేయం
బెదిరింపులతో లొంగదీస్తున్న మోడీ ప్రభుత్వం
శ్రామిక జన ఆశాజ్యోతి కామ్రేడ్ శేషగిరిరావు

**నివాళి**

# శ్రామిక జన ఆశాజ్యోతి

# కామ్రేడ్ శేషగిరిరావు

**సిం**గరేణి వీరకిషోరం దేవూరి శేషగిరిరావు నెల్లూరు జిల్లాలోని పాపిరెడ్డిపాలెం గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో 1918 సెప్టెంబరు 9న జన్మించారు. ఆయనకు నలుగురు అన్నలు, ఒక సోదరి ఉన్నారు.

నెల్లూరులో వెంకటగిరి రాజా కాలేజీలో బి.ఎ.పట్టాపొంది తొలుత జాతీయోద్యమ ప్రభావంతో విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు పెంచుకొన్నారు.

1939లో ఆయన కొత్తగూడెం చేరుకొని బాబు క్యాంపులోని సింగరేణి కాలరీస్ హెడ్డాఫీసులో అకౌంటెంట్‌గా చేరారు. అప్పటికే సింగరేణిలో తెల్లదొరల దౌర్జన్యాలు, నైజాం మూకల స్వైరవిహారం, కాంట్రాక్టర్ల దోపిడీ రాజ్యమేలుతున్నది. సింగరేణిలో అడుగుపెట్టిన ఆయన కార్మికుల దుర్భర దారిద్ర్య పరిస్థితులను అవగతం చేసుకొని కాంట్రాక్టర్ల దోపిడి విధానాలపై తిరుగుబాటు బావుట ఎగురవేశారు. సర్వదేవభట్ల రామనాథం, కారేపల్లి రాఘవరావు, ఎం. కొమరయ్య, పర్సా సత్యనారాయణ తదితరులతో కలిసి కమ్యూనిస్టు పార్టీ రహస్య నిర్మాణానికి పునాదులు వేశారు. మగ్దూం మొహియుద్దీన్, డాక్టర్ రాజ బహదూర్ గౌడ్‌లతో సంబంధాలు బలోపేతం చేసుకొనిరహస్యంగా యూనియన్ నిర్మాణానికి పూనుకున్నారు. పత్రికలు రహస్యంగా తెప్పించి కార్మికులకు అందించేవారు.

కామ్రేడ్ మగ్దూం మొహీయుద్దీన్, డాక్టర్ రాజబహదూర్‌గౌడ్‌లతో పాటు తాను కూడా రహస్యంగా బొగ్గు గనుల్లోకి దిగి కార్మికుల స్థితిగతులను తెలుసుకొనేవారు. కామ్రేడ్ శేషగిరిరావు కార్యదర్శిగా ఒక కమిటి ఏర్పాటు చేశారు. అందులో పూవుల చలపతిరావు, పర్సా సత్యనారాయణ, ఎం. కొమరయ్య, వంగా రాజేశ్వరరావు, కుమారస్వామి తదితరులున్నారు. 1942 ఫిబ్రవరిలో అప్పటి అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా కామ్రేడ్ సర్వదేవభట్ల రామనాథం అధ్యక్షునిగా, శేషగిరిరావు ప్రధాన కార్యదర్శిగా, పూవుల చలపతిరావు, పర్సా సత్యనారాయణ, దుర్గాప్రసాద్ ఎం. కొమరయ్య తదితరులతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ కొరకు నిర్ణయం చేయడం జరిగింది. అయితే 1944లో యూనియన్ రిజిస్ట్రేషన్ జరిగింది. దీనితోపాటు రైల్వే యూనియన్, అజంజాహి మిల్ వర్కర్స్ యూనియన్‌లు మాత్రమే అప్పటికి రిజిస్ట్రేషన్ అయివున్నాయి.



ముఖ్యంగా కాంట్రాక్టు కార్మిక విధానాన్ని ఎత్తివేయటానికి, కార్మికుల జీవన పరిస్థితుల మెరుగు కోసం జీతాల పెంపుదల, బావిలో రక్షణ సదుపాయాలు, తదితర సమస్యలపై పోరాటాలు నిర్వహించి ఆయన విజయాలు సాధించారు. రెండవ ప్రపంచం యుద్ధం ఫలితంగా ఏర్పడిన కరువు పరిస్థితుల్లో పోరాడి కంపెనీ ద్వారా 'రేషన్' ఇప్పించారు.

1945 జూన్ 16వ తేదీన యూనియన్ మొదటి సమావేశం జరిగింది. కొత్తగూడెంలో జరిగిన మహాసభల్లో యూనియన్‌ను బహిరంగంగా ప్రకటించడం జరిగింది. యూనియన్‌ను విస్తరించే దానిలో భాగంగా ఆయన ఆనాడు తాండూర్ బొగ్గు బావులకు (ఈనాటి బెల్లంపల్లికి) కొంతమంది కార్యకర్తలను పంపించారు. అందులో కుమారస్వామి, కావేటి రామయ్యలు ముఖ్యులు. కామ్రేడ్ కుమారస్వామి అక్కడ నాయకుడిగా పేరొందారు.

కార్మికుల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతిష్ట పెరిగింది. ఇది చూసి బెంబేలెత్తిన నైజాం ప్రభుత్వం, యాజమాన్యం యూనియన్ పలుకుబడిని దెబ్బతీయడానికి కుట్రలు పన్నారు. నైజాం ప్రభుత్వం తమ ఫాసిస్టు పోలీసు మూకలతో కామ్రేడ్ శేషగిరిరావు తదితర నాయకులను అంతం చేయడానికి ప్రయత్నించింది. కాంట్రాక్టర్లు కుట్రపన్ని గూండాలతో హత్యా ప్రయ్నతం చేయించాడు. ఇది తెలిసిన ప్రజలు గూండాలను చావబాదారు. అందుకు ప్రయత్నించిన కాంట్రాక్టర్ ఇంటిని ప్రజలు నేలమట్టం చేశారు. సింగరేణి యాజమాన్యం శేషగిరిరావును లోబర్చుకోవడానికి అనేక ఆశలు చూపింది. మేనేజిమెంట్ వేస్తున్న ఎత్తుగడలను ఆయన తిప్పికొట్టారు. కార్మికుల పక్షాన నిలిచి, ఆ సందర్భంలో యూనియన్ ఆఫీసులో ఉన్న ఆయనను అరెస్టు చేయడానికి నిజాం పోలీసులు పెద్ద సంఖ్యలో వచ్చి యూనియన్ ఆఫీసును చుట్టుముట్టారు. ఈవిషయం తెలుసుకున్న కార్మికులు, ప్రజలు చేతికందిన కర్రలు, గడ్డపారలతో యూనియన్ ఆఫీసుకు చేరుకుని, పోలీసులను అడ్డుకున్నారు. ప్రజలు కామ్రేడ్ శేషగిరిరావును తప్పించారు. పోలీసులు ఆఫీసులోకి వెళ్లి చూడగా ఆయన కనిపించక తెల్లముఖం వేసి వెళ్లిపోయారు. ఆనాటి నుంచి ఆయన కొత్తగూడెం ప్రాంతంలో అజ్ఞాతంలో ఉండి యూనియన్ కార్యకలాపాలు నిర్వహించారు.

యూనియన్ కార్యకర్తల అరెస్టులు నిత్యకృతం అయ్యాయి. అరెస్టు చేసిన వారిని కామ్రేడ్ శేషగిరిరావు ఆచూకీ కోసం చిత్రహింసలకు గురిచేశారు.

1947 ఫిబ్రవరి నెలలో రహస్య జీవితంలో ఉన్న ఆయన సమాచారాన్ని ఒక కాంట్రాక్టర్ ఇవ్వగా, నైజాం పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి, సమాచారం బయటకు పొక్కకుండా హైద్రాబాద్ లోని చంచల్‌గూడా జైలుకు తరలించారు. కొన్ని నెలల తరువాత ఒక కేసు నిమిత్తం ఆయనను ఇల్లందు తీసుకువస్తూ, డోర్నకల్ స్టేషనులో పోలీసులు ఆగారు. అప్పుడు ఆయన అరెస్టు ప్రజలకు తెలిసింది. అప్పటికే తెలంగాణ ప్రాంతంలో నిజాం వ్యతిరేక సాయుధ పోరాటం పెల్లుబికింది. కమ్యూనిస్టు పార్టీ గెరిల్లా దళాల నిర్మాణం చేపట్టింది.

విజయవాడలో సాయుధ దళ తర్ఫీదు తరువాత గెరిల్లా దళనాయకుడిగా ఆయన తిరిగి కొత్తగూడెం ప్రాంతానికి చేరుకున్నారు. భద్రాచలం సెంటర్‌లో రహస్యంగా తిరుగుతూ పార్టీ నిర్మాణానికి పునాదులు వేశారు. అయినప్పటికీ ఆయన సింగరేణి గని కార్మికులతో నిత్య సంబంధాలు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. శ్రామిక జన ఆశాజ్యోతి కామ్రేడ్ శేషగిరిరావు

2. ప్రజాస్వామ్యానికి ఎదురౌతున్న సవాళ్ళు
బివి రాఘవులు ............... 4

3. పార్టీలో ఆంతరంగిక పోరాటం
ఎస్. వీరయ్య.................... 8

4. వర్గ, సామాజిక పోరాటాల మధ్య సంబంధం
ఎ. కోటిరెడ్డి.................. 11

5. సమకాలీన భారతదేశంలో ప్రభుత్వ భూ కబ్జాలు
ప్రవీణ్ ఝా................... 14

6. మాతృత్వానికి రక్షణ కల్పించిన సోవియట్ ప్రభుత్వం
అలెగ్జాండర్ కొల్లంతాయ్.... 21

7. కార్పొరేట్ల కోసం రూపొందించిన నూతన ఆరోగ్య విధానం
టికె రాజలక్ష్మి................ 23

8. వలసలపై కాదు దోపిడిపై పోరాడాలి
డేవిడ్ యల్ విల్సన్......... 26

9. సిరియా ఆక్రమణే అమెరికా ధ్యేయం
బుడ్డిగ జమిందార్........... 30

10. బెదిరింపులతో లొంగదీస్తున్న మోడీ ప్రభుత్వం
జయతీ ఘోష్ ................ 33



సంపాదకుడు:
ఎస్. వెంకట్రావు

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248
మేనేజర్: 040-27673787
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# జమిలి ఎన్నికలు

**భా**రత దేశంలో 'ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి' ఉండాలన్న ఆర్ఎస్ఎస్ నినాదాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం క్రమంగా ఇతర రంగాలకు కూడా విస్తరిస్తున్నట్లు కనిపిస్తోంది. దేశవ్యాపితంగా ఒకేసారి ఎన్నికలు జరపాలని భారతీయ జనతా పార్టీ, కేంద్రంలోని దాని ప్రభుత్వం ఇటీవల ఎత్తుకున్న నినాదం ఆర్ఎస్ఎస్ వ్యూహంలో భాగమే. దేశవ్యాపితంగా ఒకే పన్ను విధానం ఉండాలని జిఎస్‌టిని నెగ్గించుకున్న మోడీ ప్రభుత్వం ఇప్పుడు జమిలి ఎన్నికలవైపు పరుగులు తీస్తోంది. విభిన్న జాతులు, విభిన్న సంస్కృతులు, విభిన్న భాషలు గల భారత్‌ను ఒకే దేశంగా ఐక్యంగా ఉంచేది మన రాజ్యాంగ నిర్మాతలు రూపొందించిన లౌకిక, ఫెడరల్ పాలనా చట్రం మాత్రమే. దానికి భిన్నంగా దేశంలోని సాంస్కృతిక, పరిపాలనా పరమైన వైవిధ్యాన్ని నాశనం చేసి హిందూత్వ ఎజెండా ప్రాతిపదికగా ఒకే చట్రం కిందకు తీసుకురావడానికి సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నాలు మన దేశ సమైక్యత, సమగ్రతలకు తీవ్ర ప్రమాదం తెస్తాయి.

అధికారాలు కేంద్రీకరించడం ద్వారా దేశం మొత్తాన్ని గుండుగుత్తగా దోచుకోడానికి ప్రయత్నిస్తున్న గుత్త పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు ఆర్ఎస్ఎస్ ఏక్తా 12.5

నినాదం అనుగుణంగా ఉంది కాబట్టే కార్పొరేట్ రంగం దీనికి ఉధృత ప్రచారం కల్పిస్తోంది. కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న నినాదం కూడా అధికారం కేంద్రీకరించేందుకు ఉద్దేశింప బడిందే.

కేంద్రంలో, రాష్ట్రాల్లో విడిగా ఎన్నికలు నిర్వహించడం వల్ల డబ్బు ఖర్చు ఎక్కువవుతోందని, ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వీటిని నివారించాలంటే జమిలి ఎన్నికలే శరణ్యమని బిజెపి చెబుతోంది. అందువల్ల పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను ఒకే సారినిర్వహించే పద్ధతులగురించి ఆలోచించడానికి మేధోమథన సమావేశాలు నిర్వహిస్తోంది. మరికొందరు పాలకపక్ష ప్రచారవేత్తలయితే ఈ రెంటితోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జమిలిగా నిర్వహించాలని ప్రతిపాదిస్తున్నారు. దేశంలోని 29 రాష్ట్రాలలో విభిన్నమైన రాజకీయ, సామాజిక పరిస్థితులు ఉన్నాయి. పార్లమెంటు ఎన్నికల మధ్యలో ఒక రాష్ట్ర అసెంబ్లీ రద్దయితే అక్కడ వెంటనే ఎన్నికలు జరిపిస్తారా లేక రాష్ట్రపతి పాలన విధిస్తారా అన్నది సమస్య. వివిధ పార్టీల చేర్పులు, కూర్పులతో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వడమంటే ప్రజలు ఇచ్చిన తీర్పును వమ్ముచేయడమే అవుతుంది. తదుపరి ఎన్నికల వరకు రాష్ట్రపతి పాలన విధించడం పూర్తిగా అప్రజాస్వామిక మవుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన వెంటనే ఏదో ఒక కారణంతో పార్లమెంటు రద్దయితే ఏం చేస్తారు? మళ్లీ అన్ని అసెంబ్లీలను రద్దుచేస్తారా?

ఏ విధంగా చూసినా జమిలి ఎన్నిల ఆలోచన అప్రజాస్వామికమైనది. అధికారాలు తన వద్ద కేంద్రీకరించుకోడానికి కేంద్రానికి తోడ్పడుతుంది. రెండవది ఎన్నికల్లో స్థానిక ప్రజాసమస్యల నుండి ప్రజల దృష్టి కేంద్రంలోని సమస్యలమీదికి మళ్లించే అవకాశం ఉంది. మతరాజకీయాలు నడిపే బిజెపి-ఆర్ఎస్ఎస్ పరివారానికి ఎన్నికల్లో మెజారిటీ మత ఓట్లు పొందడానికి ఇది అనుకూలమైనది. ఎన్నికల సందర్భంగా మతఘర్షణలు రెచ్చగొట్టడం, రామాలయం, ఆర్టికిల్ 370 వంటి వాటిని చర్చకు పెట్టి బిజెపి పబ్బం గడుపుకోడానికి అవకాశమిస్తుంది. రాజకీయాలను, ఎన్నికలను పూర్తిగా డబ్బు మయం చేసిన కార్పొరేట్ వర్గాలు ఇప్పుడు దాన్ని సాకుగా చూపించి జమిలి ఎన్నికల ప్రతిపాదనలు తీసుకువస్తున్నాయి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గించాలంటే దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలి, ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించాలి. వాటి గురించి మాట్లాడకుండా జమిలి ఎన్నికల గురించి చెప్పడం ప్రజలను మోసగించడానికే. ప్రజాతంత్ర వాదులంతా దీన్ని వ్యతిరేకించాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# ప్రజాస్వామ్యానికి ఎదురౌతున్న సవాళ్లు



రచయిత మార్క్సిస్టు పార్టీ
పొలిట్‌బ్యూరో సభ్యులు

**బివి రాఘవులు**

ఏప్రిల్ 22వ తేదీన్న విజయవాడలోని యంబివికెలో జరిగిన సదస్సులో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు చేసిన ప్రసంగ పాఠం.

ప్రజాస్వామ్యం గురించి, ఎన్నికల సంస్కరణల గురించి చాలా కాలం నుంచి మాట్లాడుకుంటూనే ఉన్నాం. ప్రజాస్వామ్యానికి ఇబ్బందులు, సవాళ్లు గతంలో కూడా ఎదురైనాయి. గతంలో ఎదురైన ఇబ్బందులకీ, సవాళ్లకీ ఈ రోజు ఎదురౌతున్న సవాళ్లకి చాలా వ్యత్యాసముంది. స్థూలంగా భారతదేశం ఒక పెద్ద బూర్జువా ప్రజాస్వామిక దేశం. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యాల్లో, అత్యధిక జనాభా కలిగిన ప్రజాస్వామిక దేశాలను తీసుకొంటే మనమే ఫస్ట్. ప్రపంచంలో ఉండే రాజ్యాంగాలన్నింటిని పరిశోధన చేసి, అవపోసన పట్టి వాటన్నిటిలోని మంచి విషయాలను క్రోడీకరించి ఒక గొప్ప రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నాం. అంత గొప్ప రాజ్యాంగం అని అనుకుంటున్నాం. అలాగే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ముందు పీఠిన ఉండి, రచించి మన ముందుకు తీసుకొచ్చారనీ చెప్పుకుంటున్నాం. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంలో మనం ఈ రాజ్యాంగం విశిష్టత గురించి కూడా చాలా మాట్లాడుకున్నాం. మన రాజ్యాంగంలో ఉండే అంశాలకు సంబంధించిన పరిమితి కూడా బాబా సాహెబ్ అంబేద్కర్ అప్పుడే చెప్పారు. 'రాజకీయ ప్రజాస్వామ్యం ఉంటేనే సరిపోదు. నిజంగా రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరంగా, ప్రజలకు ఉపయోగపడే పద్ధతుల్లో ఉండాలంటే సామాజిక, ఆర్థిక సమానత్వం కూడా వస్తేనే ఆ రాజకీయ సమానత్వానికి ఉపయోగపడుతుంది' అని కూడా రాజ్యాంగసభలో చెప్పారు. కాబట్టి ఆ పరిమితుల గురించి నేను చెప్పను. కానీ రాజ్యాంగంలో ఉన్న మంచి విషయాలకు కూడా ఈ రోజు చాలా తీవ్రమైన సవాళ్లు ఎదురౌతున్నాయి. కాబట్టి రాజ్యాంగాన్ని మరింత మెరుగు పర్చుకోవడం అటుంచి ఉన్న మంచి విషయాలను పోగొట్టుకోకుండా పోరాడటం ఎలా అని మనం ఆలోచన చేయాలి.

మన రాజ్యాంగంలో ప్రజాస్వామిక భావాలు ప్రధానంగా ప్రాథమిక హక్కుల రూపంలో మనముందున్నాయి. ఆ ప్రాథమిక హక్కులు ఎంత జాగ్రత్తగా, ఎంత పట్టుదలగా అమలు జరిగితే అది అంత ప్రజాస్వామికదేశం అని చెప్పుకుంటాం. ఇప్పుడేం జరుగుతోంది? రాజ్యాంగం అక్కడే ఉంది. దానిలోని ప్రాథమిక హక్కులు అక్కడే ఉన్నాయి. కానీ గత రెండేళ్లలో మన సమాజంలో ప్రాథమిక హక్కుల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. ఈ మధ్య ఒక కార్టూనిస్టుని ఉదయం వేకువజాము మూడు గంటలకే వెళ్లి పట్టుకొని పోలీసులు తుళ్లూరు తీసుకొచ్చేశారు. భార్య ఏంటని అడిగినా దురుసుగా వ్యవహరించారు. అంటే నువ్వొక కార్టూన్ పెట్టావు. ఆ కార్టూన్‌లో నీకు నచ్చింది పెట్టివుండొచ్చు. తప్పు కూడా పెట్టివుండొచ్చు. కానీ అర్ధరాత్రి వెళ్లి పట్టుకొని తీసుకొచ్చి తుళ్లూరులో పడేసేటంతటి నేరమా? కానీ విజయ్ మాల్యా వేలాది కోట్ల రూపాయలు స్వాహాజేసి లండన్‌లో కూర్చొని హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు ఆయన్ను తీసుకు రావడంలా. కానీ ఇతన్ని తీసుకొచ్చి పడేశారు. ఆక్షేపణీయ విషయం మీద నువ్వు చేస్తే దాని మీద కేసు పెట్టొచ్చు, సెక్షన్లున్నాయి, విచారణ చేయొచ్చు. విచారణ చేసి ఆ విచారణలో అరెస్టు చేయాల్సి వస్తే నోటీసులిచ్చి అరెస్టు కూడా చేయొచ్చు. ఇంకా ఏదైనా దాంట్లో క్రిమినల్ అంశముంటే ఆ విధంగా క్రిమినల్ కేసు కూడా పెట్టవచ్చు. కానీ ఒక కార్టూనిస్టు చెడ్డదో, తప్పుడుదో ఒక అభిప్రాయం వ్యక్తం చేస్తే ఆయన్ను బలవంతంగా పట్టుకొనొచ్చి పోలీసు స్టేషన్లో నిర్బంధించడమేనా? అది వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించడమా లేక భగ్నం చేయడమా? ఇలాంటి ఘటనల గురించి చాలా చెప్పొచ్చు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఒక సభ జరుపుతూ..సభలో నినాదాలు చేశారట. ఆ నినాదాలు చేశారని దేశద్రోహం కేసు పెట్టి జైళ్లో పెట్టేశారు. వాస్తవంగా ఆ నినాదాలు వాళ్లు చేయలేదని తర్వాత తేలింది. ఒకవేళ నినాదాలు జేశారనుకున్నా అటువంటివాళ్లని దేశ ద్రోహులుగా ప్రకటించాలా? ఈ దేశంలో పుట్టి, ఈ దేశంలో పెరిగి, ఈ దేశంలో చదివినవాళ్లకి.. ఒక అభ్యంతరకరమైన అభిప్రాయమే ఉందనుకుందాం. ఆ అభ్యంతరకరమైన అభిప్రాయాన్ని నువ్వు కాదనొచ్చు. తిరస్కరించొచ్చు. అది సమాజానికి అంత ప్రమాదకరంగా ఉందనంటే కేసు పెట్టొచ్చు. కానీ దేశద్రోహులుగా ప్రకటించి, విద్యార్థులను తీసుకెళ్లి జైళ్లో పెట్టడం ప్రజాస్వామికమా? ఇది ప్రజాస్వామ్యమనీ, వాక్ స్వాతంత్ర్యం హక్కులన్నీ చాలా స్వేచ్ఛగా ఉన్నాయని చెప్పుకోగలిగిన పరిస్థితి ఉంటుందా? తమిళనాడులో రచయిత ఒక పుస్తకం రాశాడు. ఆ పుస్తకం రాసినందుకు, ఆ పుస్తకం అచ్చేసినందుకు అతణ్ని ఎంత తీవ్రమైన మనో వేదనకు గురిచేశారంటే 'ఇక నేను భవిష్యత్తులో రాయను. నేను చచ్చిపోయా' అని ప్రకటించుకోవాల్సిన పరిస్థితిని సృష్టించారు. అంటే ఒక రచయిత తనకు నచ్చినట్లు రాసుకునే స్వేచ్ఛ లేదా? నీకు నచ్చినట్టే రాస్తేనే రచయితులు, నీకు నచ్చనట్టు రాస్తే రచయితలు కాదా! పన్సారే ఏం నేరం చేశారు. ఆయన్ను చంపేశారు. కల్బుర్గి హేతువాద నాయకుడు. ఆయన్ను కాల్చేశారు. మహారాష్ట్రలో హేతువాది నరేంద్ర ధబోల్కర్‌ను కాల్చేశారు. అంటే ఒక అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకే, నీ మత భావాలకో, ఉద్దేశాలకో వ్యతిరేకమైనంత మాత్రాన కాల్చేసే వాతావరణం ఇప్పుడుంది. ఇటువంటి వాటన్నిటికీ వ్యతిరేకంగా పదుల సంఖ్యలో ప్రముఖులైన రచయితలు, ప్రముఖులైన వారు, పురస్కారాలు పొందిన సాహితీవేత్తలు,

సాంస్కృతిక కార్యకర్తలు వీళ్లందరూ తమ యొక్క పురస్కారాలను తిరస్కరించి, ఇచ్చేయాల్సిన పరిస్థితొచ్చింది. ఆ ఇచ్చేసిన గొప్పగొప్ప సాంస్కృతిక కార్యకర్తలను ఏమంటారు? వీరంతా ప్రతిపక్షాల కార్యకర్తలు. అందుకే వెనక్కి ఇచ్చేశారంటారు. అంటే ఇప్పుడు పుచ్చుకున్నోళ్లంతా బిజెపి కార్యకర్తలా? ఇప్పుడు రాష్ట్రపతి, మోడీ గారు చాలా మందికి పతకాలు ఇచ్చారే. వాళ్లందరూ బిజెపి కార్యకర్తలనీ ఇచ్చారా? సమాజంలో అసహనాన్ని పాలకులు పెంచుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదం.

> **❝ ఈ దుస్తులు నువ్వు వేసుకోవాలి. ఈ దుస్తులు నువ్వు వేసుకోకూడదు. ఈ తిండి తినాలి. ఈ తిండి తినకూడదు. అని రాజ్యం నిర్ణయించే పద్ధతి ప్రజాస్వామ్యమౌతుందా? ఎవ్వరిని ప్రేమించాలో కూడా నువ్వే నిర్ణయి స్తావు. ఇద్దరు కులాంతర వివాహం చేసుకునే దానికి లేదు. వాళ్లని చంపేయాలి. ఇప్పుడు 'లవ్ జిహాద్' అంటున్నారు.❞**

ఒక మహిళా సమావేశంలో పాల్గొని మాట్లాడటానికి ఈ మధ్య కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ గారు భోపాల్ వెళ్లారు. సభకి బిజెపి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలా. పోలీసు రక్షణ కూడా ఇవ్వలేమని చెప్పేశారు. ఉజ్జయినిలో ఒక సభలో మాట్లాడుతూ విజయన్ తల తెస్తే కోటి రూపాయాలు ఇస్తానని ఒక ఆర్ఎస్ఎస్ కార్యకర్త ప్రకటించాడు. అంటే నీ అభిప్రాయాలకు భిన్నంగా మాట్లాడినందుకు తలలు తీసేస్తావా? హైదరాబాద్‌కు విజయన్ వస్తే మీటింగ్ జరగనివ్వం అని ఒక బిజెపి ఎమ్మెల్యే ప్రకటించాడు. అంటే రాజకీయ పార్టీలు మీటింగ్‌లు, సభలు పెట్టుకునేదానికి లేదా. ఆ సభల్లో నీకు నచ్చినట్టు మాట్లాడాలా. నాకు నచ్చినట్టు నా విధానంలో మాట్లాడునేందుకు అవకాశం లేదా అనేది ఈ రోజు ముఖ్యమైన సమస్య.

ఈ మధ్య ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనుల పరిస్థితి ఎలా ఉంది అని తెలుసుకోవడానికి జెఎన్‌యు నుంచి ఇద్దరు మహిళా ప్రొఫెసర్లు వెళ్లారు. వాళ్లను తీసుకెళ్లడానికి ఒక కార్యకర్త కూడా తోడు వెళ్లారు. ఈ ముగ్గురు మీద దేశద్రోహం, హత్యా ప్రయత్నం కేసులు పెట్టారు. పాపం ఆ ప్రొఫెసర్లను చూస్తే వాళ్ళు హత్యా ప్రయత్నం చేయటం ఏమిటి అనిపిస్తుంది. ఢిల్లీలో సాయిబాబా అని ఇంగ్లీషు ప్రొఫెసర్ ఉన్నాడు. నక్సలైట్ భావాలంటే ఆయనకు ఇష్టం. ఆయనను అరెస్టు చేసి, ఆయనకు యావజ్జీవ శిక్ష పడేలా సెక్షన్లు పెట్టారు. వీల్ ఛైర్‌కి పరిమితమైన పరిస్థితి. ఆయనకు యావజ్జీవ శిక్ష పడటానికి పనికి వచ్చే కేసులు పెట్టారు. భావాలతోటి ఏకీభవించకపోయినా భావం చెప్పుకునేందుకు ఉన్న హక్కును నాశనం చేసేటువంటి హక్కు ఎవ్వరికీ ఉండకూడదు.

మనం రాజ్యాంగంలో వ్యక్తి స్వాతంత్ర్యముంది. నాకు నచ్చింది నేను తినే హక్కు నాకుండాలి. నేను కూరగాయాలు తినాలా, మాంసం తినాలా, మాంసంలో కూడా ఏ వెరైటీ తినాలి అనేది నువ్వు నిర్ణయిస్తావా? నాకు నచ్చింది నేను తింటాను. నచ్చింది అంటే సాంప్ర



డా॥ బి.ఆర్. అంబేద్కర్

దాయాన్ని బట్టి, పుట్టుకను బట్టి, కుటుంబాన్ని బట్టి రకరకాలుగా ఉంటాయి. ఆ హక్కును హరించే హక్కు నీకు లేదు. ఇప్పుడు నేనేమి తినాలో చెబుతున్నారు. ఇప్పుడు యుపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌గారు ఒక ఉత్తర్వు జారీ చేశారు. సాంప్రదాయిక దుస్తులు కట్టుకున్నవాళ్లే పాఠశాలలకు రావాలి. సాంప్రదాయిక దుస్తులు కట్టుకోవడంలో తప్పేమీ లేదు. కట్టుకోదల్చిన వాళ్లు కట్టుకోవచ్చు. నాకు నచ్చిన దుస్తులు నేను కట్టుకుంటాను. సాంప్రదాయకమైన దుస్తులు కట్టుకోవచ్చు. లేకపోతే ఆధునికమైన దుస్తులు కట్టుకోవచ్చు. ఈ దుస్తులు నువ్వు వేసుకోవాలి. ఈ దుస్తులు నువ్వు వేసుకోకూడదు. ఈ తిండి తినాలి. ఈ తిండి తినకూడదు. అని రాజ్యం నిర్ణయించే పద్ధతి ప్రజాస్వామ్యమౌతుందా? ఎవ్వరిని ప్రేమించాలో కూడా నువ్వే నిర్ణయిస్తావు. ఇద్దరు కులాంతర వివాహం చేసుకునే దానికి లేదు. వాళ్లని చంపేయాలి. ఇప్పుడు 'లవ్ జిహాద్' అంటున్నారు. ఎవ్వరు ప్రేమించుకోవచ్చు. ఎవ్వరు ప్రేమించుకోకూడదు అనేది వ్యక్తిగతమైన విషయం. యాంటీ రోమియో దళాల పేరిట రాజ్యమే ఏర్పాటు చేసింది. కుల, మత, లింగ వివక్షలను చూడ కుండా సర్వసత్తాక హక్కులను ఇవ్వాలని మనదేశ రాజ్యాంగంతో పాటు ప్రతి ప్రజాస్వామిక దేశం చెబుతున్నది. కానీ మతాన్ని బట్టి కొంతమందికి హక్కులు ఉండటం, కొంతమందికి లేకపోవడం, కులాన్నీ బట్టి కొంతమందికి హక్కులు ఉండటం, కొంత మందికి లేకపోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. కొన్ని మతాల వారికి, కొన్ని కులాల వారికి హక్కుల్లేవు. ఇప్పుడు కొత్త నిర్వచనమేంటంటే ఈ మధ్య ఢిల్లీలో ఆఫ్రికా నుంచి చదువుకోవడానికి వచ్చిన కుర్రాళ్లను అన్యాయంగా కొట్టారట. దీని వెనుక జాత్యహంకారముంది, రంగు అహంకారముందని కొందరు విమర్శిస్తే.. అబ్బే 'మాకు అటువంటిదేమీ లేదు. నల్లగా ఉండే దక్షిణాది వారితో కలిసి మేము బతకడం లేదా, వారి పక్కన బతికిన మేము ఈ నల్ల వాళ్ల పక్కన బతకలేమా?' అని ఒక ప్రముఖ బిజెపి నాయకుడు ప్రకటన చేశారు. ఆ ప్రకటనలో 'దురహంకార పైత్యం ఇంకా ఎక్కువైపోయింది' అంతకున్నా రంగు దురహంకారం ఇంకేముంటుంది.

ఈ రోజు క్రమేణా ప్రజాస్వామిక హక్కులన్నిటినీ నాశనం చేసి, మన కన్ను మనమే పొడుచుకునేలా చేయించే పరిస్థితి వస్తున్నది. ప్రజాస్వామికానికి ఉన్న ముప్పును మనం అర్థం చేసుకోవాలి. ఇప్పుడు జరుగుతున్నదేంటంటే ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి హక్కులను భంగం చేయడం కాదు. వ్యక్తి యొక్క హక్కులను రాజ్యం భంగం చేస్తోంది. యుపిలో ఇదే జరుగుతోంది. రాజస్థాన్‌లో పెహ్లూఖాన్‌ని కొట్టి చంపేశారు. ఆయన చేసిందేమిటి? పశువుల సంతలో పశువులను కొనుక్కొని వాహనాల్లో తీసుకొస్తుంటే ఈ గో గూండాలు దాని మీద దాడి చేసి కొట్టటంతో పెహ్లూఖాన్ చనిపోయాడు. అసలు కథేంటి? జైపూరు మున్సిపాలిటీలో ఉండే పశువులన్నిటినీ వేలం వేశారు. వీళ్లు అక్కడ కొని అధికారికంగా తీసుకు వస్తున్నారు. మరి జైపూరు మున్సిపాలిటీ వేలమెందుకేసింది. అది చట్టవిరుద్ధమనంటే జైపూరు మునిసిపాలిటీని అనాలి. మధ్యప్రదేశ్‌లో సిమి సంస్థకు చెందిన వారని ఎనిమిది మంది ఖైదీలను ఎన్‌కౌంటర్ చేసి చంపేశారు. వారు సిమీ అనుయాయులై ఉండవచ్చు. అటువంటివారిని పట్టుకొని కఠిన

**"పార్లమెంటు పరిస్థితి ఏమిటి? రాజ్యసభని డమ్మీ చేసేశారు. చట్టం ప్రకారం ఆర్థిక బిల్లు ఏదైనా ఉంటే లోక్‌సభ ఆమోదిస్తే సరిపోతుంది. ఆర్థిక బిల్లులు కానివి అటు రాజ్యసభ, ఇటు లోక్‌సభ కలిసి చేయాల్సివుంటుంది. ఇప్పుడు ఆర్థిక బిల్లు కానివి ఏమీ లేవు. అన్నిటికీ ఆర్థిక బిల్లుల ముద్రవేసి లోక్‌సభ ఆమోదిస్తే సరిపో తోందని చెప్పేసి వ్యవహరిస్తున్నారు."**

చర్యలు కూడా తీసుకోవచ్చు. కానీ ఎన్‌కౌంటర్ చేసే హక్కు మనం రాజ్యానికి ఇవ్వొచ్చా? ఇప్పుడు నేను ఒకరిని హత్య చేస్తే శిక్షాస్మృతిలో ఏ కేసు కింద ఏ శిక్ష వేయాలో ఉంటుంది. అదే హత్య రాజ్యం చేస్తే ఏ శిక్ష వేయాలో శిక్షా స్మృతిలో ఉందా? ఎందుకు లేదంటే రాజ్యం ఇవి చేయకూడదు కాబట్టి. సమాజం లోని వ్యక్తులు చేస్తే వాటికి శిక్షలున్నాయి తప్ప ఆ శిక్షలు అమల్జేసే రాజ్యం కూడా నేరం చేయొచ్చు, దానికీ శిక్షలు వేయొచ్చు అనేది లేదు. అసలు రాజ్యం నేరం చేయకూడదంతే. ఏ ప్రజాస్వామ్యంలోనూ రాజ్యానికి అటువంటి హక్కులేదు. రాజ్యం అటువంటి హక్కును ఆపాదించుకుందంటే అది ప్రజాస్వామ్యం కాదు. ఈ రోజు అటువంటి హక్కును అపాదిం చుకుంటోంది మన రాజ్యం. మొన్న కాశ్మీర్‌లో సైన్యం ఒక కుర్రాడిని జీపుకు కట్టి ఎనిమిది ఊళ్లలో తిప్పింది. సైన్యానికి ఆ పని చేయడానికి రాజ్యాంగ హక్కు ఉందా? రాజ్యానికి నేరస్తులని శిక్షించే బాధ్యత ఉంది తప్ప నేరం చేసే హక్కు లేదు. కమ్యూనిస్టులు కోరుకునే ప్రజాస్వామ్యం ఇంకా ఉన్నతమైనది. ఇప్పుడు రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఇంకా మెరుగు చేసుకోవా ల్సివుంది. ఇప్పుడున్న ది పోగొట్టుకుంటే మనం తర్వాత మెరుగు చేసుకునేది ఉండదు. కాబట్టి ఇప్పుడున్న ప్రజాస్వామిక హక్కులను రక్షించుకో వడం చాలా ముఖ్యం.

ప్రజాస్వామ్యాన్ని ఆచరించేందుకు, అమలయ్యేందుకు రాజ్యాంగంలో కొన్ని వ్యవస్థలున్నాయి. అటువంటి వ్యవస్థలను గత రెండేళ్లలో ఈ ప్రభుత్వం ధ్వంసం చేసేస్తోంది. ఉదాహరణకు ప్రణాళికా సంఘం ధ్వంసమై పోయింది. ఒక ముఖ్యమైన ప్రజాస్వామిక పాత్ర ను ప్లానింగ్ కమిషన్ నిర్వహిస్తుంది. ఇప్పుడు దానిని రద్దు చేసి 'నీతి అయోగ్' తెచ్చారు.

ప్రజాస్వామిక పాత్ర నిర్వహించే ఇంకో రాజ్యాంగ సంస్థ అయిన రిజర్వుబ్యాంకును



కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్

నామమాత్రం చేశారు. పూర్వ గవర్నర్లు విమల్ జలాన్, వైవి రెడ్డి, ఆఖరుకు డివి సుబ్బారావు వంటివారే విమర్శలు జేశారు. ఆర్‌బిఐని రబ్బరు స్టాంపుగా మార్చేశారు. ఆ వ్యవస్థను నాశనం చేశారు.


పార్లమెంటు పరిస్థితి ఏమిటి? రాజ్యసభని డమ్మీ చేసేశారు. చట్టం ప్రకారం ఆర్థిక బిల్లు ఏదైనా ఉంటే లోక్‌సభ ఆమోదిస్తే సరిపోతుంది. ఆర్థిక బిల్లులు కానివి అటు రాజ్యసభ, ఇటు లోక్‌సభ కలిసి చేయాల్సివుంటుంది. ఇప్పుడు ఆర్థిక బిల్లు కానివి ఏమీ లేవు. అన్నిటికీ ఆర్థిక బిల్లుల ముద్రవేసి లోక్‌సభ ఆమోదిస్తే సరిపో తోందని చెప్పేసి వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి రాజ్యసభలో రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్య ముంటుంది. పెద్దలుంటారు. చర్చ జరుగు తుంది. ఒక కౌంటర్‌గా ఉంటుందని చెప్పేసి రాజ్యసభ పెట్టారు. దాన్ని మొత్తం డమ్మీ చేశారు. లోక్‌సభకు కూడా ఈ రోజు విలువ లేకుండా జేస్తున్నారు. చాలా అంశాలు కేబినెట్‌లో నిర్ణయాలు చేసి అమల్జేస్తున్నారు. రాష్ట్రాలలో సైతం కేబినెట్‌లో నిర్ణయాలు చేసేసి ముఖ్య మంత్రులు, మంత్రివర్గాలే నిర్ణయాలు చేసుకుం టూ వెళ్లిపోతున్నారు. శాసన నిర్ణయాలు చేసే సంస్థలుగా ఉన్న వాటి ప్రాధాన్యత కూడా తగ్గిం చేస్తున్నారు. మోడీ వచ్చిన తర్వాత కేబినెట్‌కు కూడా విలువుందా అంటే ఏమీలేదు. ఆయా శాఖల నిర్ణయాలు కానీ, కార్యాకలాపాలుగానీ అన్ని పిఎంఓలోనే సాగిపోతున్నాయి. ఈ రోజు దాదాపు అధికారాలన్నిటినీ ప్రధానమంత్రి గుప్పిట్లో పెట్టుకొని ఒక నిరంకుశ వాతావార ణాన్ని తీసుకొచ్చారు. బడ్జెట్‌కు ప్రాధాన్యత లేకుండా చేశారు. రైల్వే బడ్జెట్‌ను తీసేశారు. ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల విభజన తీసేశారు. దళితులకు, గిరిజనులకు సబ్‌ప్లాన్ పద్దులు లేకుండా చేశారు. ఇవన్నీ లేకుండా ఇక బడ్జెట్‌లో చూసుకునేదేముంటుంది. ఈ రకంగా బడ్జెట్‌కు ప్రాధాన్యత లేకుండా చేశారు. న్యాయవ్యవస్థకు గౌరవనీయస్థితి లేకుండా పోతున్నది.

ఆర్మీ ఛీఫ్‌గా సీనియరీటి ఉన్నవారిని నియమిస్తారు. అసాధారణ పరిస్థితులేమైనా ఉ ంటే రెండోస్థానంలో ఉన్నవారిని తీసుకొస్తారు. కానీ అలాంటి అసాధారణ పరిస్థితులేమీ లేకున్నా సీనియారిటీలో మూడో స్థానంలో ఉన్న వ్యక్తిని తీసుకొచ్చి ఆర్మీఛీఫ్‌ను చేశారు. అంటే సైన్యంలో కూడా అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి తొత్తుగా పనిచేసే వ్యక్తికి పట్టం కట్టే ప్రమాదకర దుస్థితి నెలకొంటున్నది. ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలా, ఒక నిరంకుశ జాతీయ దురహంకారాన్ని ముందుకు తీసుకెళ్లాలా అనే పరిస్థితి ఈ రోజు ముందుకొచ్చింది. జాతీయ దురంహకారం ఎప్పుడూ ఏ దేశాన్నీ ముందుకు తీసుకెళ్లలేదు. ప్రతి దేశాన్నీ రక్తపాతంలో ముంచింది. ఫాసిజం చరిత్ర చూసినా, ఫ్రెంచీ విప్లవం తర్వాత అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు యూరప్‌లో వచ్చినా ఇదే కనిపిస్తుంది. కాల్చుకొని మనం నిప్పు వేడిని తెలుసుకోనవ సరం లేదు. ఇతరుల అనుభవం నుంచి నిప్పు వేడిని తెలుసుకోవచ్చు. మన అనుభవంలోనూ చాలా చూశాము కాబట్టి ఈ ప్రజాస్వామిక హక్కులను రక్షించుకోవాల్సిన అవసరముంది.


భారతదేశ ప్రజాస్వామ్యానికి సంబంధిం చిన మూడో విషయం ఎన్నికలు. ప్రజాస్వామ్యం అంటే 1825 రోజుల్లో ఒక రోజు ఓట్లేయ్యడమే అనుకోవద్దు. 1825 రోజులూ ప్రజాస్వామ్య ముండాలి. ఆ ప్రజాస్వామిక వాతావారణంలో ఓటేయడం ఒక్క అంశం మాత్రమే అనే భావం ప్రజల్లో తీసుకురావాలి. అదిప్పుడు లేదు. ఐదు సంవత్సరాలు పరిపాలించే ఒక విధానానికి సంబంధించి మనం ఓటు వేస్తున్నామని ఆలో చించే స్థితి లేకపోయింది. డబ్బులు తీసుకొని ఓటేద్దామనే అనే భావన ప్రజల్లో తీసుకొచ్చారు. డబ్బులు చూసి, సీసాను చూసి విధానాలను

చూడకుండా ఓటేస్తామనే పరిస్థితి ఉంటే అది ప్రజాస్వామికం అనుకోవడం సరికాదు. తమిళనాడులో ఆర్‌కె నగర్‌లో వందల కోట్లలో అభ్యర్థులు డబ్బులు పంచుతున్నారని ఉప ఎన్నికను రద్దు చేశారు. ఎఐడిఎంకె అభ్యర్థి సింబల్ కోసం ఎన్నికల అధికారులకి రూ.50 కోట్లు లంచం ఇవ్వబోయారనేది ఆరోపణ. ఇప్పుడు ఆ కేసు నడుస్తోంది. ఎన్నికల కమిషన్‌ను కూడా అవినీతిలో ముంచడానికి, ప్రజలను అవినీతిలో ముంచడానికి నల్లడబ్బును కోట్లకుకోట్ల ఖర్చు చేయడానికి ఎలా వెనకాడడం లేదో అర్థమౌతుంది. లోక్‌సభ, రాజ్యసభ, పార్లమెంటు దొంగ ఓట్లను చూశాము. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందునా గ్రాడ్యుయేట్ల స్థానాల్లో కంప్యూటర్ సహాయంతో దొంగ ఓట్లను చేర్పించారు. ఎన్నికల ప్రక్రియను ఏరకంగా ధ్వంసం చేశారనేది దీన్నిబట్టి అర్థమౌతుంది. మొన్న శ్రీనగర్ ఉప ఎన్నికల్లో 7.14 శాతం పోలింగ్ నమోదైంది. అంటే డబ్బులు ఇతరత్రా కాదు అక్కడి ప్రజలు ఓటింగ్‌కే రాలేదు. ఉగ్రవాదులు తుపాకులు పెట్టి బెదిరించడం వలన రాలేద నంటే అదీ కాదు. 93 శాతం మంది అసలు ఓటు వేయకుండానే కేవలం 7.14 శాతం ఓట్లతో ఫరూక్ అబ్దుల్లా గారు ఎంపీ అయి పోయారు. మరి దీనిని ప్రజాస్వామ్యం అనుకోవాలా, ప్రజాస్వామ్యం కాదనుకోవాలో, లేకపోతే ఆ ఎన్నిక అనవసరమని రద్దు చేయాలనుకోవాలా? రద్దు చేసి మరీ ఎన్నికలు పెడితే అంతకన్నా మెరుగైనా పరిస్థితి ఉంటుందా అంటే గ్యారెంటీ లేదు. ఇప్పుడు మోడీ ఏమంటు న్నారు? ఒకేసారి ఎన్నికలు పెట్టేద్దాం అనంటు న్నారు. రెండు రకాలు, మూడు రకాల ఎన్నికలు అనవసరం అనేవాడు అసలు ఏ ఎన్నికలూ అవసరం లేదు అనే పరిస్థితికి రాడనలేము. మన దేశానికి బై క్యామరల్ అంటే లోక్‌సభ, రాజ్యసభ అలాగే రాష్ట్రాల శాసనసభలు వేర్వేరుగా ఉండేలా పెట్టడంలో ఒక ముఖ్యమైన కారణముంది. భారతదేశం ఒక ఉప ఖండం. దీనిలో అనేక భాషలున్నాయి. మతాలున్నాయి. కులాలున్నాయి. వైవిధ్యముంది. వైవిధ్యమున్న చోట అధ్యక్షతరహా పాలన పనికిరాదు. ఇంతకు ముందు అధ్యక్ష తరహా పాలన అని చెప్పి బిజెపినే హడావిడి చేసింది. తీవ్రమైన వ్యతిరేకత రావడం తో మానుకున్నారు. ఇప్పుడు ఆ మాట మాట్లడ కుండా పరోక్షంగా అదే ఉద్దేశ్యంతో ఒకేసారి ఎన్నికలు అంటున్నారు. ఒకేసారి ఎన్నికలంటే అఖిల భారత రాజకీయాలే ఈ దేశ ఎన్నికలను ప్రభావితం చేయాలి. రాష్ట్ర అవసరాలు, భావా లు ప్రభావితం చేయకూడదు. ఇప్పుడు కాశ్మీర్‌లో

> **“ ప్రపంచమంతా ప్రభుత్వాలు నచ్చకపోతే రీకాల్ చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని మెరుగుపర్చాలని ప్రయత్నాలు జరుగుతుంటే మన ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తీసేసే ఆలోచన చేస్తున్నది. అందుకని పార్లమెంటుకు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుపుతామనేది ప్రజాస్వామానికి హానికరం. ”**



తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్



ప్రొఫెసర్ కల్బుర్గి

ఒక అశం ప్రభావితం చేస్తుంది. కేరళలో ఇంకో అంశం ప్రభావితం చేస్తుంది. ఆంధ్రాలో ఇంకో అంశం ప్రభావితం చేస్తుంది. ఎమర్జెన్సీ తర్వాత ఎన్నికల్లో దేశమంతా వెల్లువలా ఇందిరాగాంధీ గెలిచేస్తోంటే ఆంధ్రప్రదేశ్‌లో చిత్తుగా ఓడి పోయింది. ఒకప్పుడు యుపిలో మాయవతి గెలిచింది. ఆప్ ఢిల్లీలో గెలిచింది. ఒక్కో రాష్ట్రం లో ఒక్కో పరిస్థితి. అందువల్ల ఇంతటి వైవిధ్య మున్న దేశంలో వైవిధ్యమైన ఎన్నికల వ్యవస్థను రద్దు చేసి అన్నీ ఒకేసారి పెడతామంటే అఖిల భారత రాజకీయాలే రాష్ట్రాలను ప్రభావితం చేయాలంటే ఈ దేశ సమైక్యతకు నష్టం వస్తుం ది. ఇదంతా దేనికి చెబుతున్నారు విడివిడిగా ఎన్నికలంటే ఖర్చు అయిపోతుందంటున్నారు. అందుకనే ఒకేసారి ఎన్నికలు జరిపితే ఖర్చు తగ్గిపోతుందంటున్నారు. యువకులను రెచ్చ గొట్టేందుకు, ఫాసిజం రెచ్చగొట్టేందుకు హిట్లర్ కూడా ఇలాంటి వాదాలే చెప్పేవాడు.

ప్రపంచమంతా ప్రభుత్వాలు నచ్చకపోతే రీకాల్ చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని మెరుగుపర్చాలని ప్రయత్నాలు జరుగుతుంటే మన ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తీసేసే ఆలోచన చేస్తున్నది. అందుకని పార్లమెంటుకు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుపుతామనేది ప్రజాస్వామానికి హానికరం.

ఇదివరకు కార్పొరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలకు నిబంధనలుండేవి. మూడేళ్ల సగటు ఆదాయంలో 7.5 శాతం లోపు మాత్రమే పార్టీలకు విరాళంగా ఇవ్వాలనీ ఉ ండేది. అది కూడా ఎవరు, ఎవరి పేరుతో ఇచ్చారో తెలియజేయాలనే నిబంధన ఉండేది. ప్రభుత్వమిప్పుడు ఆ నిబంధనలు ఎత్తేసి ఎన్నికల బాండ్లు తీసుకొచ్చింది. ఈ బాండ్ల పేరుతో కార్పొరేట్ కంపెనీలు ఎన్ని కోట్లయినా రాజకీయ పార్టీలకు ఇవ్వచ్చు. వ్యక్తులిచ్చే విరాళాల నిబంధనలనూ మార్చారు. గతంలో సామాన్య వ్యక్తులు రూ.20 వేలు మించి విరాళమిస్తే పాన్ నంబరు ఇవ్వాలని ఉండేది. ఇప్పుడు రూ.2 వేలు ఇచ్చినా పేర్లు తెలియజేయాలంటున్నారు. అంటే కార్పొరేట్ కంపెనీలు కోట్లకుకోట్లు ఇచ్చినా పేర్లు చెప్పనవసరం లేదు. సామాన్య వ్యక్తులయితే పేర్లు వెల్లడించాలి. అంటే చిన్నచిన్న పార్టీలు ప్రజాస్వామ్యంలో బతికే పరిస్థితి లేదు. పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీల అండతో పెద్దపెద్ద పార్టీలే ఉండాలనే పరిస్థితి తీసుకొచ్చారు. ఎన్నికల్లో డబ్బు ప్రమేయం లేకుండా చూడాలని అందరూ కోరుతుంటే ఆ పని చేయకుండా డబ్బుమయం చేసి పరిస్థితి వచ్చింది. ఇదివరకు చట్టవిరుద్ధంగా చేస్తున్నవాటిని, చట్టబద్ధం చేసి ఎన్నికలనే కార్పొ రేటీకరణ చేసి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేశారు.

(మిగతా 35వ పేజీలో)

పార్టీ నిర్మాణం

# పార్టీలో ఆంతరంగిక పోరాటం



రచయిత
సిపిఐ(ఎం)కేంద్రకమిటి సభ్యులు

**ఎస్.వీరయ్య**

కమ్యూనిస్టు పార్టీలో ఐక్యతే అత్యంత కీలకమైనది. ఐక్యతకు ఎదురయ్యే ఆటంకాలను అధిగమించటం, ఎదుర్కోవటం పార్టీ శ్రేణుల బాధ్యత. కార్మికవర్గ పార్టీగా తన స్వభావాన్ని నిలుపుకునేందుకు, కమ్యూనిస్టు పార్టీ లక్షణాలను కాపాడుకునేందుకు చేసే కృషిలో ఇది భాగమే. పార్టీలో అన్యవర్గ ధోరణుల మీద ఆంతరంగిక పోరాటం ద్వారానే ఇది సాధించగలము. కార్మిక వర్గ ధోరణులు కానివన్నీ అన్యవర్గ ధోరణులే. కార్మికవర్గ పార్టీకి కార్మికవర్గ లక్షణాలు పునాది. ఇతర వర్గాల ధోరణుల ప్రభావం నుంచి కార్మికవర్గ పార్టీని కాపాడుకునేందుకు చేసే కృషి ఆంతరంగిక పోరాటం. ఒక్క మాటలో చెప్పా లంటే కార్మికవర్గ లక్షణాలతో కమ్యూనిస్టు పార్టీని ఐక్యంగా నడపడం కోసమే ఆంతరంగిక పోరాటం. పార్టీ లోపల పొడచూపే అన్యవర్గ ధోరణుల మీద అంతర్గతంగా జరిగే వర్గ పోరాటమిది. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనంగా ఉన్నపుడు లేదా ఎదురుదెబ్బలు తగిలినపుడు ప్రతి చిన్న సమస్య కూడా పెద్దదిగానే ముందు కొస్తుంది. కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉన్నపుడు లేదా అనుకూల పరిస్థితులు ఉన్నపుడు పెద్ద పెద్ద లోపాలు కూడా మరుగున పడే అవకాశం ఉన్నది. తీవ్రంగా పరిగణించకుండా విస్మరించే అవకాశం ఉంటుంది. అందువల్ల మరింత అప్రమత్తంగా ఉండాలి.

కమ్యూనిస్టుల మీద అన్యవర్గ ధోరణుల ప్రభావాలకు అనేక కారణాలున్నాయి. తన వర్గ పునాది కారణంగా గానీ (కుటుంబ నేపథ్యం), పరిసరాల ప్రభావం వల్ల గానీ, శత్రువుతో పోరాడే సందర్భంగా పడే ప్రభావాల వల్ల గానీ, మిత్రులతో కలిసి పనిచేసే సందర్భంలో పడే ప్రభావాల వల్ల గానీ ఈ ధోరణులు రావచ్చు. తన కుటుంబ నేపథ్యం కార్మికవర్గం కానప్పుడు లేదా వృత్తిరీత్యా తాను కార్మికవర్గంలో భాగం కానప్పుడు ఇతర వర్గాల లక్షణాలు మనను వెన్నాడవచ్చు. మనకు తెలియకుండానే పార్టీలోకి అన్యవర్గ ధోరణులను మోసుకొస్తాము. పార్టీలో చేరేనాటికే వర్గాలు, వర్గ లక్షణాలు, వాటి పర్యవసానంగా ప్రబలే ధోరణుల గురించి స్పష్టమైన అవగాహన సాధ్యం కాకపోవచ్చు. దోపిడీ వ్యవస్థను అంతం చేయడం కోసం విప్లవ పోరాటమే లక్ష్యంగా నిర్ణయించుకుని కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షితులు అయినప్పుడు మిగతా విషయాల పట్ల స్పష్టమైన అవగాహన ఉంటుందని భావించ లేము. అందుకే పార్టీలోకి వచ్చిన తర్వాత వివిధ వర్గాల లక్షణాలు, వాటి ప్రభావాల పట్ల స్పష్టమైన, లోతైన అవగాహన ఏర్పరచుకోవాలి. అప్పుడే కార్మికవర్గ లక్షణాలకు, ఇతర వర్గాల లక్షణాలకు మధ్య వైరుధ్యం అర్థం చేసుకోగల ము. ఇతర వర్గాల లక్షణాల ప్రభావం వల్ల పార్టీకి జరిగే నష్టాన్ని అర్థం చేసుకోగలం. మన వర్గం కార్మికవర్గం. మన వర్గ లక్షణాలే మనం అలవర్చుకోవాలి. కార్మికవర్గ లక్షణాలను అలవ ర్చుకున్నప్పుడే ఇది కార్మికవర్గ పార్టీగా నిలదొక్కు కోగలదు. పార్టీలో ఐక్యతకు అదే ప్రాతిపదిక. అందువల్ల పార్టీలో చేరేటప్పుడు మనకు తెలియకుండానే మనవెంట మోసుకొచ్చిన ఇతర వర్గాల లక్షణాలను చైతన్యంతో ప్రయత్న పూర్వకంగానే వదిలించుకోవాలి. మనం ఏ వర్గం నుంచి వచ్చామనేదానితో నిమిత్తం లేకుండానే పరిసరాల ప్రభావం కూడా అన్యవర్గ ధోరణులకు దారితీయవచ్చు. భారతదేశంలో ఫ్యూడల్ సంబంధాలు ఇంకా బలంగానే ఉన్నాయి. మరోవైపు పాలకులు పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో సర్వం వ్యాపారమయమవుతున్నది. కార్మికవర్గ కుటుంబ నేపథ్యం నుండి వచ్చినప్పటికీ లేదా తానే స్వయంగా వృత్తిరీత్యా కార్మికవర్గంలో భాగమే అయినప్పటికీ ఈ పరిసరాల ప్రభావంతో ఇతర వర్గాల ప్రభావాలు పడవచ్చు. శతృవుతో పోరాడే సందర్భంగా గానీ, మిత్రులతో కలిసి పనిచేసే సందర్భంగా గానీ పడే ప్రభావాలు కూడా ఇందులో భాగమే. అందువల్ల కార్మికవర్గ లక్షణాలను అలవర్చుకోవటం గానీ, అన్యవర్గ ధోరణులు వదిలించుకోవటం గానీ జీవితంలో ఒకసారి చేసి వదిలేసే కార్యక్రమం కాదు. ఇది నిరంతర ప్రక్రియ. ఇది తనలోని అన్యవర్గ ధోరణులమీద తానే చేసే పోరాటం. ఆంతరంగిక పోరాటంలో ఇదే ఉత్తమమైనది.

సమర్థవంతమైన నాయకులు, కార్యకర్తలలో అన్యవర్గ ధోరణులు ఉంటాయా? సమర్థులు వీటికి అతీతులు కారా? అన్నది కూడా అనుక్షణం వెన్నాడే ప్రశ్నే. వీటికి మన అనుభవాలలోనే సమాధానాలున్నాయి. విప్లవాలను విజయ వంతంగా నిర్వహించిన మహానాయకులలో సైతం పొరపాటు ధోరణుల ప్రభావంతో కమ్యూ నిస్టు ఉద్యమం తీవ్రంగా నష్టపోయిన సందర్భా లున్నాయి. మావో, స్టాలిన్‌ల వంటి యోధులలో సైతం పొరపాటు ధోరణులు వ్యక్తమయ్యాయి. పార్టీలో వారికున్న స్థానం రీత్యా గానీ, పార్టీ శ్రేణులలో వారిపట్ల ఉన్న గౌరవాభిమానాల రీత్యా గానీ, ఆయా పార్టీల మీద ప్రభావాలు కూడా తీవ్రంగానే ఉన్నాయి. ఎక్కువ నష్టం జరిగింది. అందువల్ల అన్యవర్గ ధోరణులకు సమ ర్థులు, అసమర్థులు అన్న తేడా ఏమీ లేదు. ఎవరిమీదనైనా ప్రభావం చూపవచ్చు. ఇంకా చెప్పాలంటే తక్కువ సామర్థ్యం కలవారిపైన అన్యవర్గ ధోరణుల ప్రభావాలు పడినప్పుడు ఎదుర్కోవటం చాలా సులభం. ప్రశ్నించడానికి ఎవరూ వెనుకాడరు. నిర్మొహమాటంగా చర్చలు జరుగుతాయి. సమర్థులైన నాయకులు లేదా కార్యకర్తలలో ఇలాంటి ప్రభావాలు ఉన్నప్పుడే ఆంతరంగిక పోరాటం చాలా కష్టం. ప్రశ్నించడానికి మొహమాటాలు లేదా భయం అడ్డురావచ్చు. అంతే కాదు, సామర్థ్యం అనే మాట సాధారణ లక్షణాన్ని సూచించేదేమీ కాదు. సమర్థులంటే అన్ని రంగాలలో అన్ని రకాల పనులలో సమర్థులై ఉండవలసిన అవసరం లేదు. మరోమాటలో చెప్పాలంటే నిర్దిష్టంగా ఏ పనిలో లేదా ఏఏ పనులలో ఎంత సమర్థులో పరిశీలించాలి. సమర్థవంతమైన నాయకులన్న అభిప్రాయం కలిగినంత మాత్రాన అన్ని రకాలు గా సమర్థులని అనుకోవాల్సిన అవసరం లేదు. క్షేత్రస్థాయి పనిలో లేదా సమరశీల ఉద్యమాల నిర్మాణంలో లేదా పార్టీ

నిర్మాణదక్షతలో లేదా సైద్ధాంతిక రంగంలో లేదా సందర్భోచిత ఎత్తుగడలు వేయటం వంటి వాటిలో దేనిలోనైనా సమర్థులు కావచ్చు. ఒక దానిలో లేదా కొన్నిటిలో సమర్థులైనప్పుడు అన్ని రకాలా సమర్థవంతమైన నాయకులు అనే అభిప్రాయం కలిగే అవకాశం ఉన్నది. తద్వారా పెరిగే గౌరవాభిమానాలే ఇతర కార్యకర్తలు నాయకులలోని లోపాలను గుర్తించలేకుండా చేయవచ్చు. అందువల్ల సమర్థులైన నాయకుల్లో పొరపాటు ధోరణులు వ్యక్తమయినప్పుడే ఆంతరంగిక పోరాటం ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. అది మరింత సంక్లిష్టంగానూ ఉంటుంది.

> **"పొరపాటు ధోరణులకు ఎవరూ అతీతులు కారు. అతీతులమని అనుకోవడమే ఒక పొర పాటు ధోరణి. తప్పుడు ధోరణులు ఎప్పుడైనా, ఎవరిలోనైనా వ్యక్తం కావచ్చు. అలాంటి ధోరణులు రాకుండా నిరం తరం అప్రమత్తంగా ఉండాలి. అయినా వస్తే... వాటిని అధిగమించ వలసిందే. ఇందుకోసం పొరపాటు ధోర ణుల మీద పోరాడవలసిందే."**

పొరపాటు ధోరణులకు ఎవరూ అతీతులు కారు. అతీతులమని అనుకోవడమే ఒక పొర పాటు ధోరణి. తప్పుడు ధోరణులు ఎప్పుడైనా, ఎవరిలోనైనా వ్యక్తం కావచ్చు. అలాంటి ధోరణు లు రాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. అయినా వస్తే... వాటిని అధిగమించ వలసిందే. ఇందుకోసం పొరపాటు ధోరణుల మీద పోరాడవలసిందే. కామ్రేడ్స్‌ను కాపాడుకో వలసిందే... పార్టీనీ కాపాడుకోవలసిందే... పొరపాటు ధోరణులు కొంతమంది వ్యక్తుల మీద ప్రభావం చూపించవచ్చు లేదా పార్టీలో ఒక ధోరణిగా ప్రబలవచ్చు. వ్యక్తులపై పొరపాటు ధోరణుల ప్రభావాన్ని అధిగమించటం సాపేక్షం గా సులభం. పార్టీలో పొరపాటు ధోరణులు బలంగా ప్రబలితే దాని నష్టం తీవ్రంగా ఉంటుంది. విప్లవోద్యమాన్నే అది వెనకపట్టు పట్టిస్తుంది. అలాంటి సమస్యల మీద ఆంతరంగిక పోరాటం మరింత తీవ్రంగా ఉంటుంది. అది కమ్యూనిస్టు పార్టీ స్వభావాన్నీ, విప్లవ తత్వాన్నీ కాపాడుకోవడానికి సంబంధించిన సమస్య కాబట్టే ఆంతరంగిక పోరాటం అంత పదునుగానే సాగవలసి ఉంటుంది. ఇది రాజీ లేని పోరాటమే. మొత్తంమీద ఆంతరంగిక పోరాటం పొరపాటు ధోరణుల మీదనే తప్ప వ్యక్తుల మీద లేదా పార్టీ మీద కాదు. వ్యక్తులను లేదా పార్టీని కాపాడుకునేందుకు చేసే పోరాటమే తప్ప నష్టపోయేందుకు కాదు.

ఆంతరంగిక పోరాటం అంటేనే బహిరం గంగా జరగకూడనిదని అర్థం. పార్టీ ఆంతరం గిక జీవితంలో ప్రబలుతున్న పొరపాటు ధోర ణుల మీద పోరాటమే ఆంతరంగిక పోరాటం. సమాజంలో దోపిడీ వర్గాల మీద జరిగే పోరా టం బహిరంగ పోరాటం. అందుకే క్రమశిక్షణా చర్యలు కూడా సాధ్యమైనంతవరకు అంతర్గత పరిమితుల్లోనే అమలు చేసేందుకు ప్రయత్ని స్తాము. అనివార్యమైనప్పుడే అది బహిరంగ చర్యగా ఉంటుంది. ఆంతరంగిక పోరాటం పేరుతో తప్పుడు నిర్ణయాలు కూడా జరగవచ్చు. తప్పుడు పద్ధతులూ అనుసరించే అవకాశం ఉంది. ఆంతరంగిక పోరాటం పట్ల సరైన అవగా హన లోపించినప్పుడు గానీ, వాస్తవ పరిస్థితుల పట్ల సరైన అంచనా లేనప్పుడు గానీ లేదా తామే పొరపాటు ధోరణులకు లోనైనప్పుడు గానీ ఆంతరంగిక పోరాటం దారితప్పే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాలలో సమస్యను పరిష్కరించవలసిన నాయకులు లేదా కార్యకర్తలే సమస్యకు కారణమవుతారు. పార్టీలో గుంపులు కట్టడం లేదా ముఠాతత్వం పార్టీని విచ్ఛిన్నం చేస్తుంది. ఈ అవగాహన లోపించినప్పుడు ముఠాతత్వం పట్ల ఉండవలసిన కరుకుదనం లోపిస్తుంది. గుంపులు కట్టడం వల్ల నష్టమేమీ ఉండదని, పోటీ పడి పనిచేస్తారని, అంతిమం గా ఇది పార్టీ అభివృద్ధికే తోడ్పడుతుందనే అభిప్రాయం ఉంటే ఈ తప్పుడు ధోరణిని ప్రోత్సహిస్తారు. పార్టీకి తీవ్రమైన హాని చేస్తారు. ఏం చేసినా పార్టీ అభివృద్ధి కోసమే అన్న మౌలిక సూత్రం అనుక్షణం మదిలో మెదులుతూనే ఉండాలి. పార్టీ పునాదిని కాపాడుకుంటూ మరింత విస్తరించుకునేందుకే మన కృషి తోడ్పడాలి. పొరపాటు ధోరణుల నుండి నాయకులను, కార్యకర్తలను కాపాడుకునేందుకే ఈ ఆంతరంగిక పోరాటమని ముందే చెప్పుకున్నాము. కాబట్టి ఆంతరంగిక పోరాటం పేరుతో కామ్రేడ్స్‌ను కోల్పోయే స్థితి రాకుండా జాగ్రత్త పడాలి. తప్పులు చేసే కామ్రేడ్స్ పార్టీలో కొనసాగటం వల్లనే ఉద్యమానికి ఎక్కువ హాని జరుగుతుందని అంచనాకు వస్తే, వదులుకోవడమే అనివార్యం అయినప్పుడు అతి తక్కువ నష్టంతో బయటపడే మార్గం వెదకాలి. అది ప్రజా పునాదిని కోల్పోయేందుకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో దారితీయకూడదు. పార్టీలో ఆంతరంగిక పోరాటం అనివార్యం. కానీ అది ప్రజా పునాదిని కాపాడుకుంటూ జరగాలి. అందుకు అవసరమైన కసరత్తు చేయవలసిందే. పార్టీ పునాదికి తీవ్ర నష్టమేమీ ఉండదనే అంచనాతో చేసిన నిర్ణయాలు పునాది చెదిరిపోవడానికి దారితీస్తే అంచనాలో పొరపాట్లను గుర్తించాలి. సరిదిద్దుకోవాలి. నష్టం జరిగినా ఫర్వాలేదు అనే నిర్లక్ష్య ధోరణి మరింత ప్రమాదకరం. ఇలాంటి లోపాలకు అవకాశం లేకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి. అంటే ఆంతరంగిక పోరాటం పట్ల సరైన అవగాహనను ఏర్పరచుకోవాలి. క్షేత్రస్థాయి వాస్తవ సమాచారం సేకరించడం ద్వారా సరైన అంచనాకు రావాలి. తానే తప్పుడు ధోరణులకు గురికాకుండా స్వీయ నియంత్రణకు పూనుకోవాలి. పొరపాట్లను సరిదిద్దేందుకు సాగే కృషి వివిధ స్థాయిల్లో ఉంటుంది. లోపాలను ఎత్తిచూపడం, సరిదిద్దుకునేందుకు సహకరించడం నిరంతరం జరగవలసిన పని. ఈ కృషి తగిన ఫలితం చూపించనప్పుడు క్రమశిక్షణా చర్యలు అనివార్యమవుతాయి. క్రమశిక్షణా చర్యల మోతాదు కూడా సరిదిద్దే లక్ష్యంతోనే నిర్ణయించాలి. కార్యకర్తలను, నాయకులను కాపాడుకునేందుకే క్రమశిక్షణా చర్యలు. అందువల్ల సాధ్యమైనంత మేరకు క్రమశిక్షణా చర్యలు కూడా అంతర్గత చర్యలుగానే ఉండేటట్టు ప్రయత్నిస్తాము. కానీ జరుగుతున్న పొరపాట్ల ప్రభావం బహిరంగంగా కనిపిస్తున్నప్పుడు, ఇతర కామ్రేడ్స్‌మీద అది ప్రభావం చూపుతున్నప్పుడు లేదా అది బహిరంగ చర్చకు దారితీసినప్పుడు సరిదిద్దేందుకు తీసుకునే క్రమశిక్షణా చర్యలు కూడా బహిరంగంగా చెప్పవలసి వస్తుంది. క్రమశిక్షణా చర్యలు బహిరంగంగా చెప్పడమంటే పొరపాటు ధోరణులు వ్యక్తమవుతున్న కామ్రేడ్స్ పనిని సరిదిద్దడానికి అవకాశమిస్తూనే ఆ పొరపాట్ల ప్రభావం ఇతరుల మీద పడకుండా చూసుకునే ప్రయత్నమే. నష్టాన్ని పరిమితం చేసే ప్రయత్నమే ఇది. క్రమశిక్షణా చర్యకు గురవుతున్న కామ్రేడ్ సరిదిద్దుకోవాలనే కోరుకుంటాము. సరిదిద్దుకుంటే మంచిది. అది జరగనప్పుడు కనీసం మరికొంతమంది కామ్రేడ్స్‌ని నష్టపోకుండా చూసుకోవడం కోసం, స్థూలంగా పార్టీని కాపాడుకోవటం కోసమే ఇలాంటి చర్యలు

> **"వ్యక్తుల ప్రయోజనంతో నిమిత్తం లేకుండా ప్రజా ప్రయోజనం కోసం, పార్టీ ప్రయోజనం కోసం చేసే పోరాటమే సూత్రబద్ధమైన లేదా సిద్ధాంతపరమైన పోరాటం. ఉదాహరణకు, 2013 భూసేకరణ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నాన్ని సమర్థించడమా లేక వ్యతిరేకించ డమా అనేది సూత్రానికి సంబంధించిన విషయం."**

అనివార్యమవుతాయి. ఆపరేషన్ చిట్టచివరి చర్య. ఒక కామ్రేడ్‌ని సరిదిద్దడం ఇక సాధ్యం కాదు అని తేలినప్పుడు, ఆ కామ్రేడ్‌ను ఏమాత్రం పార్టీలో కొనసాగించినా మరింత నష్టం జరిగే పరిస్థితి ఉన్నప్పుడు తొలగించడం తప్ప మరో మార్గం ఉండదు. పార్టీని కాపాడుకోవటం కోసం అనివార్యమైన సందర్భాలలోనే ఇలాంటి తీవ్రమైన చర్యకు పార్టీ పూనుకుంటుంది. పార్టీ ప్రతిష్టను కాపాడుకునేందుకు, శత్రువు దాడికి అవకాశం లేకుండా చూసుకునేందుకు కూడా ఇలాంటి చర్యలు అవసరమవుతాయి. అంతిమంగా ఆంతరంగిక పోరాటం పార్టీ మరింత బలపడడానికే తప్ప బలహీనపడడానికి కాదు.

పార్టీలో ఆంతరంగిక పోరాటం మూడు పద్ధతుల్లో జరుగుతుంది. 1) సూత్రబద్ధమైన లేదా సిద్ధాంతపరమైన పోరాటం 2) సూత్ర రహితమైన లేదా సిద్ధాంతరహితమైన పోరాటం 3) సూత్రవిరుద్ధ లేదా సిద్ధాంతవిరుద్ధ పోరాటం. వీటిలో మొదటిదే సరైనది. పార్టీ ఐక్యతను కాపాడేందుకు, ఆరోగ్యకరమైన ధోరణులను పెంపొందించేందుకు, అంతిమంగా పార్టీని బలోపేతం చేసేందుకు తోడ్పడేది సూత్రబద్ధమైన పోరాటమే. మిగిలిన రెండు పద్ధతులూ నష్టదాయకం. అనేక సందర్భాలలో వీటిపట్ల సరైన అవగాహన లేనందువల్ల ఆంతరంగిక పోరాటం పేరుతో సూత్రరహిత, సూత్రవిరుద్ధ పద్ధతులను అనుసరిస్తుంటారు. పార్టీ కోసమే చేస్తున్న పోరాటమని మనస్ఫూర్తిగా, నిజాయితీగా నమ్మి చేసినప్పటికీ అవగాహనా లోపం వల్ల ఇవి ఆశించిన ఫలితాన్నివ్వవు. ఒక నష్టాన్ని నివారించే ప్రయత్నంలో మరింత నష్టపోవడానికి, ఒక తప్పును సరిదిద్దే ప్రయత్నంలో మరిన్ని తప్పులు జరగడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇక్కడ ఉద్దేశంతో నిమిత్తం లేదు. ఎంత సదుద్దేశంతో చేసినప్పటికీ సరైన పద్ధతిని అనుసరించనప్పుడు సత్ఫలితాలను ఇవ్వకపోగా మరింత నష్టానికే దారితీస్తాయి. ఇక పార్టీ ప్రయోజనం పేరుతో తన ప్రయోజనం కోసం చేసే



సిపిఎం పార్టీ సమావేశం

ప్రయత్నం పార్టీ విచ్ఛిన్నానికి దారితీస్తుంది.

వ్యక్తుల ప్రయోజనంతో నిమిత్తం లేకుండా ప్రజా ప్రయోజనం కోసం, పార్టీ ప్రయోజనం కోసం చేసే పోరాటమే సూత్రబద్ధమైన లేదా సిద్ధాంతపరమైన పోరాటం. ఉదాహరణకు, 2013 భూసేకరణ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నాన్ని సమర్థించడమా లేక వ్యతిరేకించడమా అనేది సూత్రానికి సంబంధించిన విషయం. ఈ చట్టాన్ని రద్దు చేయటం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని నిర్ణయించటం సరైందే. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలుంటే రాజీలేని పోరాటం చేయటమే సరైంది. ఒకసారి ఈ చట్టాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకించాలని నిర్ణయించిన తర్వాత వ్యతిరేకతను ఏ రూపంలో వ్యక్తం చేయాలో నిర్ణయించుకునే విషయంలో పట్టువిడుపులు ప్రదర్శించవచ్చు. ధర్నా చేయాలా లేక ప్రదర్శన చేయాలా అనే దాని మీద తెగే దాకా లాగవలసిన అవసరం లేదు. ఏ రోజు ఏ సమయంలో ఎక్కడ చేయాలనే విషయంలో కూడా పట్టువిడుపులు ప్రదర్శించాలి. ఇలాంటి విషయాల మీద పట్టువిడుపులు ప్రదర్శించకుండా పోరాడటాన్నే సూత్రరహిత పోరాటం లేదా సిద్ధాంతరహిత పోరాటం అంటాము. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను సమర్థించాలా లేక వ్యతిరేకించాలా అనేది కూడా సూత్రానికి సంబంధించిన విషయమే. వ్యతిరేకించాలన్న నిర్ణయానికి రావటం సరైనదే. వ్యతిరేకించాలని నిర్ణయించిన తర్వాత వ్యతిరేకతను వ్యక్తం చేసే రూపాల గురించి కానీ, స్థల కాల నిర్ణయాల విషయంలో గానీ పట్టువిడుపులు ప్రదర్శించవచ్చు. లేనట్టయితే అది సూత్రరహిత పోరాటమే అవుతుంది. రాజకీయ తరగతులు నిర్వహించాలా లేదా, ఏ స్థాయి వారికి నిర్వహించాలి, ఏఏ అంశాలు బోధించాలి అన్న విషయం సూత్రానికి సంబంధించిందే. ఈ విషయంలో రాజీపడనవసరం లేదు. కానీ సరైన నిర్ణయం జరిగిన తర్వాత ఈ తరగతులకు తేదీలు, స్థలం, ఉపాధ్యాయులను నిర్ణయించేటప్పుడు పట్టువిడుపులు ప్రదర్శించాలి. పట్టువిడుపులు ప్రదర్శించవలసిన సమయంలో పోరాడటమంటే అది మొండి పట్టుదలే అవుతుంది. చిన్న చిన్న విషయాల మీద అనవసరమైన రాద్ధాంతాలకు కారణమవుతుంది. అనైక్యతకు దారి తీస్తుంది. సర్దుకుపోవలసిన విషయాలలో పోట్లాడుకోవటం సరైంది కాదు. వీటన్నింటికీ భిన్నంగా వ్యక్తిగత సమస్యలను పార్టీ వేదికలమీద చర్చకు పెట్టడం అనుమతించరానిది. ఇది పార్టీలో గుంపులు కట్టడానికి, అనైక్యతకు, అంతిమంగా విచ్ఛిన్నానికి దారి తీస్తుంది. వ్యక్తిగత సమస్యలు చర్చకు పెట్టడం వల్ల పార్టీ ప్రయోజనాలకు, ప్రజా ప్రయోజనాలకు హాని జరుగుతుంది. వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల చుట్టూ గ్రూపులు ఏర్పడతాయి. పార్టీ కామ్రేడ్స్ తమ వ్యక్తిగత అప్పులు, కుటుంబ సంబంధ బాంధవ్యాలు, వ్యక్తిగత స్నేహాలు, వ్యాపార లావాదేవీలలో వచ్చే సమస్యలను పార్టీ వేదికలమీద చర్చకు పెట్టి వాటిని పార్టీ సమస్యలుగా మార్చవద్దు. వ్యక్తిగత సమస్యలను వ్యక్తిగతంగానే పరిష్కరించుకోవాలి. అందుకు భిన్నంగా వేదికపై చర్చకు పెట్టి న్యాయం కావాలనే పేరుతో కొట్లాడటం సూత్ర విరుద్ధ పోరాటమే అవుతుంది. వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం కూడా పార్టీ సహకరించవచ్చు. సమస్యలు ఎదుర్కొంటున్న కామ్రేడ్స్‌కి ఆమోదయోగ్యమైన నాయకులు వారితో వ్యక్తిగతంగా కూర్చుని వారి సమస్య పరిష్కారానికి తోడ్పడవచ్చు. ఈ పద్ధతిలో నాయకులిచ్చే సూచనలు వారికి నచ్చితే అమలు జరపవచ్చు. నచ్చకపోతే స్వీకరించకపోవచ్చు. కానీ తప్పొప్పులకు లేదా లాభనష్టాలకు పార్టీ మీద బాధ్యత మోపకూడదు. అది తమ వ్యక్తిగత విషయమన్న వాస్తవాన్ని గుర్తించాలి. స్థూలంగా ఇలాంటి వ్యక్తిగత సమస్యలను పార్టీ వేదికలమీద అధికారయుతంగా ఎజెండాలో పెట్టడం గానీ, అనధికారయుతంగా అదనపు అంశంగా చర్చించడం గానీ అనుమతించకూడదు. ❋

ఈ మాసం ప్రత్యేకం

# వర్గ, సామాజిక పోరాటాల మధ్య సంబంధం

**ఎ. కోటిరెడ్డి**



రచయిత
మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

స్వాతంత్ర్యానంతరం భారతదేశ ఆర్థిక, రాజకీయ రంగాలలో అనేక మార్పులు జరిగాయి. ఈ రంగాలలో వచ్చిన మార్పులు సామాజిక రంగాన్ని ప్రభావితం చేశాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు వెనుకబడి ఉన్నాయి. తనవర్గ అవసరాల రీత్యా ఆ రంగాలను అభివృద్ధి చేయటానికి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. జాతీయోద్యమం ప్రజలకు చేసిన వాగ్దానాలు, పోరాటంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదప్రజల ఆకాంక్షలు, స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన రైతాంగం, వ్యవసాయ కార్మికుల పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం భూసంస్కరణల చట్టాలను చేసింది. చట్టాలను నిర్వీర్యం చేసి, భూపంపకాన్ని బూటకం చేయాలని భావించినప్పటికీ ప్రజా ఉద్యమాల ఒత్తిడి ఫలితంగా ప్రభుత్వం పరిమితంగానైనా భూసంస్కరణలను అమలు చేయాల్సి వచ్చింది. వ్యవసాయోత్పత్తిని, ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచటం కోసం హరిత విప్లవాన్ని ప్రారంభించింది. రాజకీయ రంగం, ప్రభుత్వ ఉద్యోగాలలో దళితులకు రిజర్వేషన్లు కల్పించారు. బ్యాంకుల జాతీయకరణ ద్వారా రైతులు, చేతివృత్తులు, చిన్న పరిశ్రమలకు రుణాలిచ్చారు. రైతులు, బడా పెట్టుబడిదారులు, చిన్న పారిశ్రామికవేత్తలు, వివిధ రకాలైన ఉత్పత్తులు చేసేవారు, సేవారంగం, స్వయం ఉపాధి పొందేవారికి సబ్సిడీలు, అనేక రకాలైన రాయితీలను అందజేశారు. పేదలకు సంక్షేమ పథకాలను అమలుచేశారు.

చట్టాలను, భూపంపకాన్ని బూటకంగా మార్చటానికి ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న పోరాటాలు, రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాల ఫలితంగా పేదలకు కొద్దిమేరకైనా భూములను పంపకం చేయాల్సివచ్చింది. పంచిన భూమిలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు పంచినది నామమాత్రమే కాగా, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పోరాటాలు జరిగిన బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో ఎక్కువభాగం భూమిని పంచటం జరిగింది. ఈ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలోని వర్లి, అస్సాంలోని సుర్మాలోయ తదితర ప్రాంతాలతో పాటు ఆనాటి నైజాం సంస్థానం, ఆంధ్ర, జమ్మూకాశ్మీర్ తదితర ప్రాంతాలలో భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా బలమైన పోరాటాలు జరిగాయి. పార్టీ నాయకత్వంలో జరిగిన పోరాటంతో తెలంగాణాలో నైజాం పాలనను కూలదోసిన ప్రజానీకం 10 లక్షల ఎకరాల భూములను పంచుకున్నారు. ఆంధ్రప్రాంతంలోనూ అనేకచోట్ల పోరాటాల ద్వారా రైతులు, వ్యవసాయ కార్మికులు భూములను సాధించుకున్నారు. కేరళలో మొదటగా అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం భూసంస్కరణ చట్టాలను అమలు జరిపి, భూస్వాముల నుండి మిగులు భూములను స్వాధీనం చేసుకొని రైతులు, వ్యవసాయ కార్మికులకు భూపంపకం చేసింది. బెంగాల్, త్రిపురలలో ఆ తర్వాత పార్టీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు భూసంస్కరణల చట్టాలను అమలుచేసి, భూపంపకం చేశాయి. పారిశ్రామికాభివృద్ధి క్రమం ఫలితంగా వివిధ వృత్తులు దెబ్బతిన్నా బ్యాంకు రుణాలు, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను వినియోగించుకొని ప్రతివృత్తిలోనూ కొద్దిమంది ఆర్థికంగా అభివృద్ధి అయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు, బూర్జువా రాజకీయాల అవసరాల ఫలితంగా అన్ని సామాజిక తరగతులలోనూ ధనిక, మధ్యతరగతి అభివృద్ధి అయింది. ఆర్థికరంగంలో వచ్చిన మార్పులు రాజకీయ, సామాజికరంగంలోనూ మార్పులకు దారితీశాయి. వివిధ సామాజిక తరగతులలో ఆర్థికంగా పుంజుకున్న వారు రాజకీయ రంగంలోకి కూడా ప్రవేశించారు.

దేశంలో ప్రధాన రాజకీయశక్తిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వలన క్రమంగా ప్రజల మద్దత్తును కోల్పోతున్నది. ఆ లోపాన్ని పూరించుకొని ప్రజా మద్దత్తును సమీకరించటం కోసం కుల, మత, ప్రాంతీయశక్తుల సమీకరణలకు పూనుకున్నది. ప్రజలు చైతన్యవంతులై తమ హక్కుల కోసం ఆందోళనలు చేయటానికి ముందుకు రాకుండా ఉండటం కోసం మతభావాలు, మూఢ విశ్వాసాలను ప్రోత్సహించటం ప్రారంభించారు. ఫలితంగా కుల, మతశక్తులు పుంజుకోవటానికి అవకాశం వచ్చింది. అభ్యుదయ శక్తుల అభివృద్ధికి ఆటంకాలు పెరిగాయి. కుల సమీకరణలకు ప్రోత్సాహం లభించటంతో కుల, మతాలతో నిమిత్తం లేకుండా రాజకీయ విధానాల ప్రాతిపదికన ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ శక్తులకు నష్టం జరిగింది. కుల సమీకరణలు అని కులాలలోనూ తీవ్రం అయ్యాయి. కులపరమైన ఐక్యతను పెంచే భావజాలం వేరూనుకోవటం, కుల సంఘీభావం పెరగటం ప్రారంభమైంది. కుల, మతాలతో నిమిత్తం లేకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దాదాపు రెండు శతాబ్దాల పాటు జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో రూపుదిద్దుకున్న ప్రజాస్వామిక, లౌకిక భావజాలం క్రమంగా బలహీనపడటం ప్రారంభమైంది.

### సరళీకరణ విధానాల ప్రభావం

1991 నుండి దేశంలో సరళీకరణ విధానాలను అమలుచేయటం ప్రారంభమైంది. అప్పటివరకు కొనసాగుతున్న పెట్టుబడిదారీ వర్గదోపిడీని మరింత తీవ్రం చేయటమే సరళీకరణ విధానాల సారాంశం. దోపిడీ తీవ్రం అయినపుడు దానికి ప్రతిఘటన కూడా తీవ్రం అవుతుంది. తమ దోపిడీకి ఎదురయే ప్రతిఘటనను బలహీన పరచటానికి సరళీకరణ వాదులు వివిధ రకాలైన అస్థిత్వవాదాలను

**"రాజకీయాలలోకి వచ్చి ప్రజలకు సేవచేద్దామనుకొనే వారికి బదులుగా రాజకీయాలను వ్యాపారంగా భావించేవారు, రాజకీయాలే పెట్టుబడిగా లాభాలను సంపాదిద్దామనుకునే వారు తమ మధ్య పోటీలో పైచేయి సాధించటానికి కులాన్ని ఉపయోగించు కోవటం పెరిగింది. పోటీలో నెగ్గాలంటే ఎక్కువ మందిని తనవెనుక సమీకరించాలి."**




రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళనలు

ముందుకు తెచ్చి, ప్రజలను చీల్చటం ప్రారంభించారు. అంతకుముందే కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా ప్రజలను చీల్చటానికి పాలకవర్గాలు చేస్తున్న ప్రయత్నాలకు దీనితో మరింత ప్రోత్సాహం లభించింది. దోపిడీ తీవ్రం కావటంతో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు, బూర్జువా రాజకీయ పార్టీలకు ప్రజామద్దత్తు మరింతగా తగ్గటంతో అధికారంలో ఉన్న పార్టీలు తమ అధికారాన్ని నిలబెట్టుకోవటానికి, ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ప్రజామద్దత్తును పెంచుకుని తాము అధికారంలోకి రావటానికి కులం, మతం, ప్రాంతాల వారీగా ప్రజలను సమీకరించటాన్ని మరింత తీవ్రం చేశాయి. ఫలితంగా పీడిత ప్రజల ఐక్యత మరింత బలహీనపడి విచ్ఛిన్నకర, వేర్పాటువాద శక్తులు బలపడ్డాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టటమే ప్రధాన కార్యక్రమంగా ఉన్న బిజెపి ఈ పరిస్థితులను ఉపయోగించుకొని పూర్తి ప్రయోజనం పొందింది. ఈ విధంగా కుల, మతశక్తులు మరింత బలపడటానికి అనుకూలమైన పరిస్థితులను సరళీకరణ విధానాలు సృష్టించాయి.

ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా ఆర్థికాభివృద్ధి వేగంగా జరగకపోవటం, జరిగిన అభివృద్ధి ఫలితాలు ప్రజలకు చేరకపోవటం, నిరుద్యోగం పెరగటంతో ప్రజలలో, ముఖ్యంగా యువతలో అసంతృప్తి పెరిగింది. యువతలో పెరుగుతున్న అసంతృప్తి తమవర్గ పాలనకు ప్రమాదం కలిగించకుండా, ఆ అసంతృప్తిని దారి తప్పించటానికి రిజర్వేషన్ల వలన అనర్హులు విద్య, ఉద్యోగాలు పొందుతున్నారని, అందువలన అర్హులకు ఉద్యోగాలు రావటం లేదని పాలకవర్గాలు తప్పుడు ప్రచారం ప్రారంభించాయి. తద్వారా యువతలో చీలికలను తీవ్రం చేయటానికి, వారిని పరస్పరం ఘర్షణపడే శిబిరాలుగా తయారుచేయటానికి పూనుకున్నాయి. ఈ విధంగా రిజర్వేషన్లు పొందుతున్న దళితులు, గిరిజనులకు వ్యతిరేకంగా మిగతా కులాలలోని యువతను రెచ్చగొట్టారు. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాత వారికి వ్యతిరేకంగా కూడా ఇదేవిధమైన ప్రచారం ప్రారంభించారు. ఇపుడు అగ్రకులాలు, ఆధిపత్య కులాలు కూడా రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేయటం ద్వారా రిజర్వేషన్ల ప్రయోజనాలను వమ్ముచేయటానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ విధంగా యువతలో చీలికలకు పునాదులు వేయటం ద్వారా కులాల వారీగా సంఘటితం కావటాన్ని తీవ్రం చేయటానికి కావలసిన పూర్వరంగాన్ని ఏర్పరచారు.

సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత బూర్జువా రాజకీయ రంగంలో పట్టు సాధించటం, ఉన్నతస్థాయి పదవులు సంపాదించటం, వాటిని ఉపయోగించుకొని ఆర్థికంగా బలపడటం పెరిగింది. పదవులు పొందినవారు వాటిని ఉపయోగించుకొని త్వరగా ధనికులు కావటంతో త్వరగా ధనికులు కావటానికి పదవులు పొందటం ప్రధానమని భావించటం, పదవుల సాధనకోసం ఏమైనా చేయటానికి సిద్ధమౌతున్నారు. రాజకీయాలలోకి వచ్చి ప్రజలకు సేవచేద్దామనుకొనే వారికి బదులుగా రాజకీయాలను వ్యాపారంగా భావించేవారు, రాజకీయాలే పెట్టుబడిగా లాభాలను సంపాదిద్దామనుకునే వారు తమ మధ్య పోటీలో పైచేయి సాధించటానికి కులాన్ని ఉపయోగించుకోవటం పెరిగింది. పోటీలో నెగ్గాలంటే ఎక్కువ మందిని తనవెనుక సమీకరించాలి. కుల సమీకరణలో డబ్బు, అధికారం ఉన్నవారు మిగతావారిని వెనక్కునెట్టారు. ఆ విధంగా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి అయినవారు కులాన్ని తమ వెనుక సమీకరించుకుని, ఆ సమీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవటం జరుగుతున్నది. పదవుల పంపకంలో తమకు న్యాయం జరగలేదని భావించిన కొందరు నాయకులు ప్రజల అసంతృప్తిని వినియోగించుకొని ప్రాంతీయ ఉద్యమాలను పెంపొందించటం, ఒకప్రాంతం ప్రజలను మరోప్రాంతం ప్రజలకు శత్రువులుగా చూపటం ద్వారా తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు.

కుల, మత ప్రచారాలు పెరిగి, ఆ కులంలో ఆర్థికంగా అభివృద్ధి చెందినవారి వెనుక కులాన్ని సమీకరించుకోవటం పెరిగింది. ఇటువంటి ప్రచారం దిగువస్థాయి వరకు చొచ్చుకుపోయిన ఫలితంగా కులాంతర వివాహాలు చేసుకున్నవారి నుండి కులస్వచ్ఛతను కాపాడటానికి పరువు హత్యలు చేయటం లాంటి పరిణామాలకు దారి తీస్తున్నాయి. తమకు దక్కవలసిన ప్రయోజనాలను కింది కులాలు అక్రమంగా కాజేస్తున్నాయనే అభిప్రాయాన్ని పైకులాలలోని పేదలు, యువతలో పెంచుతున్నారు. పాలకుల విధానాల ఫలితంగా విద్య, ఉద్యోగాలకు దూరమౌతున్న వారు, దరిద్రంలో ఉన్నవారు ఈ ప్రచారంలో కొట్టుకుపోతున్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాల ప్రజలపై వివిధ ప్రాంతాలలో జరుగుతున్న దాడులకు ఈ ప్రచారమే ప్రధాన కారణం. అగ్రకులాలలోని భూస్వాములు, ధనికులు వెనుక ఉండి, ఆ కులంలోని పేదలు, యువకులను ముందుపెట్టి దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలపై దాడులు జరిపిస్తున్నారు. ఫలితంగా అగ్రకులాల లోని పేదలు దళితులు, గిరిజనులు, వెనుక బడిన కులాలలోని పేదల మధ్య శత్రుపూరిత మైన వాతావరణం ఏర్పడు

తున్నది. వివిధ కులాలలో కులపరంగా మరింత సంఘీభావాన్ని పెంచటానికి, ఆ కులాలలోని పేదలను తమ వెనుక సమీకరించు కోవటానికి అన్ని కులాలలోని ధనికులకు ఈ పరిస్థితి చక్కగా ఉపయోగపడు తున్నది.

**కమ్యూనిస్టు ఉద్యమానికి ఎదురౌతున్న సవాళ్ళు**

ఈ పరిస్థితులలో కమ్యూనిస్టు ఉద్యమం పెను సవాళ్ళను ఎదుర్కొంటున్నది. కమ్యూనిస్టు పార్టీ దోపిడీ వ్యవస్థ నిర్మూలన, సోషలిస్టు సమాజ సాధన లక్ష్యంగా పనిచేస్తున్నది. కష్టజీవులను ఐక్యం చేయటం ద్వారా దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది. కాని బూర్జువా వర్గం కులం, మతం, ప్రాంతం తదితర విభేదాలను ముందుకు తెచ్చి, పేదల మధ్య చీలికలు పెడుతున్నది. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఒకవ్యూహం ప్రకారం వ్యవహరిస్తూ పేదల మధ్య చీలికలను మరింత తీవ్రం చేస్తున్నాయి. వివిధ కులాలలోని పేదలు ఆయా కులాలలోని భూస్వాములు, ధనికుల వెనుక సమీకృతం కావటం శ్రామికవర్గ ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నది. భూస్వాములు, ధనికులు తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, శ్రామికవర్గ ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారు. ఫలితంగా వివిధ సామాజిక తరగతులలోని పేదలను సమీకరించటానికి అనేక ప్రతిబంధ కాలు ఏర్పడుతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో వున్న ఉద్యమాన్ని నిలబెట్టుకోవటం, విస్తరింప చేయటం కమ్యూనిస్టు పార్టీకి సవాలుగా మారింది.

> “బలమైన వర్గపోరాటాలు జరగాలంటే కార్మిక వర్గం, మొత్తం శ్రామిక ప్రజానీకాన్ని ఐక్యం చేయటం తప్పనిసరి. ఆ విధంగా ఐక్యం చేయాలంటే శ్రామికవర్గాన్ని చీల్చటానికి కట్టిన సామాజిక అడ్డుగోడలను బలహీన పర్చాలి, వాటిని కూల్చివేయాలి. కమ్యూనిస్టులు, అభ్యుదయశక్తులు చొరవతో సామాజిక పోరాటాలకు ముందుకు రావటం ద్వారానే దీనిని సాధించగలం.”



కార్మికవర్గ ఐక్య పోరాటాలే అంతిమంగా ప్రజలను దోపిడీ, పీడనలనుండి విముక్తి చేస్తాయి

బలమైన వర్గపోరాటాలు జరగాలంటే కార్మికవర్గం, మొత్తం శ్రామిక ప్రజానీకాన్ని ఐక్యం చేయటం తప్పనిసరి. ఆ విధంగా ఐక్యం చేయాలంటే శ్రామికవర్గాన్ని చీల్చటానికి కట్టిన సామాజిక అడ్డుగోడలను బలహీనపర్చాలి, వాటిని కూల్చివేయాలి. కమ్యూనిస్టులు, అభ్యుదయశక్తులు చొరవతో సామాజిక పోరాటాలకు ముందుకు రావటం ద్వారానే దీనిని సాధించగలం.

కుల, మతోన్మాదశక్తులు ఏ మేరకు బలహీనపడతాయో ఆ మేరకు శ్రామికవర్గ ఐక్యత బలపడుతుంది. ఐక్యత పెరిగేకొద్దీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు బలపడటానికి అవ కాశం ఏర్పడుతుంది. బహుళజాతి, కార్పొరేట్ సంస్థలు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు బలపడేకొద్దీ సామాజిక వివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలు మరింత వేగవంతం అవుతాయి. ఆ విధంగా వర్గదోపిడీకి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలు ఒకదాన్ని మరొకటి బలపరచు కొంటూ ముందుకు సాగుతాయి. మిగతా కష్టజీవులు, సామాజిక, వర్గపోరాటాలలో భాగస్వాములు కావలసిన ఇతర తరగతులు ఏ మేరకు పోరాటంలో పాల్గొంటారనేది పోరా టాల తీవ్రత నిర్ణయిస్తుంది. పోరాటాల తీవ్రత పెరిగేకొద్దీ మధ్య తరగతి, దళిత, వెనుకబడిన తరగతులలోని మేధావులు, అభ్యు దయశక్తులు భాగస్వాములు కావటం పెరుగుతుంది.

సామాజిక పోరాటాలను తీవ్రం చేయటం ద్వారా వర్గపోరాటాన్ని ముందుకు తీసుకుపోవటానికి కృషిచేయాలి. ఈ లక్ష్యం కోసం పనిచేస్తున్న ఇతర సంస్థలను కూడా ఐక్యంగా పోరాటంలోకి తీసుకురావటానికి ప్రయత్నం చేయాలి. అవసరం అయినచోట్ల కొత్తసంస్థలను ఏర్పాటు చేయాలి. కుల వివక్ష, అణచివేతలను అంతంచేయటానికి బలమైన సామాజిక పోరాటాలు చేయటం ద్వారా శ్రామికవర్గ ఐక్యత ను సాధించి, వర్గపోరాటాన్ని తీవ్రంచేసి, దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం ముందుకు సాగిపోవాలి. ❊

## పాఠకుల అభిప్రాయాలు

**గౌరవనీయులైన మార్క్సిస్టు పత్రికా సంపాదకులకు నమస్కరించి వ్రాయునది..**
**ఏప్రిల్ సంచికపై నా అభిప్రాయం ప్రచురించ కోరుతున్నాను.**

**సంపాదకీయం బాగుంది**

సంపాదకీయం 'హిందూ రాష్ట్ర' అనేక అంశాలను వెలుగులోనికి తీసుకొని వచ్చింది. యు.పి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కరుడుగట్టిన నేర చరిత్ర ఉన్నవాడు. అనేక కేసులు విచారణలో ఉన్నాయి. దేశాన్ని పరోక్షంగా ఆర్.ఎస్.ఎస్. పరిపాలిస్తున్నది. గోగూండాలు అరాచకాలు దళితులు, మైనారిటీలపై జరుగుతున్నాయి.

భారత పునరుజ్జీవనోద్యమం చరిత్రకు సంబంధించిన వ్యాసం సాంఘిక విప్లవ కారులను వెలుగులోనికి తీసుకొని వచ్చింది. భారతీయ సమాజానికి వాళ్ళు మార్గదర్శకులు. వారు చేపట్టిన ఉద్యమం నేడు కొనసాగించవలసి ఉంది. మార్క్సిస్టు సంచికలో మంచి మంచి వ్యాసాలు ప్రచురిస్తున్నందుకు ధన్యవాదాలు.

**– తుంపాల శ్రీరామమూర్తి,** గాజువాక

భూ సమస్య

# సమకాలీన భారతదేశంలో ప్రభుత్వ భూ కబ్జాలు

ప్రవీణ్ ఝా

*ఏప్రిల్ 9వ తేదీన విజయవాడలోని ఎం.బి.వి.కె.లో జరిగిన 'మాకినేని బసవ పున్నయ్య 25వ వర్ధంతి సభలో ప్రొఫెసర్ ప్రవీణ్ ఝా చేసిన ప్రసంగ పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం...*



రచయిత ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్

మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతవేత్తలలో అగ్రగణ్యుడు, తెలంగాణా సాయుధ పోరాట యోధుడు అయిన కామ్రేడ్ యం బసవపున్నయ్య స్మారక ఉపన్యాసం ఇవ్వటం గొప్ప గౌరవంగా నేను భావిస్తున్నాను. భారత కమ్యూనిస్టు పార్టి(మార్క్సిస్టు) వ్యవస్థాపక సభ్యులలో ఒకడైన కామ్రేడ్ బసవపున్నయ్య పార్టి కార్యక్రమాన్ని రూపొందించటంలో కీలకమైన కృషిచేశారు. చైనా కమ్యూనిస్టు పార్టి, సోవియట్ కమ్యూనిస్టు పార్టీల మధ్య చర్చలు జరుగుతున్న సందర్భంలో మిగిలిన ప్రపంచంలో వామపక్ష రాజకీయాలకు భారత కమ్యూనిస్టు ఉద్యమం ఇచ్చిన ప్రత్యేకమైన తోడ్పాటును గురించి ఆయన నొక్కిచెప్పారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశం ఎంచుకున్న అభివృద్ధి పంథా, వ్యవసాయ సంబంధాలలో పెట్టుబడిదారీ విధానం అభివృ ద్ధి, భారత రాజ్యానికి సామాజిక పునాదిగా ఉన్న బూర్జువా, భూస్వామ్య వర్గాల కూటమిని గురించి ఆయన అవగాహన చేసుకొని, విశ్లేషణ చేశారు. అభ్యుదయ మార్గంలో ఆర్థిక, సామాజి క పరివర్తన చెందటానికి తగిన వ్యూహాలను రూపొందించుకోవటం కోసం వర్గ సంబంధాలను గురించి నిర్దిష్టమైన విశ్లేషణ ఎంత అవసరమో ఇది స్పష్టం చేస్తున్నది. కామ్రేడ్ బసవపున్నయ్య విప్లవ జీవితాన్ని, ఘనతను గురించి తెలియజేసే అనేక అంశాలు ఉన్నాయి. అ విషయాలు అందరికీ తెలుసు. కాబట్టి వాటిని గురించి నేను ఎక్కువగా ప్రస్తావించను.

అభ్యుదయకరమైన, సామాజికంగా న్యాయమైన భారతదేశం కోసం ప్రధానమైన, విలువైన అనేక పోరాటాలు జరిగిన, నిర్మాణ రీత్యా ఆయన జీవితంలో ఎక్కువ భాగం అనుసంధానించబడి ఉన్న, ఆయన కార్యకలాపాలకు, ఆందోళనలకు కేంద్రంగా ఉన్న వ్యవసాయ రంగంలోని పరిణామాలను గురించి నేను చర్చిస్తాను. దీనిని ఆయనకు అర్పించే ఘనమైన నివాళిగా నేను భావిస్తున్నాను. భూ సమస్యపై అవగాహనకు సంబంధించి అభివృద్ధి చెందుతున్న దేశాలలో చర్చ జరుగుతున్న ఈ సందర్భంలో స్వాతంత్ర్యానంతర భారతదేశంలో, ప్రత్యేకంగా ఈ మధ్యకాలంలో జరుగుతున్న భూసేకరణ, భూ దురాక్రమణలపై కేంద్రీకరించి నేను ఈరోజు ప్రత్యేకంగా చర్చిస్తాను. వలస వాద గతం, సామ్రాజ్యవాద వ్యతిరేకతలతో అభివృద్ధి చెందుతున్న దేశాల చారిత్రక ప్రత్యేకతలు వాటికి ఉన్నాయి. కాబట్టి ఈ దేశాలలో వ్యవసాయ సమస్య అంటే సాధారణంగా భావించే పారిశ్రామికీకరణకు పరివర్తన చెందటం కాదు. అనేక కీలకమైన, సంక్లిష్టమైన అంశాలతో, ప్రపంచంలోని దక్షిణ భాగం నుండి భూములను, వనరులను లాక్కొనే జాతీయ, అంతర్జాతీయ బడా పెట్టుబడితో పోరాటం చేయాల్సిన అవసరంతో ఈ సమస్య ముడిబడి ఉంటుంది. ఈ దృక్పథంతో చూసినపుడు జాతీయ సార్వభౌమత్వం, భూమి, ఇతర సహజ వనరులపై ఆధిపత్యం ఈరోజు ఎదురౌతున్న సవాళ్ళయిన న్యాయమైన, స్థిరమైన, అభ్యుదయకరమైన ఆర్థిక పరివర్తన తదితర సమస్యలతో విడదీయరాకుండా వ్యవసాయక సమస్య ముడిబడి ఉన్నది.

విధానపరమైన మార్పుల ద్వారా భూమిని, వ్యవసాయ మార్కెట్లను నయా ఉదారవాద రాజ్యం తెరవటం భారతదేశంలోని సమకాలీన వ్యవసాయక సమస్యలో అతిముఖ్యమైన అంశంగా ఉన్నది. వ్యవస్థాగతంగా, విధాన పరంగా ఈ మార్పులు కార్పొరేట్ అనుకూల స్వభావం కలవి. వ్యవసాయ సంబంధాలలో మౌలికమైన మార్పులు తీసుకువస్తాయి. ఆ విధంగా భూ మార్కెట్లను తెరవటం, పెద్ద ప్రాజెక్టుల కోసమని కార్పొరేట్ సంస్థలు ప్రైవేటు, ఉమ్మడి ఆస్తులను స్వాధీనం చేసుకోవటాన్ని ప్రస్తుతం మేధావుల, రాజకీయ చర్చలలో 'భూ దురాక్రమణ' అంటున్నారు. ఇది మనదేశానికి మాత్రమే సంబంధించిన ప్రత్యేకమైన సమస్య కాదు. ప్రపంచంలోని అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ ఇదే విధంగా ఉన్నది. ప్రపంచవ్యాపితంగా జరుగుతున్న భూ ఆక్రమణలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చే ముఖ్యమైన సంస్థలలో ఒకటైన ల్యాండ్ మాట్రిక్స్ ఇచ్చిన సమాచారం ప్రకారం కార్పొరేట్ సంస్థలు మూడింట రెండువంతులు భూమిని ఆఫ్రికా ఖండంలో సేకరించాయి. ఈ క్రమం కార్మికవర్గ జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. సమకాలీన వ్యవసాయ సంబంధాలలో ముఖ్యమైన అంశంగా ముందుకు వస్తున్న, అణచివేతకు గురవుతున్న 'సరఫరా క్రమం' ( సప్లై చైన్)లో వారిలో అత్యధికులు భాగమైపోయారు. రుణవితరణ, వ్యవసాయ మార్కెట్ల పేరుతో చేస్తున్న కుయుక్తుల ద్వారా చిన్న రైతులను, కుటుంబ క్షేత్రాల్ని కార్పొరేట్ పెట్టుబడి విలీనం చేసుకోవటం యొక్క ఫలితమే ఈ విధమైన అనుసంధానం. పెట్టుబడిదారులది పైచేయి అయేలా చట్టాలను, విధానాలను రూపొందించటం ద్వారా ఈ మొత్తం క్రమంలో ఆఫ్రికన్ ప్రభుత్వాలు కీలకమైన పాత్రను పోషించాయి. లబ్ధిపొందిన వాటిలో భారతీయ వాణిజ్యసంస్థలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి చాలాకాలం నుండి ఆఫ్రికాఖండంలోని దేశాలు వ్యవసాయరంగంలో పెరుగుతున్న బహుళజాతి సంస్థల పెట్టుబడి శక్తిని ఎదుర్కొంటున్నాయి. వాటి అనుభవంనుండి మనం తప్పనిసరిగా కొన్ని పాఠాలను నేర్చుకోవాలి.

అంతర్జాతీయ అనుభవాలను విశ్లేషించకుండా భారత పాలకవర్గాలు, రాజ్యం వ్యవసాయ రంగంలోకి బడా పెట్టుబడి ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఎక్కువ రాష్ట్రాలలో వాస్తవంగా భూ సంస్కరణలను అమలు చేయకపోవటం వలన దేశంలో గ్రామీణ సమాజంలో అభ్యుదయకరమైన అభివృద్ధికి ఆటంకం కలగటం

అందరికీ తెలిసిన విషయమే. సరళీకరణ విధానాలకు ముందుకాలంలో అతి నెమ్మదిగా అమలు జరిగిన భూసంస్కరణలు గ్రామీణ జీవితంలోని వ్యవస్థాగతమైన అసమానతలపై దృష్టి సారించలేదు. నయా ఉదారవాద విధానాలు అమలు జరుగుతున్న కాలంలో భూ సంస్కరణలను దాదాపుగా వెనక్కు తిప్పటంతో అవి మరింత తీవ్రం అయ్యాయి. యస్‌సి, యస్‌టి యేతరులు భూసంస్కరణల ఫలితాలలో ఎక్కువ భాగం పొందటం అసమానంగా ఉన్నదని భూ సంస్కరణలపై చేసిన విశ్లేషణలో స్పష్టమైంది. అంతకు ముందుగానే భూ పున:పంపకంలో జాయింటు పట్టాలు, మహిళల భూమి హక్కుల సమస్యలను వదిలివేశారు.

వ్యవసాయరంగం, సహజ వనరులపై ఆధిపత్యం వహించటానికి ప్రభుత్వం భూసేకరణను ప్రధాన సాధనంగా ఎంచుకుని, అందుకు అనుగుణమైన విధానాలను అనుసరించటం ఒక ముఖ్యాంశంగా ఉన్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాలు రైతులను భూములు లేనివారుగా మార్చుతున్నాయి. సంస్కరణలకు ముందుకాలంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను ఏర్పాటు చేయటానికి, లేదా వ్యవసాయ విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలకు 1894 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం భూములను సేకరించేది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగకల్పనకు అవసరమైన ప్రాజెక్టులకు భూమిని సేకరించటం అవసరంగా భావించేవారు. ఈ కార్యకలపాలను ' ప్రజల ప్రయోజనం కోసం' అని నిర్వచించేవారు. దానిని విమర్శనాత్మకంగా పరిశీలన చేయటం పెరగటంతో అందరికీ స్పష్టమైనట్లుగానే 'ప్రజావసరాల కోసం' అనేదాన్ని పూర్తిగా, ప్రధానంగా హరిత విప్లవం ప్రారంభమైన తర్వాత దుర్వినియోగం చేశారు.

సంస్కరణలకు ముందుకాలంలో భూ సేకరణను క్రమబద్ధీకరించటం, మధ్యవర్తిగా వ్యవహరించటాలను ప్రభుత్వం గణనీయంగా చేసినప్పటికీ, కార్పొరేట్ సంస్థలు భూములను స్వాధీనం చేసుకోవటానికి కొన్ని అవకాశాలు, పద్ధతులు ఎప్పుడూ ఉండేవి. అడవుల పరిరక్షణ చట్టం 1980, పర్యావరణ రక్షణచట్టం 1986 చట్టాలను ఆమోదించిన తర్వాత ప్రభుత్వ జోక్యం క్రమంగా తగ్గటంతో తమకు అవసరమైన క్లియరెన్స్‌లు వస్తే పారిశ్రామికవేత్తలు, మైనింగ్ కంపెనీలు, ఇతర బడాపెట్టుబడులకు భూములను సేకరించటం సులభమైంది. ఈ రెండు చట్టాల కింద ప్రాజెక్టుల కోసం దరఖాస్తు చేసుకున్న కంపెనీలు సవివరమైన ప్రాజెక్టు

**"ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు పెద్ద ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ యాజమాన్యంలోని భూములు సేకరించటాన్ని ఈ నిబంధనలు 'సూత్రప్రాయంగా' అంగీకరించాయి. భూ మార్కెట్‌ను ప్రారంభించటంలో ఇది మొదటి అడుగు. మొదట్లో కార్పొరేట్ల ప్రమేయం పరిమితంగా ఉండేది."**

రిపోర్టును తయారుచేసి, పని ప్రారంభించటానికి ముందే నిపుణుల కమిటి ఆమోదాన్ని పొందాల్సి ఉండేది. ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు పెద్ద ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ యాజమాన్యంలోని భూములు సేకరించటాన్ని ఈ నిబంధనలు 'సూత్రప్రాయంగా' అంగీకరించాయి. భూ మార్కెట్‌ను ప్రారంభించటంలో ఇది మొదటి అడుగు. మొదట్లో కార్పొరేట్ల ప్రమేయం పరిమితంగా ఉండేది. బడా కంపెనీలు, ముఖ్యంగా మైనింగ్, ఇతర ఖనిజాలను వెలికితీసే కంపెనీలు ఈ చట్టాలలోని లొసుగులను, నిబంధనలను అడ్డం పెట్టుకొని రైతులను భూముల నుండి తొలగించటం, భూములకు దూరం చేయటం ప్రారంభించాయి. 1947-1990 మధ్య ప్రాజెక్టుల వలన ప్రభావితమైనవారు, భూముల నుండి తొలగించబడినవారు 2 కోట్ల 31 లక్షల మంది ఉన్నారని ఒక అధ్యయనంలో వెల్లడైన సమాచారం స్పష్టం చేసింది. 1990 నుండి 2000 మధ్య వీరు 6 కోట్లకు ( 3 కోట్ల 60 లక్షలు అదనంగా) పెరిగారు. వీరిలో 70శాతం దళితులు, గిరిజనులు ఉన్నారు. ఈ చట్టాలను ఆమోదించిన తర్వాత భూ సేకరణ వేగవంతం కావటాన్ని ఈ అంశాలు స్పష్టం చేస్తున్నాయి.

కాబట్టి రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర సామాజిక ఉద్యమాలు ప్రారంభమై, 'సామాజిక అవసరాలు' అంటే ఏమిటో అత్యవసరంగా స్పష్టం చేయాలని డిమాండ్ చేయటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. సాధ్యమైతే బీడు భూములు, పర్రభూములను ప్రభుత్వం తీసుకోవటానికి ప్రాధాన్యతనివ్వాలని కోరారు. భూసేకరణ, అందువలన ప్రభావితం అయ్యే ప్రజల ' సంపూర్ణ సహకారం' ( ఇన్‌ఫార్మ్డ్ కాన్సెంట్)ప్రాతిపదికగా జరగాలని, దానితో పాటు ఆర్థికంగా, సామాజికంగా ప్రత్యామ్నాయ పునరావాస పథకంతో కూడి ఉండాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో పెరుగుతున్న వత్తిడి వలన చారిత్రకంగా అవకాశాలు కోల్పోయిన, బలహీనులైన షెడ్యూల్ 5 ప్రాంతంలో నివసిస్తున్న సామాజిక గ్రూపుల వారికి రక్షణ కల్పించటం కోసం పెసాను ఆమోదించారు. నివాసుల సంపూర్ణ అంగీకారం కావాలని, సమతా తీర్పుకు అనుగుణంగా వ్యవహరించాలని పెసా చెప్పింది. ఏమైనప్పటికీ హక్కులపై ఆధార పడిన ఈ చట్టాలు, విధానాలలోని అంశాలు సవరించాల్సి ఉన్న భూసేకరణ చట్టంతో మిళితం అయ్యేవిధంగా లేవు. కష్టపడే పేదల ప్రయోజనాల ప్రాతిపదికగా చూసినపుడు ఈ చట్టాలను సవరించాల్సి ఉంది.

కార్పొరేట్ సంస్థల పెట్టుబడులను ఆకర్షించాలనే వ్యూహంతో ఈ మధ్యకాలంలో అమలుచేస్తున్న సంస్కరణలు, పరిశ్రమలకు అనుకూలమైన విధానాల ఫలితంగా సామాజిక ఘర్షణల సంఖ్య పెరుగుతున్నది.

పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి 2,000 దశాబ్దం మొదట్లో నియమించిన గోవిందరాజన్ కమిటి పర్యావరణం, అడవులను తొలగించటానికి సంబంధించిన అంశాలు పెట్టుబడులను ఆకర్షించటానికి ప్రధాన ఆటంకాలుగా ఉన్నాయని స్పష్టంగా చెప్పింది. ఉమ్మడి ఆస్థులుగా ఉన్న అటవీభూములను అటవీయేతర అవసరాలైన గనుల తవ్వకం, నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించటం, పరిశ్రమలకు కేటాయించటం అత్యంత వేగంగా పెరిగింది. 1980-2016 మధ్య 38 లక్షల ఎకరాలను పెద్ద ప్రాజెక్టుల కోసం కేటాయించారు. ఈ మొత్తంలోని సగానికి పైగా భూమిని 2001 తర్వాతే అందుకోసం మళ్ళించారు. పర్యావరణ ప్రభావ అంచనా చట్టాలను నీరుగార్చటం, భూ వర్గీకరణ నిబంధనలను మార్చటం, గిరిజన ప్రాంతాలలోని నివసిస్తున్న వారికి భూమిపైగల హక్కులను రక్షించే చట్టాలను సడలించటం, భూసంస్కరణల చట్టాలను నీరుగార్చటం తదితరాలతో కలిసి ఈ విధంగా భూములను మళ్ళించటం పెరిగింది.

ఏకగవాక్ష అనుమతుల విధానం ద్వారా పారిశ్రామిక పెట్టుబడులకు అవసరమైన ప్రాం

**“ 2013లో ప్రవేశపెట్టిన బిల్లు భూసేకరణ విధానంలో కొన్ని మౌలికమైన మార్పులను తీసుకొచ్చింది. మొదటగా 'ప్రజావసరాలు' అనేదానిని స్పష్టంచేసి, దాని అర్థాన్ని విస్తృతంచేసింది. 1. ప్రజావసరాల కోసం. 2. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్. 3. ప్రైవేటు అవసరాలు. ఈ మూడింటి కోసం భూములను సేకరించవచ్చునని చెప్పింది.”**

తాలను గుర్తించే అధికారాన్ని జిల్లా కమీషనర్‌కు ఇచ్చిన 2005లో ఆమోదించిన స్పెషల్ ఎకనామిక్ జోన్ చట్టంతో పెట్టుబడికి అనుకూలంగా విధానపరంగా ప్రధానమైన ఊపువచ్చింది. పెట్టుబడులను ఆకర్షించటం కోసం పారిశ్రామిక సంస్థలకు పన్ను రాయితీలను ఇచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో సెజ్‌లు తీర ప్రాంత క్రమబద్ధీకరణ నిబంధనల లాంటి ఏ విధమైన పర్యావరణ నిబంధనలకు కట్టుబడాల్సిన అవసరం లేదని చెప్పారు. వాస్తవంగా ఆర్థికపరంగా సున్నితమైన తీరప్రాంతాల్లోకి సెజ్‌లు రావటానికి వీలుగా ఈ నిబంధనలను సవరించారు. కార్పొరేట్ సంస్థలకు బదలాయించే భూముల స్వభావంపైనా, కార్మికచట్టాలను మినహాయించిన చట్టంలోని క్లాజులపై స్పష్టమైన నిబంధనలు లేవు. ప్రాజెక్టు ఫలితంగా దెబ్బతిన్న సమాజానికి, స్థానిక ప్రజల ప్రయోజనాలను కాపాడటం కోసం ఖచ్చితంగా వ్యవహరించగలిగే రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేయలేదు.

2006లో నూతన పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్‌ను తిరిగి రూపొందించినపుడు సంస్కరణల అమలులో రెండవ ప్రధాన చర్యను తీసుకున్నారు. అంచనా వేసే పద్ధతులను నూతన నోటిఫికేషన్ సడలించటమేకాక పరిమాణం, అవకాశాల ప్రాతిపదికగా అప్పటికే ఉన్న ప్రాజెక్టులకు కొన్ని మినహాయింపులు ఇచ్చింది. 20,000 చదరపు మీటర్ల కన్నా తక్కువ ఉన్న నిర్మాణ ప్రాజెక్టులు, 450 మెగావాట్ల కన్నా తక్కువ ఉత్పాదకశక్తి ఉన్న విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు కూడా మినహాయింపు ఇచ్చారు. నిర్దేశించిన పరిమితిలో కంపెనీలు తమ నిర్మాణం, గనుల తవ్వకం కార్యకలాపాలను విస్తరింపజేసుకోవటానికి అవకాశం ఇచ్చారు. సింగిల్ విండో విధానం ద్వారా ఈ వ్యవస్థ తనకుతాను క్రమబద్ధీకరించుకునే విధంగా చేయాలని ప్రయత్నం చేశారు. పర్యావరణ చట్టంలో మొదటిసారిగా సంపూర్ణ అంగీకార విధానాలను చేర్చినప్పటికీ, ఆచరణలో అవి చాలా బలహీనంగా ఉన్నాయి. తర్వాత వరుసగా వచ్చిన ప్రభుత్వాలు తమ నోటిఫికేషన్‌లు ప్రపంచస్థాయి స్టాండర్డ్ అనిచెబుతున్నప్పటికీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలలో, ప్రతిస్థాయిలోనూ స్థానిక ప్రభుత్వాలకు కూడా అవకాశం కల్పించాలనే అంతర్జాతీయంగా అంగీకరించిన నిబంధనలను అమలుచేయటం లేదు. వాస్తవానికి నోటిఫికేషన్ ఇచ్చిన 90 రోజుల లోపల చర్చలు జరిపి, ప్రజల అభిప్రాయాన్ని తీసుకోవటానికి పరిస్థితులు అనుకూలంగా లేకపోతే దాన్ని వదిలేయమని చెబుతున్నది. ఆ విధమైన రాయితీ పరిశ్రమలకు పెద్ద మొత్తంలో భూములు బదలాయించటానికి తలుపులు తెరిచి, పెసా చట్టానికి ప్రతికూలంగా ఉన్నది. ఆ తర్వాత ప్రస్తుత యన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రానిక్ సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు.

1894 భూసేకరణ చట్టానికి మౌలికమైన సవరణలు చేస్తూ బిల్లు ప్రవేశపెట్టటం ద్వారా మూడవ, అత్యంత ప్రధానమైన చర్యను తీసుకున్నారు. 2008లో యుపిఎ ప్రభుత్వం ది లాండ్ అక్విజిషన్ (సవరణ) బిల్లును, రిసెటిల్‌మెంట్ అండ్ రిహబిలిటేషన్, ఈ రెండు నూతన బిల్లులను ప్రతిపాదించింది. ఆ తర్వాత 2013 వరకు అనేక సవరణలు వచ్చినప్పటికీ 1894 చట్టం మౌలిక స్వభావాన్ని మార్చలేదు. 2008లో ప్రతిపాదించిన బిల్లులు కూడా పార్లమెంటు సెలెక్ట్ కమిటీకి పంపారు. రెండు బిల్లులను కలిపేయాలని కమిటి సిఫార్సు చేసింది. అందుకనుగుణంగానే 2013లో రైట్ టు ఫెయిర్ కాంపెన్సేషన్ అండ్ ట్రాన్సపరెన్సీ ఇన్ లాండ్ ఎక్విజిషన్ రిహబిలిటేషన్ అండ్ రీ సెటిల్‌మెంట్ (2013 భూసేకరణ చట్టం) బిల్లును యుపిఎ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. 2013లో ప్రవేశపెట్టిన బిల్లు భూసేకరణ విధానంలో కొన్ని మౌలికమైన మార్పులను తీసుకొచ్చింది. మొదటగా 'ప్రజావసరాలు' అనేదానిని స్పష్టం చేసి, దాని అర్థాన్ని విస్తృతం చేసింది. 1. ప్రజావసరాల కోసం. 2. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్. 3. ప్రైవేటు అవసరాలు. ఈ మూడింటి కోసం భూములను సేకరించవచ్చునని చెప్పింది. ప్రైవేటు సంస్థలు తమ అవసరాల కోసం 70 శాతం భూమిని మార్కెట్ ధరకు సేకరిస్తే మిగిలిన 30 శాతాన్ని ప్రజావసరాల క్లాజు ప్రకారం సేకరించవచ్చునని చట్టంలో పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ధార్మికసంస్థలు భూములు సేకరించటానికి అనుమతించినప్పటికీ ప్రైవేటు సంస్థలను అదుపు చేయటంలో ఇది కొద్దిపాటి ఓదార్పు మాత్రమే. మౌలిక వసతుల ప్రాజెక్టులను ఎక్కువగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాజెక్టులుగా చూపటంతో కార్పొరేట్ సంస్థలు అతి తక్కువ పరిహారంతో భూమిని పొందుతున్నాయి. ఎక్కువ పంటలు పండే వ్యవసాయభూమిని ఇతర అవసరాలకు మళ్ళించటంపై ఈ చట్టం పరిమితులను విధించినప్పటికీ, వ్యవసాయ భూమిని మళ్ళించటం చివరి అవకాశంగా పేర్కొనలేదు. అంగీకరించిన భూ వినియోగ ప్రణాళికకు అనుగుణంగా అన్ని ప్రజావసరాల ప్రాజెక్టులకు భూమిని కేటాయిస్తామని చెప్పలేదు. గనులు, నిర్మాణం లాంటి 16 రంగాలకు చట్టం నుండి మినహాయింపు ఇచ్చారు. దీనితో ఈ రంగాలలోకి పెట్టుబడులను ఆకర్షించటం అనేపేరుతో కార్పొరేట్ సంస్థలు స్వేచ్ఛగా వ్యవహరించ టానికి అవకాశం కల్పించింది. ప్రభుత్వ అభివృద్ధి వ్యూహంలో దీనికి ప్రాధాన్యత లభించింది.


ఒక పరిమితికి మించిన ప్రాజెక్టులకు పర్యావరణ, సామాజిక ప్రభావ అధ్యయన విధానాన్ని ప్రవేశపెట్టటం 2013 చట్టం తీసుకొచ్చిన రెండవ ప్రధాన మార్పు. ఈ ప్రారంభ పరిమితిని షెడ్యూల్ 5, షెడ్యూల్ 6 ఏరియాల లో అమలు జరుపుతున్న తీరు రక్షణ షెడ్యూళ్ళను నీరుగార్చటానికి గేట్లెత్తే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని భూహక్కుల ఉద్యమ కార్యకర్తలు విమర్శించటానికి దారితీశాయి. ఈ చట్టాన్ని అమలు చేయకముందు ఈ షెడ్యూళ్ళను ప్రైవేటు వారు భూములను సేకరించటానికి వినియోగించ లేదు. మరోవైపున కాన్సెంట్ క్లాజు ప్రకారం ప్రజావసరాల కోసం అయితే 70, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాజెక్టు కోసం అయితే 80 శాతం ప్రజల అంగీకారం కావాలి. ప్రభుత్వ ప్రాజెక్టులు, సామాజిక మౌలిక సదుపాయాలు కల్పించే వాటిని గురించి మౌనంగా ఉన్నది. ప్రజల ప్రయోజనం కోసం ఈ ప్రాజెక్టులు పనిచేస్తాయని, కాబట్టి ప్రజలు వాటిని సమర్థిస్తారని

భావించారు. కాని రాష్ట్రాలలో జరుగుతున్న అభివృద్ధి తీరుచూస్తే కార్పొరేట్ సంస్థలు ప్రవేశించటానికి మార్గాన్ని సుగమం చేసే విధంగా, ముఖ్యంగా వనరులతో నిండిన జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలలోకి ప్రవేశించటానికి సామాజిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వినియోగించు కుంటున్నారు. కాబట్టి ప్రాజెక్టుల లక్ష్యం ఏమైనప్పటికీ 100 శాతం అంగీకారం అవసర మయ్యే విధంగా కాన్సెంట్ క్లాజ్‌ను సవరించాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆందోళన చేయటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. సేకరించిన అవసరాల కోసం ఐదు సంవత్సరాలలో ఆ భూమిని వినియోగించుకోలేకపోతే భూమిని తిరిగి యజమానులకు అప్పగించాలని బిల్లులో పేర్కొన్నారు.

2007 అటవీహక్కుల చట్టంలో చెప్పిన విధంగా అటవీభూములకు సంబంధించిన వివాదాలన్నింటినీ భూసేకరణ ప్రారంభానికి ముందే పరిష్కరించుకోవాలన్న అంశాన్ని బిల్లులో చేర్చకుండా వదిలివేయటం ప్రధానమైన లోపం. ఉమ్మడి ఆస్థులను క్రమబద్ధీకరించటం, మహిళల సమస్యలకు సంబంధించిన అంశాలలో కూడా బిల్లు బలహీనంగానే ఉన్నది. మహిళా ఉద్యమం లేవనెత్తుతున్న ప్రధాన డిమాండ్లయిన జాయింటు పట్టాలు, ఒంటరి మహిళల హక్కులు, కుమార్తెలకు పరిహారం చెల్లించటం, లింగపరంగా సున్నితమైన సామాజిక అధ్యయనాలు, పునరావాస పథకాలు తదితరాలను గురించి 21వ శతాబ్దంలో రూపొందించిన ఈ బిల్లులో పేర్కొనలేదు. పార్లమెంటు సెలెక్టు కమిటి ఈ బిల్లులో పైన చెప్పిన కొన్ని లోపాలను తొలగిస్తుందని, అంతిమ రూపంలో ఈ బిల్లు మరింత మెరుగుగా ఉంటుందని హక్కుల గ్రూపులు భావించాయి.

ఈ బిల్లును నీరుగార్చటానికి కార్పొరేట్ లాబీయిస్టులు ఏ విధంగా ప్రయత్నం చేశారో బిల్లుపై జరిగిన చర్చలు స్పష్టం చేశాయి. ఆ సమయంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారతీయ జనతా పార్టి 2013 బిల్లును అభివృద్ధికి వ్యతిరేకమైనదని చెప్పింది. కాని ఈ చట్టం ఆమోదం పొందటం విస్తృతమైన ప్రజాతంత్ర ఉద్యమం కొన్ని పరిమితమైన ప్రయోజనాలు పొందిందని తెలుపుతున్నది. ప్రభుత్వం కార్పొరేట్ల వత్తిడికి లొంగిపోతున్నదని, ఇంతకు ముందే బలహీనంగా ఉన్న చట్టాన్ని మరింత బలహీనం చేస్తున్నదని 2014 మే నెలలో అధికారానికి వచ్చిన తర్వాత బిజెపి ప్రభుత్వం తీసుకున్న వైఖరి స్పష్టం చేస్తున్నది. నూతన యన్‌డిఎ ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్తబిల్లు

"నూతన యన్‌డిఎ ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్తబిల్లు రాజ్యసభలో ప్రతిపక్షం మెజారిటీగా ఉండటంతో ఆమోదం పొందలేకపోయింది. ఆ తర్వాత కార్పొరేట్ లాబీయిస్టుల వత్తిడితో 2013 చట్టాన్ని నీరుగార్చటానికి ఆర్డినెన్స్ మార్గాన్ని ఎంచుకున్నది. ఆర్డినెన్స్ చట్టాన్ని ఏ విధంగా నీరుగారుస్తుందో కింది టేబుల్ స్పష్టం చేస్తుంది."



అభివృద్ధి పేరుతో ఆవాసాలనుండి వెళ్లగొట్టబడుతున్న గిరిజనులు

రాజ్యసభలో ప్రతిపక్షం మెజారిటీగా ఉండటంతో ఆమోదం పొందలేక పోయింది. ఆ తర్వాత కార్పొరేట్ లాబీయిస్టుల వత్తిడితో 2013 చట్టాన్ని నీరుగార్చటానికి ఆర్డినెన్స్ మార్గాన్ని ఎంచుకున్నది. ఆర్డినెన్స్ చట్టాన్ని ఏ విధంగా నీరుగారుస్తుందో కింది టేబుల్ స్పష్టం చేస్తుంది.

1. ప్రాజెక్టుల వలన ప్రభావితం అవుతున్న ప్రజలలో కనీసం 80 శాతం మంది అంగీకారం కావాలని 'కాన్సెంట్ క్లాజ్' ను చేర్చటం ద్వారా 1894 చట్టం కన్నా 2013 చట్టం ముందుకుపోయింది.

ఆర్డినెన్స్ ఈ క్లాజ్‌కు ఐదు కీలకమైన సవరణలు చేసింది. 1. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాజెక్టులు 2. పారిశ్రామిక కారిడార్లు, రక్షణ రంగం 3. గృహ నిర్మాణం 4. గ్రామీణ మౌలిక సదుపాయాలు 5. సామాజిక మౌలిక సదుపాయాలు.

2. ప్రభావితమౌతున్న ప్రజలతో సామాజిక ప్రభావ అంచనాను చేర్చటం ద్వారా 1894 చట్టం కన్నా 2013 చట్టం ముందుకుపోయింది. ఆర్డినెన్స్‌లో ఈ అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టారు.

3. ఒకటి కన్నా ఎక్కువ పంటలు పండే భూముల సేకరణపై 2013 చట్టం పరిమితిని విధించింది.

ఆర్డినెన్స్ దీనినుండి ఈ కింది ఐదు అంశాలను మినహాయించింది. 1. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాజెక్టులు 2. పారిశ్రామిక కారిడార్లు, రక్షణ రంగం 3. గృహ నిర్మాణం 4. గ్రామీణ మౌలిక సదుపాయాలు 5. సామాజిక మౌలిక సదుపాయాలు.

4. భూమిని సేకరించిన తర్వాత ఐదు సంవత్సరాలలో ఆ ప్రాజెక్టును పూర్తి చేయనట్లయితే భూమిని యజమానికి తిరిగి ఇవ్వాలని చెప్పటం ద్వారా 2013 చట్టం ముందుకు పోయింది.

ఆర్డినెన్స్ దీనిని మార్చింది. ప్రాజెక్టును పూర్తిచేయటానికి నిర్దిష్టమైన సమయాన్ని పేర్కొనలేదు. తనకుతాను పెట్టుకున్న కాల పరిమితిలో ప్రాజెక్టును పూర్తిచేయాలని మాత్రమే చెప్పింది.

5. భూసేకరణ, పునరావాసం, రిసెటిల్మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని చట్టంలో చెప్పారు.

ఏదైనా అప్పీలును కలెక్టరు ఆమోదించి పైస్థాయికి పంపాలని, దాన్ననుసరించి సంబంధిత పార్టీలన్నింటికి నోటీసులు ఇస్తామని

“ఈ విజ్ఞప్తికి తక్షణమే ప్రతిస్పందన వచ్చింది. 2015 ఆర్డినెన్స్‌లోని అన్ని ప్రజావ్యతి రేక అంశాలను చేర్చి 2016 చట్టం (సవరణ) ద్వారా గుజరాత్ ప్రభుత్వం మొదటగా చట్టాన్ని ఆమోదించింది. పారిశ్రామికంగా అభివృద్ధి అవుతున్న రాష్ట్రంలో ఏ మాత్రం ఇబ్బంది లేకుండా తేలికగా భూసేకరణ చేయటం కోసం చట్టాన్ని సవరించినట్లు ఉపోద్ఘాతంలో చెప్పారు.”

ఆర్డినెన్స్‌లో చెప్పారు.

6. చట్టానికి అనుగుణంగా నడుచుకోని ప్రభుత్వ అధికారులను శిక్షించాలని చట్టంలో చెప్పారు.

ఇందుకు ప్రభుత్వ అనుమతి కావాలని ఆర్డినెన్స్‌లో చెప్పారు.

7. చట్టంలో ఆసుపత్రులు, విద్యాసంస్థలను ‘ ప్రజావసరాల’ కేటగిరిలో చేర్చలేదు.

ఆర్డినెన్స్‌లో ఆసుపత్రులు, విద్యాసంస్థలను ‘ ప్రజావసరాల’ కేటగిరిలో చేర్చారు. చట్టంలో మినహాయించిన వాటిని కలిపి దాదాపు అన్ని ప్రైవేటు ప్రాజెక్టులకు వర్తించే విధంగా ‘ ప్రైవేటు’ అర్థాన్ని విస్తృతపర్చారు.

8. ప్రస్తుతం ఉన్న 16 చట్టాలను ఈ చట్టం తన పరిధి నుండి మినహాయించింది.

ఆర్డినెన్స్ ప్రస్తుతం ఉన్న 16 చట్టాలను ఈ చట్టం పరిధిలోకి తీసుకువచ్చింది. తనకు అవసరం అయితే చట్టాన్ని పక్కనపెట్టి ప్రభుత్వం వ్యవహరించవచ్చునని ‘ అర్జెన్సీ క్లాజ్’ ను చేర్చారు. బిజెపి ప్రభుత్వం దీనిని తరచుగా వినియోగిస్తున్నది.

ఈ విధమైన ముఖ్యమైన మార్పులతో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు ఆర్డినెన్స్ తీసుకొచ్చినా విజయం సాధించలేకపోయిందనేది అందరికీ తెలిసిన విషయమే. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన సవరణలను మాత్రమే తాము తీసుకొస్తున్నామని, పార్లమెంటు వాటిని ఆమోదించలేని పరిస్థితులలో తేలికగా పెట్టుబడులను ఆకర్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను సవరించుకోవచ్చునని ప్రభుత్వం పార్లమెంటులో చెప్పింది. దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార ఫెడరలిజంగా చెబుతున్నది.

ఈ విజ్ఞప్తికి తక్షణమే ప్రతిస్పందన వచ్చింది. 2015 ఆర్డినెన్స్‌లోని అన్ని ప్రజావ్యతిరేక అంశాలను చేర్చి 2016 చట్టం ( సవరణ) ద్వారా గుజరాత్ ప్రభుత్వం మొదటగా చట్టాన్ని ఆమోదించింది. పారిశ్రామికంగా అభివృద్ధి అవుతున్న రాష్ట్రంలో ఏ మాత్రం ఇబ్బంది లేకుండా తేలికగా భూసేకరణ చేయటం కోసం చట్టాన్ని సవరించినట్లు ఉపోద్ఘాతంలో చెప్పారు. తెలంగాణా లాంటి ఇతర రాష్ట్రాలు రూపొందించిన నిబంధనలలో ‘అంగీకారం క్లాజ్’ ను భూయజమానులకు మాత్రమే పరిమితం చేశారు. ప్రజాభిప్రాయాన్ని తెలుసు కోవటానికి నోటీసును జారీచేసే కాలాన్ని మూడు వారాల నుండి ఒక వారానికి తగ్గించటం ద్వారా ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు చట్టం యొక్క మౌలిక లక్ష్యాన్నే ఉల్లంఘించాయి. ‘ అంగీకారం క్లాజ్’ ప్రైవేటు ప్రాజెక్టులకు మాత్రమే వర్తిస్తుందంటూ, పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ ప్రాజెక్టులను మినహాయించటం ద్వారా యన్‌డిఎ నాయకత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం దీనిని మరింత నీరుగార్చింది.

రాష్ట్ర ప్రభుత్వాలు చట్టానికి సంబంధించిన మరికొన్ని ఇతర అంశాలను కూడా ఉల్లంఘిస్తున్నాయి. ఉదాహరణకు పరిహారాన్ని మార్కెట్ రేటుకన్నా అనేకరెట్లు అధికంగా నిర్ణయించటంలో రాష్ట్రాలు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. భూసేకరణ చేసేటపుడు గ్రామీణప్రాంతంలో మార్కెట్ విలువకు రెండు రెట్లు, పట్టణప్రాంతంలో రెట్టింపు చెల్లించాలని కేంద్రచట్టంలో చెప్పారు. కాని ఈ నిబంధనలను అన్ని రాష్ట్రాలు ఒకే విధంగా అమలు చేయటం లేదు. వివిధ రాష్ట్రాలు చెల్లిస్తున్న ధనం ఒకే విధంగా ఉండటం లేదు. ముఖ్యంగా హర్యానా, ఛత్తీస్‌గడ్, త్రిపుర లాంటి రాష్ట్రాలలో చట్టానికి సవరణలు చేసి, గ్రామీణప్రాంతంలో రెట్టింపు పరిహారాన్ని, అంటే చట్టంలో నిర్దేశించిన దానిలో సగమే చెల్లిస్తున్నారు. మరికొన్ని రాష్ట్రాలలో చట్టం నిర్దేశించిన దానికి భిన్నంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఒకే మాదిరిగా పెంచిన పరిహారాన్ని చెల్లిస్తున్నారు. చట్టం ఏ ప్రాతిపదిక మీదనైతే రూపుదిద్దుకున్నదో ఆ ప్రాతిపదికకే వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించినంత వరకు ఈ విధంగా చట్టాన్ని ఉల్లంఘించటాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసి అండ్ ప్రమోషన్ ఆరు అంశాల ప్రాతిపదికగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకులు నిర్ణయిస్తున్నది. 1. అన్నింటి పరిష్కారానికి ఏకగవాక్ష విధానాన్ని అమలు చేయాలి. 2. పన్ను సంస్కరణలు. 3. నిర్మాణ పర్మిట్‌లను ఇవ్వటం, 4పర్యావరణం, కార్మిక సంస్కరణలు 5. సంస్కరణలపై పర్యవేక్షణ. 6. కాగిత రహితంగా వివాదాల పరిష్కారం. ఈసంస్కరణలను అమలు జరపటం ప్రాతిపదికగా రాష్ట్రాలను నాలుగు గ్రూపులుగా విభజించారు. మొదటి గ్రూపు లీడర్లు. 90 నుండి 100 పాయింట్లు సాధించినవారు ఈ గ్రూపులో ఉంటారు. ఆంధ్ర, తెలంగాణా, గుజరాత్, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్‌లు లీడర్ల గ్రూపులో ఉన్నాయి. రెండవ గ్రూపు యాస్పైరింగ్ లీడర్స్ 70 నుండి 90 పాయింట్లు సంపాదిచాలి. ఈ గ్రూపులో కర్నాటక, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, బీహార్ ఉన్నాయి. 40 నుండి 70 పాయింట్లు సంపాదించినవారు యాక్సిలరేషన్ నీడెడ్ గ్రూపులో ఉన్నారు. ఈ గ్రూపులో హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, ఢిల్లీ ఉన్నాయి. 40 పాయింట్ల కన్నా తక్కువ వచ్చినవారు జంప్‌స్టార్ట్ నీడెడ్ గ్రూపులో ఉంటారు. కేరళ, గోవా, త్రిపుర, డామన్ అండ్ డయ్యు, అస్సాం, దాద్రా అండ్ నాగర్ హవేలి, పాండిచ్చేరి, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, జమ్మూ అండ్ కాశ్మీర్, ఛండీఘర్, మేఘాలయ, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షదీవులు ఈ గ్రూపులో ఉన్నాయి.

బడా వ్యాపారసంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు జరపాలని ప్రయత్నం చేసిన సంస్కరణలన్నింటినీ యన్‌డిఎ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేశాయని పై విభజన ద్వారా స్పష్టం అవుతున్నది. తన విధానాల ద్వారా కార్పొరేట్లతో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎంత స్నేహంగా మెలగుతున్నాయనేది పై విభజన స్పష్టం చేస్తున్నది. భూసేకరణ విధానాలను సరళతరం చేయటం, పర్యావరణ, కార్మికచట్టాలను నీరుగార్చటం ఈ ఎజెండాలో కీలకాంశాలుగా ఉన్నాయి.

భూసేకరణ చట్టంలోని కీలకాంశమైన అటవీభూములపై హక్కులను ఆ భూములను సేకరణకు ముందుగానే నిర్ణయించాలనే అంశాన్ని రద్దుచేయటం లేదు. నిర్ణయాలు చేయటంలో

నోడల్ ఏజన్సీ అయిన గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖను పక్కనపెట్టి ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న అటవీహక్కుల చట్టాన్ని పర్యావరణం, అటవీశాఖ నీరుగారుస్తున్నది. షెడ్యూల్డ్ ట్రైబ్స్ అండ్ అదర్ ఫారెస్ట్ డ్వెల్లర్స్ ( రికగ్నిషన్ ఆఫ్ రైట్స్) చట్టం 2006, అడవులపై ఆధారపడిన ప్రజల ప్రతినిధులు, ప్రభుత్వం మధ్య దీర్ఘకాలంగా జరిగిన సంప్రదింపుల ఫలితం. మొదటిసారిగా అడవులపై ఆధార పడిన వారి హక్కులను గుర్తించి, వారికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దటంతో ఇది చారిత్రాత్మకమైన చట్టం అయింది. ఈ చట్టంపై ప్రజలలో జరిగిన చర్చ అటవీభూములను ఇతర అవసరాల కోసం తీసుకునేటపుడు ' ముందుగా అంగీకారం' క్లాజ్‌ను చేర్చాలని అప్పటి యుపిఏ ప్రభుత్వంపై వత్తిడి వచ్చింది. సామాజికంగా హక్కుల గుర్తింపులో పంచాయితీలు చురుకుగా భాగస్వాములు కావాలని నిర్ణయించారు. కాని తదనంతర పరిణామాలు హక్కుల గుర్తింపు కోసం జరిగిన కృషి అత్యంత నిరాశాజనకంగా ఉన్నదని స్పష్టం చేశాయి. సంవత్సరాలు గడిచేకొద్దీ భూముల కోసం వారు చేస్తున్న వాదనలను తిరస్కరించటం క్రమంగా పెరిగింది. దీనితోపాటు అటవీభూములను అటవీయేతర అవసరాల కోసం మళ్ళించటం కూడా పెరిగింది. కొన్ని రాష్ట్రాల విషయంలో స్పష్టమౌతున్నట్లుగా అటవీహక్కుల చట్టం అమలు జరగటంలో నిర్లిప్తత, భూమార్కెట్‌ను కార్పొరేటీకరణ చేయటం మధ్య సంబంధం ఉన్నదా అనే అంశాన్ని ప్రత్యేకంగా పరిశోధించాల్సి ఉంది.

"కార్పొరేట్ పెట్టుబడులను ఎదుర్కొనేందుకు స్థానిక సంస్థలకు, ప్రజలకు అటవీ హక్కుల చట్టంలోని నిబంధనలు ఉపయోగపడుతున్నాయి. అత్యంత ప్రాచుర్యం పొందిన ఇలాంటి కేసుల్లో ఒడిశాలో వేదాంతకు వ్యతిరేకంగా సాగించిన పోరాటం ఒకటి. స్థానిక ప్రజలు, సంస్థలు కార్పొరేట్ పెట్టుబడిని 'సమ్మతి క్లాజు' ద్వారా ప్రశ్నించి సవాలు చేశారు."

కార్పొరేట్ పెట్టుబడులను ఎదుర్కొనేందుకు స్థానిక సంస్థలకు, ప్రజలకు అటవీ హక్కుల చట్టంలోని నిబంధనలు ఉపయోగపడుతున్నాయి. అత్యంత ప్రాచుర్యం పొందిన ఇలాంటి కేసుల్లో ఒడిశాలో వేదాంతకు వ్యతిరేకంగా సాగించిన పోరాటం ఒకటి. స్థానిక ప్రజలు, సంస్థలు కార్పొరేట్ పెట్టుబడిని 'సమ్మతి క్లాజు' ద్వారా ప్రశ్నించి సవాలు చేశారు. వేదాంత చేపట్టే ఖనిజ తవ్వకాల వల్ల నియాంగిరి కొండల్లో నివసిస్తున్న డొంగ్రియా ఖోండుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న వాదనను 2013 ఏప్రిల్ 18వ తేదీన ఇచ్చిన ఆదేశాల్లో సుప్రీం కోర్టు గట్టిగా సమర్థించింది. దీనిని పరిశీలిం చేందుకు ఎన్‌సి సక్సేనా కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ సూచించిన ప్రతిపాదనలను కూడా సుప్రీంకోర్టు సమర్థించింది. తన తీర్పును మరింతగా బలోపేతం చేసేందుకు అటవీ హక్కుల చట్టాన్ని, పంచాయత్ 'షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరింపజేసిన' (పెసా) చట్టాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. గ్రామసభ అనుమతి తీసుకున్న తర్వాతనే ఆ ప్రాజెక్టును అనుమతించాలని తేల్చిచెబుతూ మూడు నెలల్లోగా గ్రామ సభ అనుమతి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు ప్రత్యేకించి చాలా ముఖ్యమైనది. ఎందుకంటే అటవీ హక్కుల చట్టానికి, పెసా చట్టానికి మధ్యనున్న సంబంధాన్ని సృజనాత్మకంగా జొప్పిస్తూ కోర్టు ఉత్తర్వులివ్వడం దీని ప్రత్యేకత. ప్రజల ఉమ్మడి ఫిర్యాదులను (కమ్యూనిటీ క్లైమ్స్) పరిష్కరించే హక్కును అటవీ హక్కుల చట్టం గ్రామసభకు కట్టబెట్టిందని కోర్టు స్పష్టంగా పేర్కొంది. పెసా చట్టంలోని సెక్షన్ 4(డి) ప్రకారం కమ్యూనిటీ హక్కులు సామాజిక, సాంస్కృతిక హక్కులు కూడానని, అందువల్ల రెండూ పరిగణనలోకి తీసుకున్నప్పుడు వేదాంత కేసులో గ్రామసభ సాంస్కృతిక హక్కుల ప్రశ్నను కూడా పరిగణలోకి తీసుకోవాల్సివుంటుందని తెలిపింది. ఈ రకంగా అటవీ భూములపై 'హక్కుల' నిర్వచనాన్ని కూడా కోర్టు ఉత్తర్వు విస్తరింప జేసింది. మనుగడ కోసం సామాజిక, సాంస్కృతిక అంశాలు ఏ విధంగా దోహదం చేస్తాయనే విషయాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రముఖంగా ప్రస్తావించడం విశేషం.

అయితే ఇంతటి విజయం సాధించినా ఇదే తీర్పులోని కొన్ని అంశాలు అస్పష్టంగానే మిగిలిపోయాయి. చాలా స్పష్టంగా చెప్పాలంటే ఒక ప్రాజెక్టును తన స్వీయ అంచనా ఆధారంగా తిరస్కరించేందుకు గ్రామ సభకు ఉన్న హక్కును, సామాజిక అవశ్యకతను ఈ తీర్పు సమర్థించలేక పోయింది. మైనింగ్ లీజులపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు ఉంటుందని మాత్రమే కోర్టు చెప్పినా, గ్రామ సభ నిర్ణయానుసారమే రెండో దశ పర్యావరణ అనుమతులపై నిర్ణయం తీసుకోవాలని మంత్రిత్వ శాఖను ఆదేశించింది. దీనిప్రకారం.. భవిష్యత్‌లో 'సమ్మతి'కి సంబంధించిన ప్రశ్న తలెత్తితే అందులో స్వేచ్ఛాయుత ప్రజాభిప్రాయ జోక్యానికి వీలువుండేలా ఈ తీర్పు గట్టి పునాదులు వేసింది. ఈ తీర్పు ద్వారా సాధించిన విజయం ఏదైనా స్వల్ప కాలికమైనదే. ఎందుకంటే ఇప్పటికే ఒడిశా ప్రభుత్వం ఈ తీర్పును సవాలు చేసింది. నియాంగిరి కొండలపై స్థానికంగా ఉండే గిరిజన ప్రజలైన డొంగారియా ఖోండులకు మొత్తంగా హక్కు లేదని ఒడిశా వాదించడంతో ఉత్తర్వులు రిజర్వు చేయాల్సివచ్చింది. కార్పొరేట్ లాబీల నుంచీ, పాలకవర్గాల్లోని వారి ప్రతినిధుల నుంచి కూడా ఒడిశా ప్రభుత్వంపై ఒత్తిళ్లు ఉన్నాయనే విషయం ఈ ప్రతివాదన ద్వారా స్పష్టమవుతోంది.

ఈ నేపథ్యంలో కార్పొరేట్ శక్తుల మద్దతుతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి అనుకూలంగా తీసుకొచ్చిన, తీసుకొస్తున్న నయవంచక నిర్మాణాత్మక సంస్కరణలను తిప్పికొట్టాలంటే వామపక్షాలు, ప్రజాతంత్ర సంస్థలు ఇంద్రధనస్సులా కలిసి సంఘటితంగా పోరాటం చేయాలి. ఇలాంటి ప్రయత్నాల్లో భూమి అధికార్ ఆందోళన్ ఒక గొప్ప ముందడుగు. 2015లో భూ సేకరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఒత్తిడి తీసుకొచ్చేందుకు 15 రాష్ట్రాల్లోని 65 సంస్థల సంయుక్త కలయికతో ఈ సంస్థ ఏర్పాటైంది. వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తుల నేతృత్వంలో భూసేకరణ, నిర్వాసిత, పర్యావరణ విధ్వంసం వంటి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ఈ సంస్థ 20 అంశాలతో కార్యాచరణ రూపొందించుకుంది. 2015లో తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక భూసేకరణ ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకోవాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ సంస్థ 2016 జులైలో జరిగిన జాతీయ మహాసభలో డిమాండ్ల పత్రాన్ని విడుదల చేసింది.

**మహాసభ ఆందోళన వ్యక్తం చేసిన అంశాలు :**

పారిశ్రామిక, ఆర్థిక కారిడార్లు, స్మార్ట్‌సిటీలు, జాతీయ పెట్టుబడి, తయారీ మండళ్లు (నిమ్జ్‌లు), ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్‌లు), పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరుతో పెద్ద మొత్తంలో భూమిని బలవంతంగా

> **“భూమి అధికార్ ఆందోళన్ చేసిన అనేక డిమాండ్లలో చాలా వరకు యుపిఎ ప్రభుత్వం 2009లో ఏర్పాటు చేసిన 'వ్యవసాయ సంబంధాలు, అసంపూర్తిగా ఉన్న భూసంస్కరణల కర్తవ్యాలపై ఏర్పాటు చేసిన కమిటీ' (కమిటీ ఆన్ అగ్రేరియన్ రిలేషన్స్ అండ్ అన్‌ఫినిష్డ్ టాస్క్ ఆఫ్ ల్యాండ్ రీపార్ఫ్స్) నివేదికలో సూచించిన ప్రతిపాదనల్లోనూ ఉన్నాయి.”**

సేకరిస్తున్నారు. డిఎంఐసి, బిఎంఐసి ఎకనామిక్ కారిడార్, బెంగళూరు – చెన్నయ్ ఎకనామిక్ కారిడార్, విశాఖపట్నం – చెన్నయ్ కోస్టల్ కారిడార్ వంటి ప్రాజెక్టుల కింద లక్షలాది ఎకరాలను సేకరిస్తున్నారు. కార్పొరేట్లను, ల్యాండ్ మాఫియాలను యధేశ్చగా వదిలి వేయడంతో భూములు, ఖనిజాలు, అటవీ సంపద, ఉమ్మడి సంపదగా ఉండే వనరులు నిలువు దోపిడికి గురై అంతకంతకూ కుంచించుకుపోతున్నాయి. ప్రజలకు ముందుగా సమాచారం అందించి, వారి సమ్మతి తీసుకో కుండా, ప్రజాతంత్ర పద్ధతిలో సామాజిక ప్రభావం అంచనా వేయకుండా బలవంతపు భూసేకరణ జరపరాదు. అడవుల ఆక్రమణను, ఖనిజ వనరుల దోపిడిని అడ్డుకోవాలి. అలాగే భూసేకరణ ద్వారా తీసుకున్న భూములను వినియోగించకపోతే వాటిని భూమి లేని పేదలకు తిరిగి పంపిణీ చేయాలని కూడా 'జమీన్ వాపసీ' నినాదంతో డిమాండ్ చేస్తోంది. భూమి అధికార్ ఆందోళన్ చేసిన అనేక డిమాండ్లలో చాలా వరకు యుపిఎ ప్రభుత్వం 2009లో ఏర్పాటు చేసిన 'వ్యవసాయ సంబంధాలు, అసంపూర్తిగా ఉన్న భూసంస్కరణల కర్తవ్యాలపై ఏర్పాటు చేసిన కమిటీ' (కమిటీ ఆన్ అగ్రేరియన్ రిలేషన్స్ అండ్ అన్‌ఫినిష్డ్ టాస్క్ ఆఫ్ ల్యాండ్ రీపార్ఫ్స్) నివేదికలో సూచించిన ప్రతిపాదనల్లోనూ ఉన్నాయి. భూ సంస్కరణల ద్వారా భూమిని పునర్‌పంపిణీ చేయాల్సిన ఆవశ్యకతను, రైతుల హక్కులకు గుర్తింపు, భూమిపై మహిళలకు హక్కుల కల్పన గురించి ఈ నివేదికలోని ప్రతిపాదనలలో నొక్కి చెప్పారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులను గౌరవిస్తూనే కమిటీ చేసిన ముఖ్యమైన ప్రతిపాదనలు ఇవి :

1. భూ సేకరణకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలకు సవరణలు చేయదలిస్తే అవి తప్పనిసరిగా 'పెసా' నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. 'ప్రజా ప్రయోజనం' అనే పదానికి చాలా స్పష్టమైన నిర్వచనం ఇచ్చి, మార్గదర్శకాలు జారీ చేసి ప్రస్తుతమున్న భూసేకరణ పద్ధతుల్లో అస్పష్టమైన అంశాలను తొలగించాలి. 'ప్రజా ప్రయోజనం' నిర్వచించేటప్పుడు లింగ, సామాజిక, పర్యావరణ అంశాలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలి.

2. గ్రేజింగ్ ల్యాండ్ (పచ్చగడ్డి మైదానాలు), గ్రామ అడవులు, నీటి వనరులు వంటి ఉమ్మడి సంపదగా ఉండే వనరులను (సిపిఆర్) వాటికి సమానమైన, లేదా అంతకంటే ఎక్కువ విలువతో కూడిన ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేయకుండా సేకరించరాదు.

3. ప్రారంభానికి ముందుగానే అన్ని ప్రాజెక్టులకు ముందస్తు పునరావాస, పునః పంపిణి చట్టం అమల్జేయాలనే నిబంధనను తప్పనిసరి చేయాలి. పునరావాసం తర్వాత నిర్వాసిత గిరిజన ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా పునరావాస చర్యలు చేపట్టాలి. పునరావాస ప్రణాళికలో వారి జీవావరణానికి, సంస్కృతికి, సాంప్రదాయాలకు అత్యధిక ప్రాధాన్యతను తప్పనిసరిగా ఇవ్వాలి.

4. సర్వేలు, పునరావాస కార్యకలపాలను ఇంకా చేపట్టని చోట్ల వెంటనే వాటిని నిర్వహించి, ఆ ప్రాంతాల్లో నెలకొన్న అనిశ్చితిని, సందిగ్ధతను తొలగించాలి. నిరుపేద గిరిజన కుటుంబాల ఆధీనంలోని భూములను అటవీ హక్కుల చట్టం కింద వారు కోరుకున్న చోట దఖలు పర్చాలి.

5. ఉమ్మడి పట్టాల నిబంధనను చట్టబద్ధం చేసి, అమల్జేయాలి.

6. షెడ్యూలు 5లో పేర్కొన్న గిరిజన భూములను ఇతరులకు ఇవ్వకుండా ఉండే నిషేధపు చట్ట నిబంధనలను నాన్ షెడ్యూల్డు ప్రాంతాలకు కూడా విస్తరింపజేయాలి. నాన్ – షెడ్యూల్డు ప్రాంతాలకు ఈ చట్టాలను విస్తరించేందుకు నిర్దిష్ట గడువును ప్రకటించాలి.

7. గిరిజనుల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిన ప్రాంతాల్లో ఆ భూమిని అదే ప్రాంతానికి చెందిన అవసరమైన గిరిజన కుటుంబాలకు కేటాయించేలా ఒక భూబ్యాంకు విధానాన్ని ప్రోత్సహించాలి. (సీలింగ్‌కు మించిన మిగులు భూములను ఒక ప్రాధాన్యాత క్రమంలో పంపిణీ చేయాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉమ్మడి సంపదగా ఉన్న వనరులను పంపిణీ చేయరాదు)

8. ప్రస్తుతమున్న పెసా షెడ్యూల్డు ప్రాంతాలకే వర్తిస్తుంది. అయితే గిరిజన జనా భాలో అత్యధిక భాగం షెడ్యూల్డు ప్రాంతాల వెలుపల జీవిస్తున్నారు. అందువల్ల, గిరిజన జనాభాతో కూడిన, లేదా ప్రజల్లో మెజార్టీ భాగం గిరిజనులున్న ముతాతిస్, ముతాండీస్, గ్రామ ప్రాంతాల్లోనూ పెసా నిబంధనలను అమల్జేయాలి.

9. పరిమాణం, విశిష్టతతో సంబంధం లేకుండా అన్ని ప్రాజెక్టులకు ముందస్తు సమాచార సమ్మతి నిబంధనను కచ్చితంగా అమల్జేయాలి. ఈ ప్రయోజనం రీత్యా అవసరమైన అన్ని చట్టాలను, పర్యావరణ నిబంధనలను సవరించాలి.

10. ప్రత్యేక ఆర్థిక మండళ్ల చట్టం (2015)లో పర్యావరణ, జీవావరణ ఆందోళనలను పునఃపరిశీలించాలి. అన్ని చట్టాల, నిబంధనలను దృష్టిలో పెట్టుకొని వీటిని అమల్జేయాలి.

11. ప్రస్తుత పర్యావరణ ప్రభావ అంచనా నిబంధనలు అన్ని రకాలుగా లోపభూయిష్టంగా ఉన్నాయి. వీటివల్ల అనుకున్న ప్రయోజనం నెరవేరదు. అందువల్ల, సంబంధిత సంస్థలు అంచనాను క్రమబద్ధమైన ప్రాతిపదికన స్వతంత్రంగా చేపట్టాలి.

12. వ్యవసాయం నుంచి వ్యవసాయేతర వినియోగానికి బదిలీ చేసే అన్ని రకాల మధ్య తరహా, భారీ స్థాయి భూ బదలాయింపులన్నీ కూడా పర్యావరణ పరిరక్షణ నిబంధనలను అనుసరించే జరగాలి. దీనిని చాలా పటిష్టంగా అమల్జేయాలి. ఖనిజ తవ్వకాలు, పరిశ్రమలు, లేదా ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు ఏర్పాటు చేసిన తర్వాత ఎదురయ్యే భూమి, అటవీ, నీటి సంబంధ సమస్యలను సమీక్షించేందుకు జిల్లా స్థాయిలో నియంత్రణ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలి.

భూ సేకరణ ప్రక్రియ ప్రధానంగా రైతులు, కార్మిక వర్గాలపై సామాజికంగా, ఆర్థికంగా ఎంతటి తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతోందో చెప్పనవసరం లేదు. ఈ కమిటీతో పాటు, వివిధ ప్రజాతంత్ర సంఘాలు సూచించిన ప్రతిపాదనలను, డిమాండ్లను అమల్జేయించుకునేందుకు సంఘటిత ఉద్యమాన్ని తక్షణమే నిర్మించాల్సిన అవసరముంది. ఈ పర్యవసానాల వల్ల వ్యవసాయరంగం మరింత సంక్షోభంలో పడిపోయే ప్రమాదమున్న నేపథ్యంలో ఈ దిశగా ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన చారిత్రక అవసరముంది. ❋

అక్టోబర్ సోషలిస్టు విప్లవ శతవార్షిక ప్రత్యేకం

# మాతృత్వానికి రక్షణ కల్పించిన సోవియట్ ప్రభుత్వం



రచయిత్రి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యురాలు

**అలెగ్జాండర్ కొల్లంతాయ్**

**బోల్షివిక్ పార్టీలో చేరిన మొట్టమొదటి రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్‌పార్టీ ప్రముఖ నాయకురాలు అలెగ్జాండర్ కొల్లంతాయ్. 1917 లో ఆమె పార్టీ కేంద్రకమిటీ సభ్యురాలయ్యారు. అక్టోబర్ విప్లవం తరువాత విప్లవ ప్రభుత్వం యొక్క సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్‌గా నియమితురాలయ్యారు. మహిళలను విప్లవ రాజకీయాలలోకి తీసుకువచ్చి ఆమె తన ప్రత్యేకతను చాటుకున్నారు. 1918లో ఆమె రాసిన వ్యాసంలోని కొన్ని భాగాలను పాఠకులకు అందిస్తున్నాం.**

అక్టోబరు పోరాటాల సెగతోనే మాతాశిశు సంరక్షణశాఖను ఏర్పరచాలన్న ఆలోచన ఉద్భవించింది. అక్టోబరు విప్లవం వెనువెంటనే జరిగిన మొట్టమొదటి సమావేశంలోనే ఈ శాఖ పనికి మూల సూత్రాలను రూపొందించడం, తల్లులకు, తల్లులు కాబోతున్న మహిళలకు అవసరమైన సామాజిక అంశాలకు సంబంధించిన చట్టం రూపొందించడానికి చిత్తుప్రతిని తయారు చేయడం జరిగింది.

కేంద్ర కమిటీ సభ్యురాలిగా నా సూచన మేరకు కొంత మంది బోల్షివిక్ మహిళల నాయకత్వాన 'రబోనిస్టా' (శ్రామిక మహిళ) సంపాదక బోర్డు ఏర్పరచబడింది. రష్యాలోని పరిశ్రమలలో పనిచేసే మహిళలందరి ప్రతినిధులకు ఇది మొదటి సదస్సు. వీరందరూ బోల్షివిక్ పార్టీకి మద్దత్తునిచ్చి విప్లవం వైపు స్వచ్ఛందంగా వచ్చినవారే. ఈ సదస్సుకు 500ల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. వీరందరూ వివిధ పరిశ్రమల నుండి, పెట్రోగ్రాడ్ తోటల నుండి వచ్చిన వారే. మాస్కో నుండి కూడా ఇవనోవా – వోజెన్స్కి, తుల, కలుగ లాంటి వారున్నారు.

బోల్షివిక్ మహిళలు ముందుకు తెచ్చిన అన్ని ముఖ్యమయిన డిమాండ్లు చర్చకు వచ్చి ఆమోదించబడ్డాయి. వీటన్నింటిలోనూ ముఖ్యమయినది మాతృత్వాన్ని రక్షించడం, అందుకు తగిన విధానాలు రూపొందించడం. అక్టోబర్ విప్లవ మధ్య కాలంలో కూడా శ్రామిక మహిళలు సోవియట్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే శ్రామిక మాతా శిశుసంరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి విస్తృతంగా చర్చించడంలో నిమగ్నమయ్యారు.

1917, నవంబరు 6వ తేదీ కేంద్రకమిటీ సభ్యురాలి హోదాలోనూ, శ్రామిక మహిళకు కార్యదర్శిగా నాయకత్వం వహిస్తున్న హోదాలోనూ నేనొక ఉపన్యాసం చేసాను. సదస్సుకు హాజరయిన స్త్రీలు చర్చలలో చురుకుగా పాల్గొన్నారు. ఇక్కడ వచ్చిన పరిశీలనలనే జన సంక్షేమ ప్రజా కమిషనరేట్‌కు, కార్మిక శాఖ ప్రజా కమిషనరేట్‌కూ మార్గ దర్శకాలుగా పంపబడ్డాయి. ఇవే ఆ తరువాత సామాజిక రక్షణ విభాగంలో చేర్చబడ్డాయి.

ఇప్పుడు మాతృత్వం రక్షణ కోసం అమలవుతున్న చట్టాలను, అంశాలను ఆనాటి మొదటి శ్రామిక మహిళల సదస్సులో తీసుకున్న నిర్ణయాలతో పోల్చిచూస్తే సోవియట్ చట్టాలు ఏప్రాతిపదికన ఉండాలని మహిళలు కోరుకున్నారో అర్థం అవుతుంది.

అందువలన మాతాశిశు సంరక్షణ అంశాలు శ్రామిక మహిళల దగ్గరి నుండే వచ్చాయని గమనించాలి. ఆ రోజుల్లో చాలా తక్కువ మంది స్త్రీలే సోవియట్‌లలో చురుగ్గా పాల్గొనేవారు. కాని సోవియట్‌లో అధికారం వచ్చిన నాటినుండీ సోవియట్‌లలో మాతృత్వ భారాన్ని తగ్గించంలో మొదటి నుండీ కూడా మహిళలు చురుకైన పాత్రనే పోషించారు.

పెట్రోగ్రాడ్‌లోనూ, మాస్కోలోనూ పిల్లల వసతి గృహాలు పెద్దఎత్తున పునర్‌నిర్మాణం, వాటి నిర్వహణ దేశ సంక్షేమం శాఖ యొక్క ప్రజా కమిషనరేట్ ముఖ్య బాధ్యత. అప్పుడున్న పరిశ్రమలను తల్లుల, పిల్లల సంక్షేమ గృహాలుగా మార్చడమే పెద్దపని.

విప్లవానికి ముందు దాతృత్వ సంస్థలు నిర్వహిస్తున్న కొద్దిపాటి అనాధశరణాలయాలను, సలహా కేంద్రాలను, అప్పుడున్న పిల్లల సంరక్షణ కేంద్రాలను, ప్రజా కమిషనరేట్ తన ఆధీనంలోకి తీసుకున్నది.

1917 డిసెంబరు నాటికే, అంటే కార్మికుల చేతికి అధికారం వచ్చిన ఆరు వారాలలోపే ప్రజాకమిషనరేట్‌కి అంతకంతకూ మాతా శిశు రక్షణ విభాగంలో పెరుగుతున్న పనినంతా పర్యవేక్షించడానికి ప్రత్యేక కేంద్రాలు అవసరమన్న విషయాన్ని గుర్తించడం జరిగింది.

1917 డిసెంబరు 31 వ తేదీ ప్రజా కమిషనరేట్ డిక్రీ ద్వారా ఒక బోర్డును రూపొందించింది. మాతాశిశు రక్షణ విభాగాన్ని ఏర్పరచడం. ఆ విభాగానికి అధిపతిగా డాక్టర్ కొరోలివ్‌ను నియమించారు. ఆయన దేశ సంక్షేమ ప్రజా కమిషన్ బోర్డు చైర్మన్‌గా ఉంటారు.

ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా సోవియట్ ప్రభుత్వమే అధికారికంగా, చట్టపరంగా మాతృత్వం అన్నది మహిళల సామాజిక కార్యక్రమంగా గుర్తించింది. ఒక దేశ ప్రజలలో శ్రామిక మహిళలు సమాజానికి ఈ బాధ్యతను తప్పని సరిగా నిర్వహించ (పిల్లలను కనే బాధ్యతను) వలసి వస్తుందన్న వాస్తవాన్ని ఈ ప్రాతిపదికపైనే ఏర్పరచ బడింది. మాతృత్వ సమస్యను ఒక కొత్తకోణం నుంచి ఆవిష్కరించింది.

1918 జనవరి 20వ తేదీన ఒక డిక్రీ ద్వారా దేశ సంక్షేమ ప్రజా కమిషనరేట్ పడకేసిన ఆసుపత్రులను పునరుద్ధరించి దారిలో పెట్టడం ప్రారంభించింది. దేశంలోని పడకేసిన ఆసుపత్రులు, అన్ని కేంద్రాలు, గర్భధారణకు ప్రసవానికి సంబంధించిన క్లినిక్‌లు, సంస్థలు ఒక డిక్రీ ద్వారా మాతాశిశు రక్షణ విభాగానికి బదిలీ చేయబడ్డాయి. ఈ డిక్రీ ప్రకారం కాబోయే తల్లులకు అవసరమయిన సేవలు మూడు కొత్త సూత్రాలపై విభజింపబడ్డాయి.

> **❝ మాతాశిశురక్షణ శాఖ పరిధి పెరుగుతుం డడంతో, శ్రామిక మహిళలలో ఈ విభాగం పట్ల ఆసక్తి పెరుగుతున్నది. ప్రజా కమిషనరేట్‌కి దీని బోర్డును విస్తృత పరిచి, ఇందులో కార్మిక సంఘాల మహిళా, పురుష ప్రతినిధులను, ఆరోగ్య బీమా, పెట్రోగ్రాడ్ జిల్లా సోవియట్లు, రోబోనిట్‌సా పత్రిక ప్రతినిధులను కూడా కలుపు కోవలసి వచ్చింది.❞**



**1920లో తమ పిల్లలతో సోవియట్ తల్లులు**

1. తల్లులందరికీ అవసరమయిన వైద్య సదుపాయాలు, అంటే ప్రజలలో అత్యంత పేద మహిళలకు, శ్రామికులకు కూడా ఆస్పత్రులలో పడకల ఏర్పాటు

2. డాక్టర్లకు తగిన వేతనాలు ఇవ్వడం వలన గొప్పఇంటిలోని మహిళలు మాత్రమే వైద్యసేవలు అందుకొని, తల్లులు కాబోతున్న పేద పసిపిల్లల తల్లులకు ఈ సేవలు అందుబాటులో లేని పరిస్థితులను నివారించి, పేద, గొప్పమహిళలకు మధ్య అంతరాలను తగ్గించడం.

3. శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి సమిధలుగా చేసి, మంత్ర సానులు, యువ విద్యార్థులు నైపుణ్యతను సాధించేందుకు సాధనాలుగా ఉపయోగించుకోవటాన్నుండి తల్లులు కాబోయే పేద మహిళలను, బాలింతలను రక్షించింది. ఈ డిక్రీ ప్రకారం మాతృత్వమనే బాధాకరమయిన సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్న ఏమహిళనూ శాస్త్రాభివృద్ధి కోసం బలిఇచ్చే వారిగా చూసే హక్కు ఎవరికీ లేదు. ఈ డిక్రీలో మంత్రసాని కోర్సు ఏడాది నుండి రెండేళ్ళకు పెంచబడింది. రెండవ ఏడు మాత్రమే ప్రసూతికి సహాయం చేయడానికి అనుమతించబడుతుంది.

1918 జనవరి 31 వ తేదీన ఇవ్వబడిన డిక్రీ ఆధారంగానే సోవియట్ పౌరులు మానసికంగానూ, శారీరకంగానూ దృఢంగా ఉండేందుకు మాతృత్వ భవనం నమూనాను రూపొందించడం జరిగింది. మాస్కో పెట్రోగ్రాడ్‌లలోని పిల్లలకు సంబంధించిన సంస్థలన్నింటినీ 'మాస్కో పిల్లల సంస్థ', "పెట్రోగ్రాడ్ పిల్లల సంస్థ కిందికి తేబడ్డాయి. అనాధ శరణాలయాలన్నీ 'పిల్లల భవనాలుగా' నామకరణం చేయబడ్డాయి.

మాతాశిశురక్షణ శాఖ పరిధి పెరుగుతుండడంతో, శ్రామిక మహిళలలో ఈ విభాగం పట్ల ఆసక్తి పెరుగుతున్నది. ప్రజా కమిషనరేట్‌కి దీని బోర్డును విస్తృత పరిచి, ఇందులో కార్మిక సంఘాల మహిళా, పురుష ప్రతినిధులను, ఆరోగ్య బీమా, పెట్రోగ్రాడ్ జిల్లా సోవియట్లు, రోబోనిట్‌సా పత్రిక ప్రతినిధులను కూడా కలుపుకోవలసి వచ్చింది.

జనవరి 31వ తేదీ ఇచ్చిన డిక్రీ ప్రకారం బోర్డు పునర్వ్యవస్థీకరించబడి, దాని కార్యక్రమాలను మూడు మూల లక్ష్యాలుగా విభజించడం జరిగింది.

1. పిల్లల రక్షణ అంటే పసిపిల్లల మరణాల సంఖ్యను తగ్గించడం.

2. సోషలిస్టు కుటుంబానికి కనుగుణమైన వాతావరణంలో పిల్లల పెంపకం జరిగేటట్లు చూడడం (తల్లుల పిల్లల గృహాల ఏర్పాటు, పిల్లలు చిన్నప్పటి నుండి సమాజంలో భాగంగా పెరిగే వాతావరణం కల్పించడం.

3. పిల్లలు శారీరకంగానూ, మానసికంగానూ ఆరోగ్యవంతంగా పెరిగే వాతావరణం ఏర్పరచడం.

1918 జనవరిలో ఈ డిక్రీ ప్రచురించక ముందే తల్లీపిల్లల రక్షణశాఖకు తల్లుల, పిల్లల రక్షణ భవనాల నిర్వహణ అప్పగించబడింది. ఇందులో (ఇంతకుముందు మంత్రసానులకు శిక్షణ ఇచ్చే సంస్థలు, ప్రసూతి సంస్థలు విలీనం చేయబడ్డాయి) ప్రణాళిక ప్రకారం మాతాశిశురక్షణ మ్యూజియం కూడా నిర్మించబడుతుంది. (దీనివలన తరువాత కాలంలో ఎంతో సమర్థవంతంగా వి.పి లెబెదెవా మాతాశిశురక్షణను ఒక ప్రదర్శన రూపంలో తయారు చేసారు. ప్రత్యేకమయిన క్రెష్‌లు, సంప్రదింపుల కేంద్రాలు, పిల్లల ఆహార పంపిణీ కేంద్రాలు, పిల్లల పెంపకం కేంద్రాలూ చేర్చబడ్డాయి. ఇంత కు ముందే సికోలెవిస్కి సంస్థ దీనికి అనుబం ధంగా నిర్ణయించబడి, అందులో నే ఈ భవనా లన్ని ఏర్పరచబడ్డాయి.

**అనువాదం: కె ఉషారాణి**

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ-2

ఆరోగ్యరంగం

# కార్పొరేట్ల కోసం రూపొందించిన నూతన ఆరోగ్య విధానం



రచయిత్రి పాత్రికేయురాలు

**టికె రాజలక్ష్మి**

**భా**రత దేశ సమగ్ర ఆరోగ్య విధానం 2017లో ప్రభుత్వం ప్రజలకు నాణ్యతతో కూడిన వైద్యాన్ని, కనీస ఖర్చులను అందించే బాధ్యతను, జవాబుదారీ తనాన్ని స్వీకరించడానికి బదులు, ప్రైవేటు రంగంపై ఆధారపడుతూ పేదలను దిక్కు మాలిన స్థితికి నెట్టేసింది.

2017వ సంవత్సరం ఫిబ్రవరిమాసంలో దేశ రాజధానిలో ఉన్న ఓ ముఖ్యమైన ప్రభుత్వ వైద్యసంస్థను అవుట్ పేషెంట్ల ఛార్జీలు, ఆస్పత్రి పడకల అద్దెలు, రేడియాలజీ పరీక్షల వెల, రోగ నిర్ధారణ పరీక్షల రుసుము మొదలగు అంశాలను పరిశీలించి, పునర్వ్యవస్థీకరించమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కోరింది. "తాము ఆ పని చేయలేమని" ఆ సంస్థ తన అశక్తతను తెలియ జేసింది. గత 20 సంవత్సరాలుగా ఒకే రకమైన రుసుములు కొనసాగుతూ, ఎలాంటి మార్పు, చేర్పులు జరగకపోవడం దానికి కారణం. తాజాగా పునర్వవస్థీ కరణ చేపట్టవలసి ఉన్నా, ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అంతే గాక ప్రముఖుల కోసం ఓ ప్రత్యేకమైన విఐపి కౌంటర్‌ను కూడా ప్రారంభించాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ, సంస్థ బోధనా సిబ్బంది వ్యతిరేకిం చడం వలన ఆ దిశగా ఏర్పాట్లు జరగలేదు. ఆరోగ్యం కోసం అధిక మొత్తాన్ని ప్రజలు భరించే పరిస్థితి దేశవ్యాప్తంగా దాపురించడం వలన యూజర్ ఛార్జీల మార్పు గురించిన చర్చ మరోసారి మన ముందుకు వచ్చింది.

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈ మధ్య జరిగిన ఓ సంఘటనను పరిశీలిద్దాం! సరైన వైద్య పద్ధతులు ఆచరించక 24 మంది యువతుల (అధికశాతం గిరిజనులే) మరణానికి కారణమైన ఓ వైద్యుడిని శిక్షించక, న్యాయపరమైన సాంకేతిక కారణాలు చూపుతూ వదిలివేయడం ఈ దేశం లో మానవ ప్రాణాలకున్న విలువను చూపు తుంది. మన దేశంలో ఆరోగ్య విధానం ఎంత డొల్లతనంగా ఉందో ఈ ఉదాహరణ నిరూపిస్తున్నది.

జాతీయ సమగ్ర ఆరోగ్య విధానం 2017 ను ఈ సంవత్సరం మార్చి 16న విడుదల చేశారు. 2002 తర్వాత 14 సంవత్సరాల అనంతరం ఈ నూతన విధానం రావడంతో సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూశారు. గతంలో 1983లో, అనగా 34 సంవత్సరాల క్రితం విడుదల చేసిన ఆరోగ్య విధానంలో 2000 సంవత్సరానికల్లా 'దేశ ప్రజలం దరికీ ఆరోగ్యం' అన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ, సాధించడంలో మాత్రం ప్రభుత్వం వైఫల్యం చెందింది. మార్చి 16న ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి విధాన పత్రాన్ని విడుదల చేసినప్పటికీ, దానికి సంబంధించిన వివరాలను విలేకర్లకు అందచేయ లేదు. ఒకటిన్నరరోజు తర్వాత అధికారిక వెబ్ సైట్ లోకి అప్‌లోడ్ మాత్రం చేశారు.

దాదాపు దశాబ్దన్నర కాలం తర్వాత విడుదల చేసిన ఈ డాక్యుమెంట్‌లో ప్రత్యేకతలుం టాయని అందరూ ఆశించారు. కానీ జరిగింది మాత్రం భిన్నం. 2002లో ఏవైతే ఉన్నాయో వాటినే కాస్త అటూ ఇటూ మార్చడం జరిగింది తప్ప నూతనత్వం కనిపించలేదు. స్థూల జాతీ యోత్పత్తిలో 2.5 శాతం పెంచుతామన్న వాగ్దా నం 2012-17 పంచవర్ష ప్రణాళిక నాటికి కూడా నెరవేర్చలేదు సరికదా 2025 నాటికి వాయిదా వేశారు.

2020 నాటికి ప్రజారోగ్యం కోసం రాష్ట్రాలు 8 శాతం నిధులను కేటాయిస్తాయని ఎన్.హెచ్.పి.( నేషనల్ హెల్త్ పాలసి) 2017 మరొక వాగ్దానం సైతం చేసింది. 2016-17కి సంబంధించిన గ్రాంటుల విషయంలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన పార్లమెం టరీ స్టాండింగ్ కమిటీ 99వ విభాగం ఓ పరిశీ లన చేసింది. ప్రజారోగ్యంపై రాష్ట్రాలు ఖర్చు చేయాల్సిన నిధులపై కేంద్ర ప్రభుత్వం యొక్క అభ్యర్థన అది. "కేంద్ర ప్రభుత్వం తన పన్నులను విభజించి, కేటాయించినప్పటికీ, దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మాత్రం తమ 2016-17 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెంచలేదు. కొన్ని రాష్ట్రాలయితే ప్రస్తుత నిధుల లోనూ కోత విధించగా, మరికొన్ని రాష్ట్రాలయితే నామమాత్రపు నిధులను మాత్రమే పెంచాయి. వాస్తవానికి 12వ ప్రణాళిక డాక్యు మెంట్ ప్రకారం, 2017 స్థూల జాతీయోత్పత్తిలో 1.87 శాతం పెంచాలి. కానీ కేవలం 1.4 శాతం మాత్రమే పెంచడం జరిగింది. ఎన్.హెచ్.పి. 2015 డాక్యుమెంట్ ప్రకారం 'ఏ దేశమైనా, తన దేశపు నిధులలో 5 లేదా 6 శాతం ప్రజారోగ్యం, ప్రాథమిక ఆరోగ్య వసతుల కోసం ఖర్చు పెట్టకపోతే, ప్రజారోగ్య అవసరాలు తీరవు' అని స్పష్టీకరించింది. ఈ అంశంపైజరి పిన ఎకనామిక్ సర్వే సైతం అదే తెలియజేసింది.

ఎన్.హెచ్.పి. 2017, కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యంలో తీసుకోవలసిన ప్రాధాన్యతలను ఏమాత్రం తగ్గించలేదు. అంతేగాక ఆరోగ్య వసతులైన ఆసుపత్రి భవనాలు, డాక్టర్-రోగి నిష్పత్తి, రోగులు-పడకల నిష్పత్తి, నర్సులు-రోగుల నిష్పత్తి మొదలగు వాటిని దేశవ్యాప్తంగా, సమాన నిష్పత్తిలోనే పంచింది. "ఆరోగ్యం-తమ ప్రాథమిక హక్కు'గా ప్రజలు భావించే విధంగానే రూపొందించింది.

ప్రస్తుతం అమలులోకి వచ్చిన విధానాన్ని 2002వ సంవత్సరం విధానంతో పోల్చి చూస్తే, పరిస్థితులు అంత ఆశాజనకంగా గోచరించవు. వికేంద్రీకరించబడిన ప్రజా సదుపాయాలు, సేవలు క్రమంగా వృద్ధి చెందినట్లయితే, తదనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మరింత విస్తృతంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకా శాలున్నాయి. వాస్తవానికి 2017 పాలసీలో నిధుల కేటాయింపు చేయాలన్న నిబద్ధత స్పష్టంగా ఉంది. కానీ దేశ బడ్జెట్‌లో చాలా తక్కువ శాతం నిధులనే ఈ రంగంలో కేటాయించారు. మన దేశంలో మాతా, శిశు మరణాల సంఖ్య క్రమాను గతంగా తగ్గడం వలన, ఆరోగ్య పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని, అధిక ప్రాధాన్యత ఇవ్వబడు తున్నాయన్న భావన కలుగుతుంది. కానీ వాస్తవానికి ఈ భావం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక విడుదల చేసిన 'జాతీయ ఆరోగ్య విధానం - 2017 విధానం లోని లోపాలు'

**“2016-17లో 12వ పంచవర్ష ప్రణాళిక ముగిసినప్పటికీ భారతదేశం మాత్రం ఆరోగ్యం కోసం కేటాయించా ల్సిన 2.5 శాతం లక్ష్యాన్ని చేరుకోలేదు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్), జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, జాతీయ పట్టణ ఆరోగ్య పథకానికి 2017 లో ముగిసిన 12వ ప్రణాళికలో కేవలం 47 శాతం మాత్రమే కేటాయించింది.”**



దీర్ఘకాల పోషకాహార లోపంతో గిడస బారుతున్న పిల్లలు

వలన కానే కాదు. ఆరోగ్య శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక పరిశీలన ప్రకారం మాతా శిశు మరణాల సంఖ్య, క్షీణత నిర్దేశిం చిన లక్ష్యంకన్నా చాలా తక్కువగా ఉంది. జాతీయ నిధుల కేటాయింపులో కేవలం 1.15 శాతం మాత్రమే ఈ దిశగా కేటాయించబడింది. ఆరోగ్య రంగానికి 5.99 శాతం నిధులు అవసరం కాగా, పైన అందించిన నిధులు నామ మాత్రమే. ప్రభుత్వం కేటాయించాల్సిన నిధులలో కొరత ఉండటం వలన ప్రజలపై ఆర్థికభారం అధికంగా పడుతుంది. 71వ జాతీయ స్థాయి సర్వే ప్రకారం అంతర్జాతీయంగా ప్రజలు తమ ఆదాయంలో అత్యధికంగా ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టాల్సిన దేశాలలో మన దేశం 183వ స్థానంలో ఉంది. ఆ తర్వాత బంగ్లాదేశ్, ఆఫ్ఘని స్థాన్‌లు ఉన్నాయి. ఆ కమిటీ అధ్యయనంలో తేలిన మరో ముఖ్యమైన విషయం, భారతదేశంలోని పరిస్థితులే ఉన్న బ్రెజిల్ 2.5 శాతం, రష్యా 4.6 శాతం, చైనా 3.2 శాతం దక్షిణాఫ్రికా 1.6 శాతం, శ్రీలంక 4.2 శాతం ఖర్చు పెడుతున్నాయి. మరో ముఖ్య విషయం “ఈ ఖర్చుల వలన ప్రతి సంవత్సరం 6 కోట్ల 30 లక్షల మంది ప్రజలు మరింత పేదవారు అవుతున్నారు” అని ఈ నివేదిక స్పష్టపరచింది.

ఆరోగ్య విధానం పరమార్థం మాత్రం ఎవ్వరికీ ఆర్థికభారం కాని రీతిలో ఆరోగ్య పరిరక్షణకు ప్రామాణిక వసతి సౌకర్యాలు కల్పించడమే! అంతేగాక ఆరోగ్య రంగంలో ప్రస్తుతమున్న ఆర్థిక భారాన్ని సైతం తగ్గించడమే! ఆర్థిక భద్రత సమకూరుస్తూ పెట్టుబడిని సమన్వయం చేయడం. ఆర్థిక మంత్రిత్వశాఖ స్టాండింగ్ కమిటీ ఈ పెట్టు బడిని గూర్చి ఇలా అంటుంది. ‘2016–17లో 12వ పంచవర్ష ప్రణాళిక ముగిసినప్పటికీ భారతదేశం మాత్రం ఆరోగ్యం కోసం కేటాయించా ల్సిన 2.5 శాతం లక్ష్యాన్ని చేరుకోలేదు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్), జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, జాతీయ పట్టణ ఆరోగ్య పథకానికి 2017 లో ముగిసిన 12వ ప్రణాళికలో కేవలం 47 శాతం మాత్రమే కేటాయించింది. ‘ప్రభుత్వం కేటాయింపులను భిన్న భాగాలు చేయకుండా కేవలం నేషనల్ హెల్త్ మిషన్ కోసమే కేటాయించి నట్లయితే, ప్రాథమిక స్థాయిలోని ఆరోగ్య ప్రమాణాలు మరింత మెరుగయ్యేవని’ ఈ నివేదిక అభిప్రాయపడింది. వాస్తవానికి మొత్తం ప్రాజెక్టు విలువ 34,315.66 కోట్లుగా ప్రతిపాదించినప్పు టికీ, కేటాయించింది మాత్రం 26,690.70 కోట్లు మాత్రమే. కాగా మరో 4,000 కోట్లు నేషనల్ హెల్త్ మిషన్‌కి కేటాయిం చాలని స్టాండింగ్ కమిటీ సూచించింది. 2016–17 ఆర్థిక సంవత్సరానికి 22,197.95 కోట్లు కేటాయింపుతో పోల్చి చూడ గా 2017–18కి కేటాయించిన 4,492.75 కోట్లు చాలా తక్కువ. ఆపత్కాల ఆరోగ్య ఖర్చుల కోసం నెలసరి ఆదాయంలో 10 శాతం పైనే ఖర్చవు తుందని, అదుపులేని మందుల రేట్లు, హాస్పిటల్ ఖర్చులు అనవసరమైన వైద్య పరీక్షలు వగైరా వంటి వాటి వలన ఆరోగ్యం కోసం భారీమొత్తం ఖర్చవుతున్నట్లు కూడా నివేదిక పేర్కొంది. ఆరోగ్య వ్యవస్థలో వేళ్లూనుకొని పోయిన అవినీతిని సైతం చర్చిస్తూ, ప్రైవేటు ఆరోగ్య వ్యవస్థలపై ఎటువంటి నియంత్రణలు లేక పోవడాన్ని కూడా స్పష్టంగా విశదీకరించింది.

“ప్రజలకోసం ఏర్పాటు చేయబడిన ఈ విధానం ప్రజలకు చేరువయ్యే క్రమంలో పలచబడిపోవడం మరో ఆసక్తిదాయకమైన విషయం. గత ఐదు సంవత్సరాలలో కేంద్రప్రభు త్వమే అనుమతినిచ్చి, ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మా స్యూటికల్స్ లిమిటెడ్, రాజస్థాన్ డ్రగ్స్ అండ్ ఫార్మా స్యూటికల్స్ లిమిటెడ్, మొ॥లగు ఫార్మాస్యూటికల్ కంపెనీలను క్రమంగా మూత వేయడం ప్రజారోగ్య విధానాలను ప్రభుత్వం నిజంగా బలపరుస్తుందా? క్షీణింపజేస్తుందా? అన్న అంశాన్ని స్పష్టీకరిస్తుంది. ఉచితంగా అందే ప్రాథమిక ఆరోగ్యవసతికి, ద్వితీయ, తృతీయ స్థాయిలో అందే ఆరోగ్య వసతులకు ఆర్థికంగా చాలా వ్యత్యాసం ఉంది. అంతర్జాతీయంగా ఆరోగ్య ప్రమాణాలతో పోలిస్తే మనదేశ ఆరోగ్య విధానం ఏ స్థాయిలోనూ అందుకో లేనంత దూరంలో ఉంది. ప్రస్తుతమున్న మానవ వనరులను, మౌలిక వసతులను ఉపయోగించు కుంటూ, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఆరోగ్యస్థితి గతులను మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టమని సైతం ఈ డాక్యుమెంట్ స్పష్టీకరించి నప్పటికీ, ఈ విధానం అమలులోకి రాలేదు. ప్రభుత్వ రంగంలో ఏయే విభాగాలలో ద్వితీయ, తృతీయశ్రేణిలో కొరత ఉందో, ఆయా రంగాలలోని ఆరోగ్య సేవలను ప్రైవేటు రంగం వారితో కలిసి అందించవలసినదిగా సైతం స్పష్టీకరిస్తుంది. మరీ ముఖ్యంగా లాభరహిత స్వచ్ఛంద సంస్థల సహకారం అందుకోవల సినదిగా స్పష్టపరుస్తుంది.

ప్రైవేటు ఆరోగ్య రంగానికి పన్ను మినహా యింపు ఇచ్చిన నేపథ్యంలో ఏయే ప్రాంతాలలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలో కూడా నివేదికలో స్పష్టపరిచి ఉండాల్సింది. అదే విధంగా నీతివంత మైన, సురక్షితమైన, ప్రతిభావంతమైన ఆరోగ్య సేవలను నామమాత్రపు రుసుముతో

ప్రైవేటు వైద్యరంగంలో అందేటట్లుగా చేయాలని సూచించిం ది. అయితే ఈ దిశగా పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యింది. ప్రైవేటు రంగాన్ని ఈ దిశగా వత్తిడి చేయకుండా వదిలేసింది. అంతేగాక ఫార్మాస్యూటికల్ కంపెనీలు నైతిక బాధ్యతతో వర్తించే దిశగా సైతం చర్యలు చేపట్టలేకపోవడం ఇతర ప్రభుత్వ శాఖలకు, ఆరోగ్య మంత్రిత్వశాఖకు మధ్య సమన్వయ లోపాన్ని సూచిస్తుంది. “అందరికీ ఆరోగ్యం” అన్న నూతన నినాదం కేవలం నినాదంగానే మిగిలిపోయింది.

2025 నాటికి పునరుత్పత్తిని 2.1 శాతానికి తగ్గించాలని, మానవుల సగటు ఆయుర్దాయాన్ని పెంచే దిశగా లక్ష్యాలను సైతం ఈ డాక్యుమెంట్ నిర్దేశించింది. జనాభా పెరుగుదలను నియంత్రించే దిశగా చేపట్టే కార్యక్రమాలు హాస్యాస్పదంగానే మిగిలిపోతున్నాయి. కుటుంబ నియంత్రణ పద్ధతులలో మగవారిని అధికంగా ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని ఈ ప్రణాళిక సూచించినప్పటికీ, గర్భధారణ నియంత్రణా పద్ధతులను మహిళలే అధికశాతం అనుసరిస్తున్నట్లు స్పష్టమైంది. దీనిని ఈ దేశ పురుషాధిక్య భావజాలానికి ప్రతీకగా, గర్భ ధారణ నియంత్రణ పద్ధతుల పట్ల మగ వారి నిర్లక్షపు ధోరణికి సూచనగా భావించవచ్చు.

అదే విధంగా 5 సంవత్సరాలలోపు శిశువుల మరణాల సంఖ్యను 2025 నాటికి 23కి పసిబిడ్డల మరణాలను 2019 నాటికి 28కి, తల్లుల మరణాలను 2020 నాటికి 100కి, చలన రహిత శిశు మరణాలను 2025 నాటికి ఏక సంఖ్యకు, నవజాత శిశువుల మరణాలు 16కి తగ్గించే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ అవి కేవలం లక్ష్యాలుగానే మిగిలి పోయేలా ఉన్నాయి. ఈ లక్ష్యాల కనుగుణంగా ప్రచారం చేయడంలో, సంతులన ఆహారాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టడంలో వైఫల్యా న్ని స్పష్టంగా చూడవచ్చు. అంతర్జాతీయ ఆకలి సూచిక (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) లో మనదేశం అగ్రభాగానే ఉంది. నాణ్యత గల ఆహారాన్ని అందించడం, పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థ ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం కోసం సమర్ధవంతంగా చర్యలు తీసుకోలేదు. ఆరోగ్య సేవలకు అధిక ప్రాముఖ్య త ఇవ్వడం లేదన్నది సర్వవిదితం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల విషయానికొస్తే, సాధారణ ప్రాంతాలలో ప్రతి 5 వేల మందికి ఓ కేంద్రం, కొండ ప్రాతాలలో ప్రతి 3 వేల మందికి ఓ కేంద్రం ఏర్పాటు జరిగింది. అదే విధంగా ప్రసూతి వైద్యాన్నందించే ఆరోగ్య సిబ్బంది, నవ జాత

> **“అంతర్జాతీయ ఆకలి సూచిక (గ్లోబల్ హంగర్ ఇండెక్స్)లో మనదేశం అగ్రభాగానే ఉంది. నాణ్యత గల ఆహారాన్ని అందించడం, పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థ ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం కోసం సమర్ధవంతంగా చర్యలు తీసుకోలేదు. ఆరోగ్య సేవలకు అధిక ప్రాముఖ్య త ఇవ్వడం లేదన్నది సర్వవిదితం.”**



**సామాన్యులకు వైద్యానికి ఉపయోగపడని కార్పొరేట్ ఆసుపత్రి**

శిశువుల, బాలింతల సంరక్షణకు సైతం తగినంత మంది సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించింది. విషాద కరమైన అంశ మేమంటే, ఈ పాలసీ అంతర్జాతీయ ఆరోగ్య విధానాలకనుగుణంగా రూపొందించబడినప్పటికీ, ఆచరణలో మాత్రం వెనుక పట్టు పట్టింది. లక్ష్యాన్ని సాధించడం కోసం యుపిఎ ప్రభుత్వం కొన్ని బృందాలను ఎంపిక చేసింది. (అందులో ప్రధానంగా వెనకబడిన ప్రాంతాలున్న రాష్ట్రాల కొరకు) ఆ తర్వాత అధిక అవసరాలున్న ప్రాంతాలను, జిల్లాలను దృష్టిలోకి తీసుకుంది. అంతేగాక 2020సం॥ లక్ష్యంగా మానవ వనరులైన పారామెడికల్ సిబ్బందిని, డాక్టర్లను, కమ్యూనిటీ హెల్త్ వాలంటీర్లను, ప్రాథమిక, సెకండరీ వసతి సౌకర్యాల మౌలిక ఏర్పాట్లు చేయాలని నిర్దేశించింది.

నేషనల్ హెల్త్ మిషన్‌కి, తొమ్మిది లక్షల ‘ఆశా’ వర్కర్లకు మధ్య ఈ విధానం ఇరుసులా వ్యవహరిస్తుంది. గ్రామీణ, పట్టణ నగర ప్రాంతాలలో ప్రజలకు అత్యంత సన్నిహితంగా వ్యవహరిస్తూ, వారి శారీరక, మానసిక అస్వస్థత లకు, ఆరోగ్య వనరులకు అందుబాటులో ఉంటూ, అంటు రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునే ఆశా వర్కర్లకు ఆర్థిక భద్రతగానీ, ఉద్యోగ భద్రతగానీ లేదు. కేవలం “ఆరోగ్య పరిరక్షణ ఉద్యమ కారిణులుగానే” ఆశా వర్కర్లకు ముద్రవేసి కొనసాగిస్తున్నారు తప్ప, వారి జీవితానికి ఉద్యోగ స్థిరత్వం, ఆర్థిక లాభం ఉండటం లేదు.

ఈ పాలసీ స్పష్టపరిచే మరో అంశం “ఆశా వర్కర్లను ప్రధానంగా స్వచ్ఛంద కార్యకర్తలుగా, వారు కేటాయించిన సమయానికి తగు మూల్యం చెల్లించబడే వారిగానే గుర్తించింది. తగిన అర్హతలతో పూర్తికాలం సిబ్బంది వచ్చినట్లయితే, వారికే ప్రథమ ప్రాధాన్యం” అని చెబుతున్నారు. వాస్తవానికి గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలబడ్డ ఆశావర్కర్లను కేవలం తమ విధి నిర్వహణకే పరిమితం చేయక, అనేకానేక పనులకు కేటాయించడం, తాత్కాలిక ఆదాయం ఇస్తూ, అత్యవసర పనులకు ఉపయోగించడం వలన కూడా క్షేత్రస్థాయిలో ఆరోగ్య పరిస్థితులు వెనక బడిపోతున్నాయి. ఈ విధానపత్రం ఉచిత లేదా నామ మాత్రపు రుసుముతో వైద్యాన్ని ఖచ్చితంగా అందిస్తామని చెప్పలేదు. క్రమాను గతంగా పెంచే వైద్య సిబ్బంది, మౌలిక వసతుల కల్పన, నామమాత్రపు రుసుముతో ఆరోగ్య పరీక్షలు, తక్కువ వెలకు మందులు అందుతాయని స్పష్టం చేసింది. కానీ విశ్వాసాన్ని మాత్రం కల్పించ లేకపోతున్నది. సమీకృత పోషకాహారానికి ఎలాంటి హామీ ఇవ్వలేదు. విద్యాలయాల్లో “మధ్యాహ్న భోజన పథకానికి” ఆధార్‌ను ఖచ్చితంగా అనుసంధానం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఈ విషయంలో ప్రభుత్వం యొక్క ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తుంది. బాల్యంలోనూ, యవ్వనంలోనూ శారీరక ఎదుగుదలకు, పునరుత్పత్తికి తగిన విధంగా పోషకాహారం తగినంత కేలరీలలో అందడం లేదన్నది కూడా వాస్తవమే. పౌష్టికాహారం లభ్యం కాకపోవటాన్ని కేవలం విటమిన్లు, మినరల్స్ లభ్యం కాకపోవటంగానే పరిగణిస్తు న్నాం. మరీ ముఖ్యంగా ఆర్థికంగా వెనుక బడిన ప్రాంతాల్లోని ప్రజలు తలసరి ఎన్ని కేలరీల లెక్కన తీసుకుంటున్నారో

(మిగతా 35వ పేజీలో)

జాతీయోన్మాదం

# వలసలపై కాదు దోపిడిపై పోరాడాలి

## కారల్ మార్క్స్ విశ్లేషణ

**డేవిడ్ యల్ విల్సన్**

కారల్ మార్క్స్ 1870 ఏప్రిల్9న అమెరికాలో తన సహచరులైన సిగ్ఫ్రిడ్ మేయర్, అగస్ట్ ఓట్‌లకు ఒక సుదీర్ఘమైన లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన అనేక అంశాలను ప్రస్తావించినప్పటికీ అప్పటికి ప్రధానాంశంగా ఉన్న ఐరిష్ సమస్యపై కేంద్రీకరించారు. ఐరిష్ నుండి పెద్దఎత్తున జరుగుతున్న వలసల ప్రభా వం ఇంగ్లాండ్‌పై ఎలా ఉంటుందన్న అంశాన్ని ఆయన సోదాహరణంగా వివరించారు. బతకడానికి మరోమార్గం లేక, మాతృదేశం నుండి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలస వస్తున్న ప్రజలు, వారి కష్టాలు, వలసదేశాలపై ప్రభావం తదితర అంశాలను మార్క్స్ ఎంతగా అధ్యయనం చేశారో ఈ లేఖ స్పష్టం చేస్తుంది.

ప్రస్తుతం ఈ అంశం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. అమెరికా, యూరప్ దేశాలు ఈ వలసలను తీవ్ర సమస్యగా భావిస్తున్నాయి. వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మార్క్స్ రాసిన ఈ లేఖకు ఎంతగానో ప్రాధాన్యత ఉంది. వలసదారుల హక్కులపై ప్రస్తుతం పోరాడుతున్న న్యాయవాదులతో పాటు పలువురు మార్క్స్ లేవనెత్తిన అనేక అంశాలను విస్మరించారు. వీరు విస్మరించిన వాటిలో పెట్టుబడీదారి వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్నది అతి ముఖ్యమైన అంశం. అతి తక్కువ వేతనాలకు లభించే వలసదారులు ప్రవాహంలా ఇంగ్లండ్‌కు రావడంతో స్థానికులైన ఇంగ్లీష్ కార్మికులు కూడా తక్కువ వేతనాలకే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో విధంగా చెప్పాలంటే తక్కువ కూలికి లభిస్తున్న ఐరిష్ కార్మికులను చూపి, ఇంగ్లాండ్‌లోనూ వేతనాలను గణనీయంగా తగ్గించారు. ప్రస్తుతం వలసదారుల హక్కుల కోసం పనిచేస్తున్న పలువురు దీనికి భిన్నంగా వలసలతో స్థానికంగా జన్మించిన కార్మికుల వేతనాలు పెరుగుతాయన్న ఉదారవాద ఆర్థికవేత్తలు చెబుతున్న దానిని తలకెక్కించుకుంటున్నారు.

**ఐరిష్ వలసలపై మార్క్స్**

మార్క్స్ 1870వ సంవత్సరంలో రాసిన లేఖలో ఐరిష్ వలసలపై ఇంగ్లాండ్ తీసుకున్న విధానం వెనుక కులీన వర్గాల, పారిశ్రామిక పెట్టుబడీదారుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'ఇంగ్లాండ్ రాచరికపు ప్రభువులకు, పెట్టుబడిదారులకు ఒకే విధమైన ఆసక్తి కలిగించే ప్రయోజనాలు ఉన్నాయి. అదే ఇంగ్లాండ్ మార్కెట్‌కు మాంసం, ఊలును సాధ్యమైనంత అతి తక్కువ ధరకు సరఫరా చేసే పచ్చికబయలుగా ఐర్లాండ్‌ను మార్చేసింది.' అని ఆయన పేర్కొన్నారు. ఇంగ్లాండ్ పెట్టుబడిదారులకు మరో ప్రయోజనం కూడా ఉంది. ఐరిష్ జనాభాను బలవంతంగా తొలగించడం, తప్పనిసరిగా వలస వచ్చేలా చేయడం ద్వారా అక్కడ పెట్టిన పెట్టుబడులను (వ్యవసాయం కోసం భూములు లీజుకు తీసుకోవడం ద్వారా పెట్టిన మొత్తం) సురక్షితంగా ఉండేలా చూసుకోవచ్చు. ఇంగ్లాండ్, స్కాట్లాండులలో వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకున్న విధంగానే ఐర్లాండ్‌లోనూ చేసుకునే అవకాశం వారికి లభిస్తుంది. అనుభవంలో లేని భూస్వాముల భూములతో పాటు, ఐరిష్ నుండి ప్రస్తుతం వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఆదాయానికి సంబంధించిన వనరులనూ వారి ఖాతాల్లో జమ చేసుకునే సౌలభ్యమూ లభిస్తుంది. ఈ అంశాలను ప్రస్తావిస్తూనే మార్క్స్ ' ఇంగ్లాండ్ పెట్టుబడిదారులకు ప్రస్తుత ఐర్లాండ్ ఆర్థిక వ్యవస్థ మీద ఇంకా ముఖ్యమైన ఆసక్తులున్నాయి' అని వ్యాఖ్యానించారు.

భూములను లీజుకు తీసుకోవడం పెరుగుతుండటంతో ఐర్లాండ్ తన మిగులు కార్మికులను ఇంగ్లాండ్ మార్కెట్‌కు పెద్ద ఎత్తున పంపింది. భూముల లీజులు పెరుగుతున్న కొద్దీ ఈ సంఖ్య కూడా పెరిగింది. ఇది అనివార్యంగా ఇంగ్లాండ్ కార్మికుల వేతనాలపై ప్రభావం చూపింది. ఇది వారి నైతిక ధృతిని దెబ్బతీసింది.

ఇంకా ముఖ్యమైన అంశమేమిటంటే ... ఇంగ్లాండ్‌లోని ప్రతి పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంలోని కార్మికవర్గం రెండుగా చీలింది. ఇంగ్లీష్, ఐరిష్ కార్మికవర్గ గ్రూపులు ఏర్పడ్డాయి. తన జీవన ప్రమాణాలను తగ్గించేసిన వ్యక్తులుగా సాధారణ ఇంగ్లీష్ కార్మికుడు ఐరిష్ కార్మికులను అసహ్యించుకునేవాడు. తనను తాను పాలక వర్గంలో భాగస్వామిగా భావించుకునే అతను క్రమేణా పెట్టుబడిదారుల చేతుల్లో ఐర్లాండ్ వ్యతిరేక పరికరంగా మారిపోయాడు. ఈ విరోధ భావనను సజీవంగా ఉంచడానికి అవసరమైన అన్ని కృత్రిమ పద్ధతులను మీడియా అనుసరించేది. దినపత్రికలతో పాటు కామిక్‌లలో కూడా దీనిని రకరకాలుగా ప్రచురించేవారు. ఇంగ్లాండ్ కార్మికశక్తి నీరుగారిపోవడానికి ఈ విరోధ భావన ఒక కారణం. పెట్టుబడిదారి వర్గం తన అధికారాన్ని నిరాటంకంగా కొనసాగించడంలోని రహస్యం కూడా ఇదే! కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే తమ పైచేయికి కారణమన్న విషయం పెట్టుబడిదారులకు బాగా తెలుసు.

కారల్ మార్క్స్ 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ లేఖలోనే ఐర్లాండ్ స్వాతంత్రం పొందడం ద్వారా ఇంగ్లాండ్‌లో సామాజిక విప్లవాన్ని వేగిరపరిచే అవకాశం ఉందన్న ఆశాభావాన్నీ వ్యక్తం చేశారు. అప్పట్లో ఆయన అంత ఖచ్చితంగా చెప్పకపోయినప్పటికీ ఆ లేఖలోని అంశాలు నేటికీ సమకాలికంగా ఉండటం విశేషం. కరేబియన్ దేశాలను ఐర్లాండ్‌తోనూ, ఇంగ్లాండ్‌ను అమెరికాతోనూ పోల్చుకుంటే ఈ విషయం స్పష్టంగా అర్ధమవుతుంది. ఇంగ్లాండ్ అనుసరించిన విధానం ఐర్లాండ్‌లో చిన్నతరహా వ్యవసాయాన్ని విధ్వంసం చేసినట్టే అమెరికా ఇతర దేశాలపై రుద్దిన సరళీకరణ ఆర్థిక విధానాలు, ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎన్ఎఎఫ్‌టిఎ) వంటి అంశాలు మెక్సికో, కరేబియన్ దీవులు, మధ్య అమెరికా ప్రాంతంలోని చిన్న తరహా ఉత్పత్తిదారులను కూకటి వేళ్లతో సహా పెకలించివేశాయి. చిన్న తరహా పరిశ్రమలు పెద్ద ఎత్తున మూతపడటంతో దాని ప్రభావం వలసల రూపంలో ప్రతిఫలిం

చింది. పనులు కోల్పోయిన లక్షలాది మంది కార్మికులు ఈ దేశాల నుండి అమెరికాకు బారులు తీరారు. పొట్టకూటి కోసం ఇలా వెళ్లిన వారు అతి తక్కువ వేతనాలకే పనిచేయక తప్పని స్థితి ఏర్పడింది. ఇంగ్లాండ్‌లో గతంలో ఐర్లాండ్ కార్మికులు ఎటువంటి నిర్బంధ పరిస్థితిని ఎదుర్కొన్నారో అటువంటి పరిస్థితే వీరిది కూడా! తక్కువ జీతాలతో దుర్భర జీవన పరిస్థితులను వీరు అనుభవిస్తున్నప్పటికీ అమెరికా కార్మికులు (అక్కడే పుట్టిన వారు) వీరిని పోటీదారులుగా చూస్తున్నారు. పోటీ కారణంగా పెరిగిన ఈ శత్రుత్వ వైఖరిని వర్ణ, జాతి వివక్షలు మరింత తీవ్రం చేశాయి. 'ఈ శతృత్వ భావనను సజీవం గా ఉంచడానికి, మరింత ఉధృతం చేయడానికి అవసరమైన అన్ని కృత్రిమ పద్ధతులను మీడియా అనుసరించింది.'


అయితే, ఐరిష్ వలసల కారణంగా ఇంగ్లాండ్ కార్మికుల వేతనాలు తగ్గాయని మార్క్స్ తన లేఖలో రాశారు. వలస దారుల వ్యతిరేక శక్తులు ప్రస్తుతం అమెరికాలో ఇదే రకమైన వాదన చేస్తున్నాయి. దీని అర్థం డోనాల్డ్ ట్రంప్ వంటి వారు చేస్తున్న వాదనలను మార్క్స్ బలపరిచినట్టేనా ?

**వేతనాలపై ఆర్థిక వేత్తల నిర్ధారణ**

వలసల కారణంగా స్థానిక కార్మికుల వేతనాల్లో కోత పడుతోందన్నది అమెరికాలో ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో ఒక ప్రధాన వాదన. వలస వ్యతిరేకవాదులు దీనిని ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. స్థానిక అమెరికన్ల వేతనాలు వలసల కారణంగా గణనీయంగా తగ్గుతున్నాయని, దీంతో వారు మాతృదేశంలోనే దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని, వలసలను అంతం చేస్తే ఈ పరిస్థితి మారుతుం దని చెబుతున్నారు. అదే సమయంలో వలస దారుల హక్కుల కోసం పోరాడుతున్న వారు దీనికి భిన్నమైన వాదనను ముందుకు తీసుకు వస్తున్నారు. స్థానిక అమెరికన్ల వేతనాలపై వలస దారుల ప్రభావం చాలా తక్కువగానే ఉందని, కొన్ని సమయాల్లో వారి వేతనాలు పెరగడానికి వలసలే కారణమయ్యాయని వాదిస్తున్నారు.

ఈ రెండు రకాల వాదనలు చేస్తున్న వారు తమకు అనుకూలంగా ఉన్న అంశాలను, విద్యా వేత్తల, పరిశోధకుల వాదనలను బలంగా వినిపిస్తున్నారు. వలస వ్యతిరేక వాదనలు చేసే వారు హార్వర్డ్ కెనడీ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహించిన సాంప్రదాయ వాది క్యూబన్, అమెరికన్ జార్జి బోర్జాస్ చెప్పిన అంశాలను ప్రస్తావిస్తున్నారు. 1990–2010 సంవత్సరాల కాలంలో చోటుచేసుకున్న పరిణా

❝ అదే సమయంలో వలస దారుల హక్కుల కోసం పోరాడుతున్న వారు దీనికి భిన్నమైన వాదనను ముందుకు తీసుకు వస్తున్నారు. స్థానిక అమెరికన్ల వేతనాలపై వలస దారుల ప్రభావం చాలా తక్కువగానే ఉందని, కొన్ని సమయాల్లో వారి వేతనాలు పెరగడానికి వలసలే కారణమయ్యాయని వాదిస్తున్నారు.❞


కారల్ మార్క్స్


జార్జి బోర్జస్

మాలపై ఆయన రాసిన పుస్తకంలో 'అమెరికన్ కార్మికుల సగటు వార్షిక సంపాదనను వలసలు తగ్గించివేశాయి. సుమారుగా 1,396 డాలర్ల మేర వారి ఆదాయం తగ్గింది. వలసల ప్రభావం నైపుణ్యంతో కూడిన పనులు చేసే అనేక గ్రూపులపై రకరకాలుగా పడింది. హైస్కూల్‌తోనే చదువును ఆపివేసి పనులు వెతుక్కున్న వారు వలసల కారణంగా తీవ్రంగా నష్టపోయారు' అని ఆయన రాశారు. ఈ అంశా న్నే వలస వ్యతిరేకవాదులు పెద్ద ఎత్తున చర్చనీ యాంశం చేస్తున్నారు. అదే సమయంలో వలస దారుల హక్కుల కోసం పోరాడుతున్న వారు. కాలిఫోర్నియాకు చెందిన ప్రొఫెసర్ డేవిస్ గివాని పేరీ నిర్ధారణలను బలంగా చర్చకు పెడుతు న్నారు. పేరి నిర్ధారణల ప్రకారం 2007 నాటి అమెరికన్ డాలర్ విలువతో పోలిస్తే భారీ వలసల తరువాత కూడా 2010 నాటికి అమెరి కన్ కార్మికుల సగటు ఆదాయం 5,100 డాలర్ల కు పెరిగింది. వలస వ్యతిరేకులు, సమర్ధకులు తమకు అనుకూలంగా ఉన్న వాదనలను వినిపిం చడంపై చూపుతున్న శ్రద్ధ పరిశోధకులు రెండు పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలకు, అంకెల నిర్ధారణలకు ఎలా వచ్చారన్న దానిపై చూపడం లేదు. వేతనాలపై వలసల ప్రభావాన్ని అంచనా వేయడమన్నది సంక్లిష్టతలతో కూడుకున్నది. దీనికి అనేక పద్ధతులున్నాయి. నిర్దేశించిన సమయంలో వేతనాలను, వలసల స్థాయితో పోల్చి చూడటం ఒక పద్ధతి. ఉదాహరణకు 1970వ సంవత్సరం నుండి నిజ వేతనాల స్థంభనకు, ఆ కాలంలో పెరిగిన వలసలకు మధ్య సంబంధం ఉందని పలువురు భావిస్తారు. అయితే, మరికొన్ని కారణాలు కూడా ఉండే అవకాశం ఉంది. కార్మిక ఉద్యమం బలహీన పడటం, ఆటోమేషన్ వంటి కారణాలతో ఉ పాధి కల్పన అవకాశాలు తగ్గిపోవడం, ఇటువం టివే మరికొన్ని కూడా! వీటిని గుణాత్మకంగా నిర్ధారించడం కష్టం. మరో మాటలో చెప్పాలంటే వలసలు లేకపోతే నిజ వేతనాలు ఈ స్థాయిలో ఉండేవన్న అంశాన్ని ఖచ్చితంగా చెప్పలేని పరిస్థి తి కూడా ఉంది. ఈ రకమైన లెక్కలు వేయడానికి పూర్తిస్థాయి నమ్మకమైన ప్రమాణాలు లేవు.

మరో పద్ధతిలో దేశంలోని వివిధ ప్రాంతాలలోని వేతనాలను పోల్చి చూస్తారు. ఉదాహరణకు వలసలు పెరిగిన కారణంగా ఒక పట్టణంలో వేతనాలు పెరిగితే, అదే సమయం లో వలసలు తగ్గడం ద్వారా మరో

> **“దీనికి కారణం ఏమిటంటే వలసదారులు కేవలం కార్మికుల సంఖ్యను పెంచడం మాత్రమే కాదు, వారు ఆ ప్రాంతంలోని వస్తువులను కొంటారు, సేవలను వినియోగించుకుంటారు. ఫలితంగా వస్తువులకు, సేవలకు డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా ఆ వస్తువులను, సేవలను ఎక్కువగా ఉత్పత్తి చేయాల్సివస్తుది. ఫలితంగా కార్మికులకూ డిమాండ్ పెరుగుతుంది.”**



ట్రంప్ హయాంలో అమెరికాలో వలస వచ్చిన ప్రజలపై హింసాకాండ పెరిగింది

పట్టణంలో వేతనాలు తగ్గుతాయి. ఇది వలసదారుల పక్షాన మాట్లాడే వారికి అనుకూలంగా ఉంది. అయితే, ఈ రెండు రకాల వాదనలు చేస్తున్న వారు వేతనాల క్షీణతకు అసలు కారణాన్ని చూడటానికి బదులుగా సంబంధాన్ని మాత్రమే చూస్తున్నారు. కేవలం అంకెల ఆధారంగా పరిశీలన జరపడమే దీనికి కారణం. అంకెలను పరిశీలించినంత మాత్రాన వివాదరహిత ముగింపునకు రాలేము.

**ఆర్థికవేత్తల సిద్ధాంతపర నమూనాలు**

ఆర్థికవేత్తలు తమ వాదనలను బలపరుస్తూ కొన్ని సిద్ధాంతపరమైన అంశాలనూ ముందుకు తీసుకువచ్చారు. సప్లై, డిమాండ్ సిద్ధాంతం ఆధారంగా రూపొందిన వాదన వీటిలో ఒకటి. వలసదారులు కార్మికుల్లో భాగస్వాములుగా మారినప్పుడు వారు కార్మికుల సప్లైని మాత్రమే పెంచుతారు. ఆ సమయంలో అవసరమైన కార్మికులకన్నా అందుబాటులో ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీని ఫలితంగా వేతనాలు పడిపోతాయి. అయితే, తాత్కాలికమే! కొంత కాలానికి వేతనాల రేటు స్థిరీకరణ చెందుతుంది. దీనికి కారణం ఏమిటంటే వలసదారులు కేవలం కార్మికుల సంఖ్యను పెంచడం మాత్రమే కాదు, వారు ఆ ప్రాంతంలోని వస్తువులను కొంటారు, సేవలను వినియోగించుకుంటారు. ఫలితంగా వస్తువులకు, సేవలకు డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా ఆ వస్తువులను, సేవలను ఎక్కువగా ఉత్పత్తి చేయాల్సివస్తుది. ఫలితంగా కార్మికులకూ డిమాండ్ పెరుగుతుంది. అయితే, ఇది ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా కనిపిస్తుంది. 1970 నుండి 2008 సంవత్సరాల మధ్య కాలంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వలసదారులు అమెరికా కార్మికుల్లో కలిశారు. వీరి ఇంగ్లీషు సామర్థం చాలా తక్కువ! వీరంతా మాన్యువల్ ఉద్యోగాల కోసం పోటీపడ్డారు. దీంతో అదేపని చేసే అమెరికన్ స్థానికుల వేతనాలు తగ్గుముఖం పట్టాయి. వలసలు వేతనాలను తగ్గిస్తాయంటూ బోర్జా చేసిన వాదనకు ఇదే ఆధారం.

అదే సమయంలో పెరి, అతని సహచరులు ఇదే సప్లై, డిమాండ్ సిద్ధాంతాన్ని మరింతగా మెరుగుపరిచి భిన్నమైన ఫలితాలను చూపించారు. దీనిని వారు ‘పరస్పర పూరకం’గా అభివర్ణించారు. వీరి ఉద్దేశ్యంలో తక్కువ వేతనాలు పొందే వలసదారులు స్థానికంగా జన్మించిన కార్మికులకు ప్రత్యామ్నాయం కాలేదు. వలసదారులకు ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం లేని కారణంగా కమ్యూనికేషన్ నైపుణ్యం ఎక్కువగా అవసరమైన ఉద్యోగాలకు, ఉన్నతస్థాయి పోస్టులకు వారు అనర్హులుగా ఉండేవారు. నిర్మాణ రంగంలో కూలీలుగానే వలసదారులు ఉపాధి పొందడం, పర్యవేక్షణతో పాటు, ఇతర నైపుణ్యపనులన్నీ స్థానిక అమెరికన్లకే దక్కడాన్ని వారు ఎత్తిచూపారు. పెరీ, అతని సహచరుల ప్రకారం సాధారణ సప్లై, డిమాండ్ సూత్రాల ప్రాతిపదికగా వలస సమస్యను చూడకూడదు. ఇది భిన్నమైనది. వలసలు నామమాత్రపు చదువు ఉన్న స్థానికుల వేతనాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నప్పటికీ అది తాత్కాలికమే. వాస్తవానికి ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో ఉన్న వారు పొందుతున్న ప్రతిఫలం ఎక్కువ. అదే సమయంలో ఉత్పత్తి, వినియోగరంగంలో గణనీయమైన సానుకూల ప్రభావం ఉంది. వీరి అధ్యయనాల ప్రకారం వలసలతో దీర్ఘకాలంలో సగటు కార్మికుని వేతనం 0.6 నుండి 0.9 శాతం పెరుగుతుంది.

**ఆర్థికవేత్తలు విస్మరించిందేమిటి?**

రెండు వాదనలను సమర్థించే ఆర్థికవేత్తలు కొన్ని కీలకాంశాలను విస్మరించారు. వేతనాలకు సంబంధించి వారి నిర్ధారణలు డిమాండ్, సప్లై, విద్య, పని నైపుణ్యం తదితర అంశాల ఆధారంగా సాగాయి. అయితే, వాస్తవ ప్రపంచంలో అనేక ఇతర అంశాలు కూడా పనిస్థలంలో వేతనాలను ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు మహిళలు, ఆఫ్రికన్ అమెరికన్లకు ఎప్పుడూ తక్కువ వేతనాలే ఉంటాయి. దీని అర్థం వారి సరఫరా ఎక్కువ ఉందనో, వారికి నైపుణ్యం లేదనో కాదు. వలస కార్మికుల్లో ఎక్కువ మంది నల్లవారే! వర్ణ వివక్ష కూడా వేతనాల నిర్ధారణపై ప్రభావం చూపుతోంది. 2016లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం కూడా డిమాండ్, సప్లై, విద్య, నైపుణ్యం వంటి ప్రత్యక్ష అంశాలు కాకుండా వివిధ రకాల వివక్షలు, ఇతర పరోక్ష కారణాలు వేతనాలపై ప్రభావం చూపుతున్నాయి. దాదాపు 52 శాతం కార్మికులు ఈ తరహా కారణాల వల్ల తక్కువ వేతనాలు పొందుతున్నారు. వలసదారుల చట్టబద్ధ స్థితి కూడా వేతనాలపై ప్రభావం చూపుతోంది.

2012 లెక్కల ప్రకారం 81 లక్షల మంది అనధికారికంగా (సరైన పత్రాలు లేకుండా) అమెరికాలో ఉన్నారు. ప్రఖ్యాతి గాంచిన అధ్యయన సంస్థ ప్యూ రిసెర్చి నివేదిక ప్రకారం ఈ తరహా కార్మికులు మరింత దుర్లభమైన పరిస్థితుల్లో బతుకులు ఈడుస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పాటు ప్రాసిక్యూట్ చేయడం, దేశం నుండి పంపివేయడం వంటి ప్రమాదాల భయమూ వారిని వెంటాడుతోంది. వీరికి సమ్మెచేసే హక్కు కూడా లేదు. ఈ తరహా కార్మికుల సప్లై ఎక్కువగా లేకపోయి నప్పటికీ వారికి చెల్లించే వేతనాలు మాత్రం ఎప్పటికీ తక్కువే! ఈ పరిస్థితి అమెరికాలో జన్మిం చిన స్థానిక కార్మికుల వేతనాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. 2005లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం అనధికారికంగా నివసించే కార్మికులు ఇన్సులేషన్ పనుల్లో 36శాతం, భవన నిర్మాణ పనుల్లో 29 శాతం ఉన్నారు. వీరి ప్రభావంతో ఆ రంగాల్లో పని చేసేవారికి తక్కువ వేతనాలు వస్తున్నాయి.

**కార్మికవర్గ విభజన**

ఆర్థికవేత్తలు విస్మరించినది, కారల్ మార్క్స్ ప్రధానంగా ప్రస్తావించిన అంశం ఒకటి ఉంది. అది కార్మికవర్గంలో జరిగిన విభజన. 'మనకు ఇది చాలా ముఖ్యమైన అంశం' అని మార్క్స్ దీనిని ప్రస్తావించారు. ఐరిష్ వలసల సందర్భంగా మార్క్స్ పేర్కొన్న విధంగానే ఇప్పుడు వలసదారుల అంశాన్ని కార్మికుల్లో చీలిక తీసుకురావడానికి పెట్టుబడిదారీ శక్తులు వినియోగించుకుంటున్నాయి. 'పెట్టుబడి కార్మికులను రెండు ప్రత్యర్థి గ్రూపులుగా మార్చివేసింది' అని మార్క్స్ అప్పట్లో పేర్కొన్నారు. అమెరికాలో ప్రస్తుతం కార్పొరేట్ శక్తులు అదే పని చేస్తుండగా మరోవైపు వలసదారులపై ఏర్పరుచుకున్న దురభిప్రాయం కారణంగా జనాభాలోని అత్యధిక ప్రజానీకం తమ అసలు శక్తిని గుర్తించలేక పోతున్నారు. జాతి, వర్ణ, లింగ వివక్షలు కూడా కార్మికులలో చీలిక తీసుకువస్తున్నాయి. వలస కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న దురభి ప్రాయాలు కార్మిక ఉద్యమాన్ని బలహీనపరుస్తున్నాయి.

> **"పెట్టుబడి కార్మికు లను రెండు ప్రత్యర్థి గ్రూపులుగా మార్చివేసింది' అని మార్క్స్ అప్పట్లో పేర్కొన్నారు. అమెరికాలో ప్రస్తుతం కార్పొరేట్ శక్తులు అదే పని చేస్తుండగా మరో వైపు వలసదారులపై ఏర్పరుచుకున్న దురభిప్రాయం కారణంగా జనాభాలోని అత్యధిక ప్రజానీకం తమ అసలు శక్తిని గుర్తించలేక పోతున్నారు."**

**వలసలపై కాదు .. దోపిడిపై పోరాటం!**

ఐరిష్ వలసలపై కారల్‌మార్క్స్ రాసిన పరిస్థితులే ప్రస్తుతం అమెరికాలో ఉన్నాయి. అనధికారిక వలసదారుల సమస్య అదనంగా ఉంది. ప్రస్తుతం తయారవుతున్న అనేక చట్టాలు లక్షలాది మంది వలసదారులపై 'అనధికారిక' ముద్రవేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికాలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పరిశీలించాలి. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో సెనెటర్ శాండర్స్ కూడా ఈ అంశాలపై గట్టిగా గళం వినిపించారు. 2008 ఆర్థిక సంక్షోభం తరువాత వలసదారులు, నల్లవారి హక్కులపై చర్చించే అవకాశాన్ని మరింత పెంచింది. రాజకీయ వాతావరణమూ దానికి దోహదం చేసింది. ఆశ్చర్యకరంగా 'ఫస్ట్ అమెరికా' అంటూ ట్రంప్ చేసిన ప్రచారం కూడా వలసదారుల వాస్తవ జీవనస్థితిగతులపై అధ్యయనానికి సహకరించింది. ట్రంప్ ప్రసంగం తరువాత పలువురు అమెరికన్లు ఈ దిశలో అనేక ప్రయత్నాలు చేశారు. దేశభక్తి ముసుగులో కొనసాగుతున్న వివక్షను గుర్తించారు.

1870వ సంవత్సరంలో కారల్‌మార్క్స్ రాసిన లేఖలో ఇంగ్లాండ్‌లో కార్మికులను సమైక్యపరచవలసిన అవసరం గురించి నొక్కి వివరించారు. 'ఐర్లాండ్ వలసదారుల నుండి విముక్తి చెందడమన్న భావన పరిపూర్ణమైనది, మానవత్వంతో కూడుకున్నది, న్యాయసమ్మతమైనది కాదు. ఈ విషయాన్ని ఇంగ్లాండ్ కార్మికులకు వివరించాలి. దానికన్నా తమ సొంత సామాజిక స్థితిగతుల నుండి విముక్తి పొందడమన్నది చాలా ముఖ్యం' అని ఆయన పేర్కొన్నారు. మేయర్, వోగ్ట్‌లకు రాసిన ఆ లేఖను 'ఇదే భావాలతో మీరు పనిచేస్తున్నారు. జర్మనీ కార్మికులతో ఐరిష్ కార్మికుల ఐక్య సంఘటనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ( అటువంటి ఐక్య సంఘటనకు సిద్ధంగా ఉన్న ఇంగ్లండ్, అమెరికా కార్మికుల ఐక్యతకు అదే ప్రాధాన్యత ఉంది) కార్మికుల మధ్య అటువంటి బలమైన ఐక్యతే మనం సాధించాల్సిన అతి గొప్ప కర్తవ్యం' అన్న చివరి వ్యాక్యాలతో మార్క్స్ ముగించారు. కారల్ మార్క్స్ ప్రతిపాదించిన ఆ అంతర్జాతీయ తత్వం, వర్గ ప్రాతిపదిక ఆలో చనా విధానాలకు ప్రస్తుత శతాబ్దాంలోనూఎంతో ప్రాధాన్యత ఉంది. వలసదారులపై కాకుండా, అటువంటి దీన పరిస్థితిని సృష్టించి, ప్రపంచ మంతా నిరాటంకంగా సాగుతున్న దోపిడి విధానంపై పోరాటం కొనసాగించాల్సిఉంది. ❊

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్థిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# సిరియా ఆక్రమణే అమెరికా ధ్యేయం

బుడ్డిగ జమిందార్



రచయిత ఆల్ఇండియా ఫ్రోగ్రెసివ్ ఫోరమ్, జాతీయ కార్యవర్గ సభ్యులు

సిరియా ప్రభుత్వ సేనలు అలెప్పో నగరం నుండి ఇస్లామిక్ స్టేట్ టెర్రరిస్టు సేనలను తరిమివేసి నగరాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొన్నాయి. ఇది డిసెంబర్ 2016లో జరిగింది. కొందరు మిలిటెంట్స్ చనిపోయారు. మిగిలిన వారిలో సగం మంది సిరియా సేనలకు లొంగిపోయారు. 5 వేలమంది ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్లు రాత్రికి రాత్రే ఇడ్లిబ్ ప్రాంతానికి పారిపోయారు. ఆరు సంవత్సరాల సిరియా అంతర్యుద్ధంలో ఇది కీలక పరిణామం. సిరియా సేనలు రఖ్ఖా నగరాన్ని, చారిత్రాత్మక పల్మైరాను విమోచనం చేయటానికి పూనుకొని దేష్ మిలిటెంట్లతో పోరాడుతూ ఈ సంవత్సరం జనవరిలో ముందుకు దూసుకెళ్ళాయి. ఫిబ్రవరి నెలలో కజకిస్థాన్ రాజధాని ఆస్థానాలో సిరియా శాంతి చర్చలను రష్యా, ఇరాన్, టర్కీలు చొరవతీసుకొని ప్రారంభించాయి. ఆఖరి నిమిషంలో అమెరికాకు ఆహ్వానం అందింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ప్రతినిధులు, ప్రతిపక్షాలు ఒకచోట ఎదురుబొదురుగా కూర్చొని చర్చలు జరపటం ఇదే మొదటిసారి. కాల్పుల విరమణపై ఒప్పందానికి వచ్చారు. తదనంతరం జెనీవాలో చర్చలు జరిగినవి. ఈ క్రమంలో 70 దేశాల డోనర్స్ సదస్సు బ్రెజిల్‌లో జరిగింది. మార్చి 30న ఐరాసలోని అమెరికా రాయబారి నిక్కీహెలీ మాట్లాడుతూ“ సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్‌ను గద్దె దింపాలనే కాంక్ష ఇంకేమాత్రం మా ప్రాధాన్యతా క్రమంలో లేదు ” అని ప్రకటించింది. సిరియాలో యుద్ధనివారణ దిశగా శాంతిచర్చలకు ప్రాధాన్యత కల్గుతుందని ప్రపంచ ప్రజలు ఆశించారు. హేలీ ప్రకటనానంతరం ఎక్కువమంది డెమోక్రాట్స్, రిపబ్లికన్ సెనేటర్లు ట్రంప్ ప్రభుత్వంపై వత్తిడి పెంచి, ఒబామా ప్రభుత్వ పాత విధానాలనే కొనసాగించమని కోరారు. సెనేటర్ జాన్‌మైక్ కేన్ “సిరియా విషయంలో అమెరికా విదేశాంగ విధానం మారకూడదు' అని చెబుతూ, అస్సాద్ ప్రభుత్వాన్ని గద్దెదించే యోచనలో మార్పు ఉండకూడదన్నారు. దీనితో విదేశాంగమంత్రి రెక్స్‌టిల్లర్‌సన్ ఇరాక్, సిరియాల్లో దీర్ఘకాలిక ప్రాతిపదికన అమెరికా తిష్టవేయటానికి ప్రణాళికలు రచించారు. దీని ప్రకారం సిరియా, ఇరాక్‌లు కొన్ని సుస్థిర జోన్లగా విభజించబడతాయి. అస్సాద్ వ్యతిరేక, అమెరికా అనుకూల కీలుబొమ్మ ప్రభుత్వాలు ఏర్పడతాయి.

ఇస్లామిక్‌స్టేట్‌పై, అమెరికా బలపర్చిన అస్సాద్ వ్యతిరేకశక్తులపై 2015 సెప్టెంబరు 30 నుండి రష్యా విమాన దాడులు ప్రారంభమైన తర్వాత నానాటికి బలహీనపడ్తున్న ఇస్లామిక్ స్టేట్, ప్రతిపక్షాలలో అమెరికా తన ప్రాధాన్యతను కోల్పోవటం మొదలైంది. ఏదో ఒక సాకుతో అస్సాద్ ప్రభుత్వంపై దాడులు జరపాలి. అస్సాద్‌ను గద్దెదింపాలి. ఇది ఏప్రిల్ నెలలో అమెరికా ఎంచుకొన్న వ్యూహం. దానికి అనుగుణంగానే తెరపైకి వచ్చింది ‘రసాయన బాంబుల కుట్ర’.

ఖాన్ షీబున్ పట్టణంలో రసాయన వాయు బాంబు ప్రయోగించబడిన ఘటనలో 86 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో పిల్లలు, స్త్రీలు ఉన్నారు. ఈ ప్రాంత ప్రభుత్వం తిరుగుబాటు దారులు, ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్ల స్వాధీనంలోని ఆక్రమిత ఇడ్లిబ్ ప్రాంతంలో ఉన్నది. ఏప్రిల్ మొదటి వారంలో ఘటన జరిగిన వెంటనే ట్రంప్ ప్రభుత్వం స్పందించి ‘ఈహేయమైన రసాయన విధ్వంసానికి అస్సాద్ ప్రభుత్వమే భాధ్యత వహించాలి. దీని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి’ అని హెచ్చరించింది రసాయనిక బాంబుల విధ్వంసానికి, తమ ప్రభుత్వానికి ఏ విధమైన సంబంధం లేదని అధ్యక్షుడు అస్సాద్ ప్రకటించారు. ఈ ప్రాంతం దేష్ ఆధీనంలో ఉందని, ఇస్లామిక్ – ఆల్ మషా ఫ్రంటు ఈప్రాంతంలో ఒక ఆయుధ కర్మాగారం కల్గి ఉందని, అక్కడే ఈ విధ్వంసకర మారణాయుధాలు తయారవుతున్నాయని, అందులోని రసాయనిక ఆయుధాల పేలుళ్లవలనే విధ్వంసం జరిగిందని అస్సాద్ ప్రభుత్వం తెల్పింది. తిరుగుబాటుదారులు పెద్ద డ్రమ్ముల్లో విషవాయువుల్ని నింపి ఇరాక్‌కు రవాణా జరుపుతున్న సమయంలో సిరియా విమాన దాడులు జరిగినప్పుడు ఖాన్‌షేబున్ పట్టణంలో ఈ ఘటన జరిగి ఉండవచ్చని రష్యారక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. అయినా ఒక్క నిమిషం కూడా ఆగకుండా అస్సాద్ ప్రభుత్వమే దాడులు నిర్వహించిందని కార్పొరేట్ మీడియాకు వెంటనే చెప్పేసి ప్రచారం ప్రారంభించింది. ఏప్రిల్ 7న సిరియానగరం హామ్స్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని సైనిక వైమానిక స్థావరంపై మధ్యధరా సముద్రం నుంచి 59 టోమహాక్ క్షిపణులను తెల్లవారుఝామున ప్రయోగించింది. ఒక్కొక్క క్షిపణి ఖరీదు 12 లక్షల డాలర్లు. 9 సిరియా యుద్ధవిమానాలు ధ్వంసమైనాయి. 14 మంది చనిపోయారు. వారిలో సాధారణ పౌరులు కూడా ఉన్నారు. ‘ ఇది సిరియా సార్వభౌమాధికారంపై దాడి’గా రష్యా అభివర్ణించింది. సిరియాకు మద్దతు తెల్పి మరింత రక్షణ కల్పిస్తామని పేర్కొంది.

### వియత్నాం –ఇరాక్ తరహాదాడులు

కల్నల్ లె స్పుత్నిక్ ఇంటర్వ్యూలో సిరియాపై పెంటగాన్ జరిపిన దాడికి, వియత్నాంలో గల్ఫ్ ఆఫ్ టోన్కిన్ దాడికి దగ్గరగా పోలిక ఉందని అన్నారు. గల్ఫ్ ఆఫ్ టోన్కిన్ దాడిని వియత్నాం ఎప్పటికీ మరిచిపోదు. వియత్నాంపై ఈ ఘటనతో ప్రారంభమైన యుద్ధం అమెరికా ఓటమితో ముగిసింది అని లె పేర్కొన్నారు.

"ఆరు సంవత్సరాల సిరియా యుద్ధంలో కనీసం 5 లక్షల మంది సామాన్యపౌరులు ప్రాణాలను కోల్పోయారు. రెండుకోట్ల ఇరవై లక్షల జనాభా కల్గిన సిరియా దేశప్రజల్లో 2017 మార్చి 30 నాటికి 50 లక్షల మంది శరణార్థులుగా దేశాన్ని వదిలివెళ్లిపోయారని యుఎన్‌హెచ్‌సిఆర్ (యునైటెడ్ నేషన్స్ హై కమీషన్ ఫర్ రిఫ్యూజీస్) వెల్లడించింది."

1999లో ప్రెసిడెంటు బిల్‌క్లింటన్ యుగోస్లోవియాలో ఇదే తరహా దాడులు జరిపాడు. బుష్ 2001లో 'టెర్రరిజంపై పోరు' నినాదంతో ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించి ఇప్పటికీ అక్కడ నుంచి అమెరికా సేనలను ఉపసంహరించుకోలేదు. 2003లో బాగ్దాద్‌లో రసాయన ఆయుధాల నిల్వలు ఉన్నాయని ఇరాక్‌పై దాడికి దిగి లౌకికవాది సద్దాంను చంపి, ఇరాక్ సమాజాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసి, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద పుట్టుక, పెరుగుదలకు అమెరికా కారణమైంది. 2011లో నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా లిబియాపై యుద్ధాన్ని ప్రారంభించి విమానాలతో బాంబుల వర్షం కురిపించి గడ్డాఫీని క్రూరంగా చంపి ఉత్తర ఆఫ్రికాలో అశాంతికి కారణమయాడు. ఇరాక్, లిబియాల్లో సామ్రాజ్యవాదం చేసిన తప్పిదాలను సిరియాలో పునరావృతం కానీయరాదని ఫ్రెంచ్ అధ్యక్ష అభ్యర్థిని లెపెన్ ప్రకటించారు. "సిరియా విషయంలో జాగ్రత్త వహించాలని ట్రంప్‌ను కోరుతున్నారు. ఇరాక్, లిబియా పర్యవసానాలు మనకు తెల్సినవే. ఎక్కువ శాంతి, ఎక్కువ ప్రశాంతత, పౌరులకు మరింత రక్షణ మీ చర్యల ద్వారా తీసుకురాలేమనేది వాస్తవం" అని లెపెన్ తెలిపారు. సిరియాలో రసాయనదాడులు ఆసరాగా రష్యాపై జీ 7 దేశాలు ఆంక్షలు విధించాలని మాస్కో పర్యటన మానుకొని హఠాత్తుగా ఇటలీకి వచ్చిన యు.కె. విదేశాంగ కార్యదర్శి బోరిస్ జాన్సన్‌కు చేదు అనుభవం ఎదురైంది. జి 7 దేశాల్లో రష్యాపై ఆంక్షలకు ఏకాభిప్రాయానికి రాకపోవటంతో అమెరికా తొత్తు యు.కె విదేశాంగ కార్యదర్శికి నిరాశే మిగిలింది. 'మీ దగ్గర నిరూపించే సమాచారం ఏమీలేదు గనుకనే రసాయన ఘటనపై విచారణకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని మాస్కోలో రష్యా తీవ్ర స్వరంతో అమెరికా క్షిపణు దాడుల్ని సవాల్ చేయడంతో ట్రంప్ దూకుడుకు కళ్లెం పడింది. మరోవైపు ఇరాన్, సిరియా రష్యా, విదేశాంగ మంత్రులు మాస్కోలో సమావేశమై అమెరికా క్షిపణి దాడుల్ని ఖండించి, పర్యవసానాలకు అమెరికా బాధ్యత వహించాలని హెచ్చరించారు.

**శరణార్థుల వ్యతిరేకతతో అధికారవాంఛ**

ఆరు సంవత్సరాల సిరియా యుద్ధంలో కనీసం 5 లక్షల మంది సామాన్యపౌరులు ప్రాణాలను కోల్పోయారు. రెండుకోట్ల ఇరవై లక్షల జనాభా కల్గిన సిరియా దేశ ప్రజల్లో 2017 మార్చి 30 నాటికి 50 లక్షల మంది శరణార్థులుగా దేశాన్ని వదిలివెళ్లిపోయారని



అమెరికా బాంబుదాడిలో దగ్ధమౌతున్న కొబాని నగరం

యుఎన్‌హెచ్‌సిఆర్ (యునైటెడ్ నేషన్స్ హై కమీషన్ ఫర్ రిఫ్యూజీస్) వెల్లడించింది. కనీసం 75 లక్షల మంది దేశంలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కట్టుబట్టలతో పారి పోయారు. వలసలు రోజురోజుకి పెరుగుతు న్నాయి. దేశంలో శరణార్థుల పరిస్థితులు ఘోరంగా దిగజారుతున్నాయి. తిండి, త్రాగు నీరు, వసతి, మందులు లేక నానా అవస్థలు పడుతున్నారు. మానవీయ కోణంలో ఆదుకోవా లని ఒక పక్క యుఎన్‌హెచ్‌సిఆర్ ప్రకటిస్తుంటే యుద్ధాలకు కారకులైన అమెరికా, ఫ్రాన్స్, యు.కె, జర్మనీ వంటి దేశాలు శరణార్థులను రానీయ కుండా ప్రొటెక్షనిజం, జాతీయవాదం పేరుతో మితవాద ఫాసిస్టు పార్టీలు ఓట్లను దండుకొని, అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికల్లో శరణార్థుల ఎజెండా పెట్టవద్దని యుఎన్‌హెచ్‌సిఆర్ కోరు తున్నది. మానవతా విలువలకు తిలోదకాలిచ్చి, ప్రతిపక్షాలతో కలిసి రసాయనిక దాడులు జరిపి, మరలా మానవత్వం మట్టికల్సిపోతుందని ప్రచారం చేస్తున్నది. అమెరికా మిత్రదేశాలు సిరియాపై యుద్ధదాడిని పెంచడానికి, మధ్య ప్రాచ్యంలో మిలిటరీ స్థావరాన్ని ఏర్పాటు చేసుకొ నుటకు అమెరికా ఎప్పటికప్పుడు ప్రణాళికలను రచిస్తూనే ఉన్నది. సామ్రాజ్యవాదానికి యుద్ధాలు అశాంతులూ తోడు – నీడల వంటివి. చమురు మార్కెట్‌పై ఆధిపత్యం, భౌగోళిక ప్రాధాన్యత దృష్ట్యా మధ్యధరా సముద్రం అరబ్ దేశాలలో అమెరికా శాంతికి విఘాతం కలిగిస్తూనే ఉంటుంది.

**హేయమైన సామ్రాజ్యవాద రసాయన దాడుల చరిత్ర**

సామాన్యపౌరులపై రసాయన ఆయుధాల్ని ప్రయోగిస్తున్నది సామ్రాజ్యవాదమే. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ 1915 ఏప్రిల్‌లో బెల్జియం యెప్రెస్‌లో క్లోరిన్ గ్యాస్

❝ అమెరికా సంకీర్ణసేనలు ఏప్రిల్ 13 మధ్యాహ్నం 2.30 - 2.50 గంటల సమయం లో డైర్- ఎర్- జోర్‌లో దేష్ ఆయుధ నిల్వలపై దాడిచేసినప్పుడు రసాయన పేలుళ్లు సంభవించాయని అస్సాద్ ప్రభుత్వం తెలిపింది. ఈదాడి లో 200 మంది వరకూ పౌరులు చనిపోయారని తెలిపినా అమెరికా మీడియా మాత్రం ఏమీ తెలియనట్లు మిన్నకుంది.❞



ఆఫ్ఘనిస్తాన్‌లో ఎం.ఒ.ఎ.బి. సృష్టించిన విధ్వంసం

ప్రయోగించగా 9 లక్షల మంది మరణించారు. లక్షలాది మంది గాయపడ్డారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం 1925లో జెనీవా కమిటీ అంతర్జాతీయ, అంతర్యుద్ధాలలో రసాయనా యుధాలు వాడకూడదని నిషేదం విధించినా, రెండవ ప్రపంచయుద్ధ కాలంలో కాన్సంట్రేషన్ క్యాంపుల్లో ఫాసిస్టు హిట్లరు వేలాదిమంది కమ్యూనిస్టులను, యూదులను, సోషలిస్టులను గ్యాస్ ఛాంబర్స్‌లో హతమార్చాడు. వీర వియత్నాంపై యుద్ధంలో 1962–1971 మధ్య అమెరికన్ మిలిటరీ రసాయనిక ఆయుధాలను వాడి అడవులను, వ్యవసాయ పంటలను ధ్వంసంచేసి, నదులు, వాగులను కలుషితం చేసి, లక్షలాది మంది వియత్నామీయులను చంపిన క్రూరచరిత్ర అమెరికా సామ్రాజ్య వాదానిదే. కేవలం 1965– 1970 మధ్య 130 లక్షల గాలన్ల ఏజెంట్ ఆరంజ్ హెర్బి సైట్స్‌ను వాడారు. ఒక్క 1965 సంవత్సరం లోనూ రాంచ్‌వరండ్ ఆపరేషన్ పేరిట 10 లక్షల హెక్టార్ల అడవులను ధ్వంసం చేశారు. ఈ యుద్ధ కాలంలో ప్రతి ఏటా 45 లక్షల ఎకరాల పంటలను ధ్వంసం చేసేవారు.

గాలి, నీరు కలుషితమవ్వటం ద్వారా పశుపక్ష్యాదులు మరణించాయి. జీవవైవిధ్యం నాశనమైంది. మానవులు అనేక ఆరోగ్యపరఇబ్బందులతో, ముఖ్యంగా చర్మవ్యాధులు, రెండవశ్రేణి మధుమేహం, ప్రోస్టేట్ క్యాన్సరు, ల్యుకేమియా వంటి వ్యాధులతో 6 లక్షల మందికి పైగామరణించారు. 2003 నాటికి ఇంకా 6.50 లక్షల మంది ఈ వ్యాధులతో సతమతమవుతున్నారు.

1945 ఆగస్టు 6,9 తేదీల్లో హిరోషిమా నాగసాకీల్లో మొట్టమొదటి, రెండవ అణుబాంబు లను ప్రయోగించి 2.50 లక్షల మందిని పొట్టన పెట్టుకొన్న హీన చరిత్ర సామ్రాజ్యవాదానిదే. ఆఫ్ఘనిస్తాన్ శాంతిచర్యలు ఏప్రిల్ 14న మాస్కోలో 11 తేదిలలో ప్రారంభమైనవి. రష్యా, చైనా, ఇరాన్‌లతో పాటు కీలకదేశాలైన ఇండి యా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, మరొక 5 సెంట్రల్ ఆసియా దేశాలైన ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, కజకిస్థాన్ దేశాలు చర్చల్లో పాల్గొన్నాయి. ఈ సమయంలో "బాంబులకు తల్లిబాంబు"గా నామకరణం చేసిన జిబియు–43/బి బాంబును ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రయోగించిం ది. ఇప్పటివరకూ ప్రయోగించ బడిన అతిపెద్ద అణుయేతర బాంబు ఇది. ఈ ప్రయోగంలో అనేక మంది మరణించారు. ఈ బాంబు షాక్‌త రంగాలతో 2 కిలోమీటర్ల వ్యాసార్థములోని జనాలను, జంతు జీవాలను చంపుతుంది. ఆఫ్ఘ నిస్థాన్ శాంతి చర్చలను ముందుకు సాగనివ్వ కుండా అమెరికా తన బల ప్రదర్శనను సూచించ టానికి, తన ఉనికిని కాపాడుకోవటం కోసం మాత్రమే ఈ తల్లిబాంబును ప్రయోగించింది.

అమెరికా సంకీర్ణసేనలు ఏప్రిల్ 13 మధ్యాహ్నం 2.30 – 2.50 గంటల సమయం లో డైర్– ఎర్– జోర్‌లో దేష్ ఆయుధ నిల్వలపై దాడిచేసినప్పుడు రసాయన పేలుళ్లు సంభవిం చాయని అస్సాద్ ప్రభుత్వం తెలిపింది. ఈదాడి లో 200 మంది వరకూ పౌరులు చనిపోయారని తెలిపినా అమెరికా మీడియా మాత్రం ఏమీ తెలియనట్లు మిన్నకుంది. ఫునా, కెఫ్రాయా ప్రాంతాల నుండి సామాన్య పౌరులను సురక్షిత ప్రాంతాలకు బస్సులలో తరలిస్తుండగా, టెర్రరి స్టులు మానవబాంబులను ఉపయోగించగా 100 మందికిపైగా మరణించారు, ఈ ఘటన ఏప్రిల్ 15 నాడు జరిగినా, ఇంతవరకూ సంకీర్ణ సేనలు కనీసం విచారం వ్యక్తపరచలేదు. కార్పొరేట్ మీడియా ఏమీ తెలియనట్లు నటిస్తున్నది.

రసాయన ఆయుధాల నిషేద సంస్థ (ఒపిసిడబ్ల్యూ) ను ఇడ్లిబ్ ప్రాంతాల్లోని ఘటనా స్థలంలో పర్యటించి నివేదిక ఇప్పించటానికి అమెరికా సంకీర్ణదేశాలు ఒప్పుకోక పోవటాన్ని రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్ తప్పు పట్టారు. సిరియాలో జరిగిన రసాయన బాంబు ప్రయోగాన్ని అస్సాద్ ప్రభుత్వంపై మోపి ప్రభుత్వాన్ని మార్చటానికి, తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని నెలకొల్పటానికై కుట్ర జరుగుతుందని అస్థానాలో లావ్రోవ్ తెలియపర్చాడు. '6 నెలల క్రితం అలెప్పో నగరంలోని ప్రభుత్వ సేనలపై టెర్రరిస్టులు రసాయన ఆయుధాలను ప్రయోగిం చినప్పుడు కూడా, ఆ ఘటనపై విచారణ జరపటానికి అమెరికా ఒప్పుకోలేదు. అప్పుడే విచారణ జరిగిఉంటే టెర్రరిస్టుల దగ్గర రసాయన ఆయుధాలు ఉన్నాయని తెలిసేది" అని సిరియా అధ్యక్షుడు అస్సాద్ అంటున్నారు.

ఈ ఘటనలో సిరియా ప్రభుత్వ పాత్ర లేదని రష్యారక్షణ శాఖ వివరిస్తూ, 2014 నుండి సిరియాలో ఇటువంటి రసాయన ఆయు ధాల తయారీని రష్యా, ఐరాస మధ్యవర్తిత్వంతో అస్సాద్ ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొంది. సిరియా దగ్గర రసాయన ఆయుధాలు లేవని తెలిసి కూడా అమెరికా చేస్తున్న ఈ ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని రష్యాలోని సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్తలు అంటున్నారు. " ఈ రసాయన బాంబులను నిర్మూలించిన ఘనత తనకు దక్కిందని అప్పటి అమెరికా అధ్యక్షుడు 2014లో నోబెల్‌శాంతి బహుమతి కూడా పొందాడని" గుర్తుచేస్తున్నారు. ఆగస్టు 2013లో డమాస్కస్ నగరానికి తూర్పున ఉన్న గాటా ప్రాంతంలో 1000 మంది పౌరుల్ని అస్సాద్ ప్రభుత్వం రసాయనాలతో చంపిందని ఒబామా ప్రచారం చేసి, ఇప్పటివరకూ నిరూపించలేక పోయాడు. అల్ – నుస్రా విషవాయువుల్ని తయారుచేస్తుందని వెల్లడించినా ఇంతవరకూ అమెరికా పట్టించుకోలేదు. ❋

**నిరంకుశత్వం బాటలో..**

# బెదిరింపులతో లొంగదీస్తున్న మోడీ ప్రభుత్వం



రచయిత్రి ప్రముఖ ఆర్థికవేత్త

**జయతీ ఘోష్**

పాలకవర్గంతో వాస్తవాలు మాట్లాడగలిగే వారు ఒక్కరు కూడా దేశంలోని ప్రముఖ సంస్థలలో మిగిలి లేరా? ప్రజాస్వామ్య మనుగడలో ప్రముఖ పాత్రను పోషించే వివిధ సంస్థల యొక్క విశ్వసనీయత గత ఏడాది భయంకరంగా హరించివేయబడింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడ ఏదైనా ఒత్తిడులతో మాత్రమే ఆ సంస్థలను గౌరవించడం జరిగింది. కానీ ప్రస్తుతం భారతదేశంలో మనం అనుభవిస్తున్న హేయమైన, నీచమైన పరిస్థితులు ఒక కొత్త దిగజారుడుతనాన్ని సూచిస్తున్నాయి.

ప్రస్తుత సమస్యకు ప్రధానమైన కారణం, ప్రశ్నించేతత్వాన్ని అనుమతించని అధికార పార్టీ యొక్క అదుపులేని నాయకత్వం తీరే. వారియొక్క భావజాలాన్ని అనుకూలమైన మీడియా ద్వారా ప్రజానీకంపై రుద్దుతున్నారు. కానీ ఒక తెలియని అసంతృప్తి ప్రజలలో లోతుగా, విస్తృతంగా వ్యాప్తి చెందుతూ ఉన్నది. ఇది నాయకుల లేదా అదుపుచేసే పాలకుల కోరికలు మాత్రమే కాదు, వారి ప్రాథమికమైన బాధ్యత నాయకుల కొరకు కాదు, ప్రజల కొరకు, సమాజం కొరకు అన్న విషయాన్ని మరచిన ఆయా సంస్థల అధిపతులుగా ఉన్న వ్యక్తుల కోర్కె కూడా. భారతదేశంలో పాలకవర్గాల యొక్క అధికారాన్ని గౌరవించే సాంప్రదాయం ఎంతోకాలంగా ఉన్నది. కానీ అదే విధంగా ఆయా వ్యవస్థల, సంస్థలకు అధిపతులుగా ఉన్న వారియొక్క స్వతంత్రతను, వారియొక్క స్థానాలను గౌరవించి, పరిరక్షించే నిష్కపటమైన నాయకత్వం ఉంటూ వస్తున్నది.

దురదృష్టవశాత్తు అన్ని రకాల ప్రముఖ సంస్థలు పాలకవర్గాలకు లొంగిపోతుండటం వలన గతంలో ఉన్న స్వతంత్రత, స్వేచ్ఛాయుత వాతావరణంలో మాట్లాడే తీరు అదృశ్యమైపోతున్నాయి. అధికార పార్టీ వారి ఆజ్ఞలు పాటించి, వారికి విధేయత, ప్రభుభక్తి ప్రకటించే వ్యక్తులను వివిధ సంస్థలకు, వ్యవస్థలకు అధిపతులుగా నియమించడానికి కేంద్ర ప్రభుత్వం తొందరపడుతున్నది. ఈ విధమైన నియామకాలు ఈ మధ్యకాలంలో "ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐ.సి.హెచ్.ఆర్.)", "ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్.టి.ఐ.ఐ.)", సాంస్కృతిక సంస్థలైనటువంటి "ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐ.సి.సి.ఆర్.)", "సంగీత నాటక అకాడమి" లకు జరిగాయి.

దేశంలో న్యాయ వ్యవస్థపై నమ్మకం కల్గించడానికి కొన్ని సంస్థలు ముఖ్యం అని చెప్పుకోవాల్సిన పరిస్థితి దురదృష్టకరం. యు.పి.ఎ. అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష నాయకులు, ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ సి.బి.ఐ.ని ఒక రాజకీయ పావుగా ఉపయోగించుకుంటున్నదని నిందించేది. కానీ బి.జె.పి. ప్రస్తుతం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు, ప్రశ్నించేవారిని అణచడానికి అదే పనిచేస్తున్నది. సి.బి.ఐ. తన విశ్వసనీయతను కోల్పోయే ఇబ్బందిని ఎదుర్కొంటున్నది. వీటి వలన ఏ రాజకీయ పార్టీకి అయినా లబ్ధి పొందడం, నష్టపోవడం లాంటి పరిణామాలు సంభవిస్తాయి. ప్రజలు పరిశోధనా సంస్థలను, చట్టాలను అమలుచేసే ఏజెన్సీలను సందేహించడం ప్రారంభిస్తే భవిష్యత్‌లో సామాజిక స్థిరత్వానికి, ఐక్యతకు భారీగా భంగం వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

ఈ జబ్బు – రాజకీయాలకు అతీతంగా వ్యవహరించవలసిన ఆర్థిక వ్యవస్థకు చెందిన సంస్థలకు కూడ వ్యాపించడం మూలంగా, వాటియొక్క విశ్వసనీయత, సామాజిక బాధ్యత తగ్గుతూ వచ్చాయి. పెద్దనోట్ల రద్దు వ్యవహారంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చిక్కుకున్న విధానం మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. ఒక దేశం యొక్క స్థూల ఆర్థిక వ్యూహంలో ద్రవ్య విధానం భాగంగా ఉంటుంది. కాబట్టి కేంద్ర బ్యాంక్ (ఆర్.బి.ఐ.) పూర్తిగా స్వాతంత్ర్యం కలిగి ఉండలేదు. ఉండకూడదు. కానీ మన దేశంలో జరిగిన పెద్ద నోట్ల రద్దు వ్యవహారంలో ఆర్.బి.ఐ. కేంద్ర ప్రభుత్వం చేతిలో ఒక రాజకీయ పావుగా ఉపయోగపడింది.

భారతదేశంలోని ఆర్.బి.ఐ. ఆర్థిక వ్యవస్థలో కరెన్సీని సరఫరాచేసి, నియంత్రించే బాధ్యత కలిగి ఉన్నది. వాస్తవంగా మన దేశంలోని కరెన్సీ ఆర్.బి.ఐ. గవర్నర్ సంతకంతో, జవాబుదారీతనంతో విడుదల చేయబడుతుంది. అయినప్పటికీ ఆర్.బి.ఐ. ప్రభుత్వంలో భాగస్వామి కాదనేది స్పష్టం. కానీ పెద్దనోట్ల రద్దు విషయంలో ఆర్.బి.ఐ. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి పెద్ద జీతగాడు మాత్రమే. కరెన్సీ, బ్యాంకింగ్ వ్యవహారాలలో అనుభవం ఉన్న వృత్తి నిపుణులైన బ్యాంకర్లు తీవ్రమైన నిర్ణయాలు, నిరంతర మార్పులతో కూడిన దూరదృష్టిలేని విధానాలను అమలు చేయటానికి పూనుకోకుండా ఉండవలసింది.

ప్రస్తుతం ఆర్.బి.ఐ. బోర్డు మెజారిటీ సంఖ్యలో ఉన్న 'స్వతంత్ర డైరెక్టర్ల' నియామకం జరగకుండానే నిర్వహించబడుతున్నది. ప్రభుత్వంచే నియమించబడిన మైనార్టీ సంఖ్యలో ఉన్న డైరెక్టర్ల కన్నా తక్కువ సంఖ్యలోనే ప్రస్తుతం స్వతంత్ర డైరెక్టర్లున్నారు. నవంబర్ 8 మధ్యాహ్నం ఆర్.బి.ఐ. బోర్డు సమావేశం జరిగి పెద్ద నోట్ల రద్దు నిర్ణయం జరిగినట్లు చెబుతున్నారు. కానీ అంతకు ముందే నవంబర్ 8 సాయంత్రం జాతీయ మీడియా సమావేశానికి మోడీ సమయమిచ్చాడన్న పుకార్లు వచ్చాయి. పెద్దనోట్ల రద్దు ఫలితంగా కొత్త నోట్లు వెంటనే సమకూర్చడం సాధ్యం కాదని, కరెన్సీ కొరత ఏర్పడుతుందని, ఫలితంగా ఆర్థిక వ్యవస్థకు దెబ్బ తగులుతుందన్న విషయాన్ని ఎత్తిచూపే ధైర్యం బోర్డులోని ఏ ఒక్క సభ్యునికి లేకపోయిందా? బోర్డులోని వారంతా నిజంగా నోట్లరద్దు నిర్ణయం సమర్ధవంతంగా నల్లడబ్బును అంతం చేస్తుందని భావించారా? ఒకవేళ ఏవైనా సందేహాలుంటే లేవనెత్తలేకపోయారా?

> **"పెద్ద నోట్లరద్దు రూపంలో ఆర్థిక వ్యవస్థకు పెద్ద మొత్తంలో నష్టం జరిగింది. ఇప్పటికే యధాలాపంగా జరిగిన ఆర్థిక కార్యకలాపాలపై పెద్ద మొత్తంలో సుంకం విధించడం జరిగింది. కేంద్ర గణాంక సంస్థ యధాలాపంగా జరిగిన ఈ ఆర్థిక కార్యకలాపాలను జి.డి.పి. లో 4.5 శాతంగా అంచనా వేసినా, జి.డి.పి. అంచనాల లో మార్పు సంభవిస్తుంది."**



ఆర్.బి.ఐ. డైరెక్టర్ల బోర్డ్ మీటింగ్

ఈ పథకానికి అధికారిక బాధ్యుడిగా ఉన్న ఆర్.బి.ఐ. గవర్నర్ పెద్దనోట్ల రద్దు ప్రకటన అనంతరం నెల రోజుల వరకు మౌనం వహించారు. డిసెంబర్ 7వ తేదీన ద్రవ్య విధాన సమీక్ష కమిటీ సమావేశం అనంతరం మాత్రమే ప్రకటన చేయడానికి (అనాసక్తతతో) కనిపించాడు. ప్రభుత్వం తన అభిప్రాయాలు ఎన్ని విధాలుగా మార్పుచేస్తూ వచ్చిందో అటు తర్వాత ఆర్.బి.ఐ. అధికారికంగా చేసిన ప్రకటనలు అద్దం పట్టాయి. దీని ఫలితంగా ఆర్.బి.ఐ.కి ఆర్థిక ఇబ్బందులు ఉత్పన్నం కావడమే కాదు, అది కేంద్ర బ్యాంక్, బ్యాంకింగ్ విధానం పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని హరించివేస్తుంది. అంతేకాక సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు దీర్ఘ కాలికమైన ప్రతికూల పరిణామాలకు దారితీస్తుంది.

ఈ మధ్య కాలంలో రాజకీయ ఒత్తిళ్ళకు లొంగిన మరొక సంస్థ కేంద్ర గణాంక సంస్థ (సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్). ఈ సంస్థ వృత్తిపరమైన ఆర్థికవేత్తలు, గణాంక శాస్త్రవేత్తల చేత నిర్వహించబడుతుంది కాబట్టి రాజకీయ ఒత్తిళ్ళను వ్యతిరేకించి ఉంటే బావుండేది. ఆశ్చర్యకరంగా నవంబర్ నెల ప్రారంభంలో స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి.)కి చెందిన అంచనాలను ఫిబ్రవరి 1వ వారం నాటికి బదులుగా జనవరి 1వ వారం కల్లా సమకూర్చాలన్న కేంద్ర మంత్రిత్వశాఖ నుండి వచ్చిన విన్నపాలకు సానుకూలంగా సి.ఎస్.ఓ. స్పందించింది. దాని వలన కేంద్ర బడ్జెట్ ఒక నెల ముందు (ఫిబ్రవరి 1) ప్రవేశపెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.

ఫిబ్రవరి రెండవ వారంలో ఐదు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు నిర్వహించబడుతున్నాయి. జి.డి.పి. అంచనాలు ముందస్తుగానే సమర్పించడానికి తేదీల మార్పును బట్టి రాజకీయ భావనలు స్పష్టమవుతున్నాయి. ముందస్తుగానే అంచనాలను సమర్పించాలన్న కేంద్ర గణాంక సంస్థ నిర్ణయాన్ని బట్టి ఏదైనా మదింపు చేయడానికి అవసరమైన ప్రాథమిక వివరాలు పొందడంలేదు అని అర్థం చేసుకోవాలి. ఆ ప్రకారంగా ఫిబ్రవరిలో విడుదల చేయబడే ముందస్తు అంచనాల వలన కంపెనీల లెక్కల వివరాలు (అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు), అదే విధంగా పారిశ్రామిక ఉత్పత్తి సూచి వివరాలు, ఇతర రంగాలకు చెందిన వివరాలు అన్నీ సంవత్సర కాలంలో పొందిన జాతీయ ఆదాయాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. దానికి బదులుగా, ఈ సంవత్సరానికి చెందిన ముందస్తు అంచనాలు కేవలం మొదటి ఆరు నెలలకు సంబంధించిన వివరాలపై మాత్రమే ఆధారపడి లెక్కించవలసి ఉంటుంది.

అదే విధంగా ప్రస్తుత సంవత్సరం గడచిన సంవత్సరం లాంటి సాధారణ సంవత్సరం కాదు. పెద్ద నోట్లరద్దు రూపంలో ఆర్థిక వ్యవస్థకు పెద్ద మొత్తంలో నష్టం జరిగింది. ఇప్పటికే యధాలాపంగా జరిగిన ఆర్థిక కార్యకలాపాలపై పెద్ద మొత్తంలో సుంకం విధించడం జరిగింది. కేంద్ర గణాంక సంస్థ యధాలాపంగా జరిగిన ఈ ఆర్థిక కార్యకలాపాలను జి.డి.పి. లో 4.5 శాతంగా అంచనా వేసినా, జి.డి.పి. అంచనాల లో మార్పు సంభవిస్తుంది. పెద్దనోట్ల రద్దు ప్రభావాలను తెలుసుకోకుండా జి.డి.పి. అంచనా వేయడంలో బహుశా ఇదొక పద్ధతి కాబోలు. సరియైన ప్రాథమిక వివరాలు లేకుండా అంచనా వేయడం పిరికి చర్య అవుతుంది. నోట్ల రద్దు ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకోకుండా, ఫిబ్రవరి నెల వరకు వేచి ఉండకుండా అంచనా వేయడం న్యాయబద్ధం కాదు. ఆర్థిక సునామీని సృష్టించిన పెద్దనోట్ల రద్దు ప్రభావాన్ని మరచి అన్ని రంగాల వివరాలు విడుదల చేయడం కేంద్ర గణాంక సంస్థకు తగదు. కానీ మొండి వైఖరితో, అవాస్తవ పద్ధతితో రెండవ అర్థ సంవత్సరంలో ఏ విధమైన ఆర్థిక మందగింపును పరిగణనలోకి తీసుకోకుండా ప్రస్తుత సంవత్సరంలో జి.డి.పి. వృద్ధిరేటును ప్రకటించింది. ఇది ద్రవ్యలోటును పూడ్చడానికి ఆర్థిక మంత్రికి అవసరమైన స్వేచ్ఛను ఇచ్చింది. పెద్దనోట్ల రద్దు వలన ఆర్థిక వ్యవస్థ వినాశకర ప్రభావానికి గురి అయింది. భవిష్యత్‌లో ఇంకా దుష్ఫలితాలు ఉంటాయని వాదించే విమర్శకులను తాత్కాలికంగానైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వానికి ముందస్తు అంచనా ప్రకటన ఉపయోగపడుతుంది. రాజకీయ చతురతతో కూడుకున్న ఈ గణాంక ప్రమాణాల సాధనతో ఆర్థిక లావాదేవీల స్థాయి వివరాలు పాలక ప్రభుత్వానికి ప్రచారాస్త్రాలుగా ఉపయోగపడుతున్నప్పటికీ, పరిణామాలు మాత్రం తీవ్రంగా ఉంటాయి. కేంద్ర బ్యాంక్ (ఆర్.బి.ఐ.) పట్ల ఏ విధంగానైతే ప్రజల విశ్వాసం హరించబడిందో, గణాంకాలు తప్పు అని తేలినపుడు గణాంక సంస్థ పట్ల కూడ విశ్వాసం హరించబడుతుంది. దీని ఫలితంగా ప్రజలలో పెద్ద ఎత్తున కోపాగ్ని రగులుతుంది. భ్రమలతో కూడుకున్న గాలి బుడగలు సృష్టించేవారు, ఆ కోపాగ్నికి ఆహుతవుతారు.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

# కామ్రేడ్ శేషగిరిరావు

(2వ పేజీ తరువాయి)

కొనసాగిస్తుండేవారు.

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మీద నిర్బంధం మరింత తీవ్రతరమైంది.

గుంపెన సాయుధ దళ పోరాటం తర్వాత, యాభై మందితో ఉన్న గెరిల్లా దళాలను 10 మందితో చిన్న దళాలుగా ఏర్పాటు చేశారు. ఆయన దళనాయకులుగా ఉన్నారు.

పాల్వంచ ప్రాంతంలో పోలీస్ క్యాంపుపై ఆయన దళం దాడిచేసి క్యాంపును చిన్నాభిన్నం చేసి ఆయుధాలు దక్కించుకొని, "ఖాసింరజ్వీ" అనే రజాకారు నాయకుడిని అంతమొందించింది.

ఆయన తన ఇద్దరు సహచరులతో కలిసి గోదావరి దాటి తుమ్మల చెరువు ప్రాంతానికి నెల్లిపాక మీదుగా వెళ్తుండగా ఒక కార్మికద్రోహి ఇచ్చిన సమాచారంతో నిజాం పోలీసులు చుట్టుముట్టి కామ్రేడ్ శేషగిరిరావు, కామ్రేడ్ ఒంటెద్దు రంగయ్య, కామ్రేడ్ కంగాల పాపయ్యలను 1948 ఫిబ్రవరి 15న కాల్చి చంపారు. వారిని కాల్చివేసిన విషయం బయటపడకుండా ఉండటానికి నైజాం పోలీసులు, శత్రువులు నానా తంటాలు పడ్డారు. హిందూ దినపత్రికలో శేషగిరిరావు, రంగయ్య, పాపయ్యలను కాల్చి చంపారన్న వార్త తెలుసుకున్న కార్మికులు, ప్రజలు దు:ఖసాగరంలో మునిగిపోయారు. నిస్వార్థ కార్మిక నాయకుడు, త్యాగశీల పోరాటయోధుడు, కార్మికుల ఆశాకిరణం కామ్రేడ్ శేషగిరిరావు.

**(బోడేపూడి విజ్ఞానకేంద్రం ప్రచురించిన 'ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు యోధులు' పుస్తకంనుండి సేకరించబడినది)**

# కార్పొరేట్ల కోసం రూపొందించిన నూతన ఆరోగ్య విధానం

(26వ పేజీ తరువాయి)

పరిగణనలోకి తీసుకోవడం లేదు.

మినరల్స్, విటమిన్స్ యొక్క లోటును అధిగమించడానికి "ఆహారంలో భిన్నత్వం ఏర్పాటు ఓ మార్గమని ఓ ఆలోచన జరగుతుంది. దురదృష్టవశాత్తు సామాన్యుడు నిత్యం ఒకే రకమైన ఆహారం తీసుకోవటం ఈ మధ్య కాలంలో సాధ్యం కావడం లేదు. పెరుగుతున్న అధిక ధరలు, మారుతున్న వ్యవసాయ ధోరణులు దానికి కారణం. అందువలన ఒకేరకం ఆహారం ప్రస్తుత సమాజంలో సాధ్యం కావడం లేదు. అందువలన శాస్త్రజ్ఞులు కూడా తల్లీబిడ్డలు తినే ఆహారం సైతం విభిన్న పోషకాలతో ఉండాలని సూచిస్తున్నారు. కానీ ఈ విధానం మినరల్స్, విటమిన్స్ సమవర్తిత్వానికి ఓ కొత్త పథకాన్ని రూపొందించబోతుంది. "ప్రభుత్వమే ప్రజలకు భిన్న రకాల ఆహార పదార్థాలను అందించడం అంతేగాక ఆహారపు అలవాట్లలో వైవిధ్యం ఆచరణీయం, ఆహ్వానించదగ్గ పరిణా మం. పౌష్టికాహార లోపాన్ని అధిగమించడానికి స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను రచించడంతో పాటు, ఆచరించడం కూడా నేటి అవసరం." అని చెబుతున్నప్పటికీ. ఆచరణలో మాత్రం, అరకొరగానే మిగిలిపోయింది.

ఈ నివేదిక రోగాలకి నివారణను, అర్థంతర మరణాలను అరికట్టడానికి, ప్రజలకు సమీకృత ఆహారాన్ని అందించే విషయంలోనూ విఫలం అయ్యింది. మాతాశిశు మరణాల సంఖ్యను తగ్గించడం, స్త్రీ - పురుష నిష్పత్తి విషయంలోనూ లక్ష్యాలు నిర్దేశించడం పైనే దృష్టి సారించింది. కానీ సాధించడంలో సఫలీకృతం కావడం లేదు.

ఎన్‌హెచ్‌పి 2015 పరిశీలన ప్రకారం అంతర్జాతీయ ఆరోగ్య ప్రమాణాలను సాధించడం లో థాయ్‌లాండ్, బ్రెజిల్ లాంటి దేశాలు సంపూర్ణం గా విజయం సాధించగా మన దేశం ఎందుకు సాధించలేక పోతున్నది? ఇది కేవలం అంతర్జాతీ య ఆరోగ్య ప్రమాణాల వరకే పరిమితం కాదు. నాణ్యతలో కూడిన, సమగ్ర ఆరోగ్య పథకాలను, తక్కువ రేట్లకు అంటే సామాన్యుడు భరించ గలిగే ఆర్థిక పరిధిలో అందించడం తమ ప్రథమ ప్రాధాన్యంగా ప్రభుత్వం భావించాలని, లాభాపేక్ష రహిత ఆరోగ్య సేవలను, స్వచ్ఛంద సంస్థలు అందించాలని సూచించింది.

ఆరోగ్యం కేవలం వాగ్దానాలకు పరిమితం కాకూడదని, ఆచరణకు అనుకూలంగా, వాస్తవానికి దగ్గరగా, చట్ట పరిధిలో ఉండాలని సూచించింది.

**అనువాదం: డాక్టర్ శమంతకమణి**


# ప్రజాస్వామ్యానికి ఎదురౌతున్న సవాళు

(7వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చుపై సీలింగ్ ఉంది కానీ, రాజకీయ పార్టీలు చేసే ఖర్చుపై లేదు. ఎన్నికల్లో డబ్బు ప్రమేయం తగ్గించాలంటే రాజకీయ పార్టీల ఖర్చుపై సీలింగ్ ఉండాలి. అసలు ఎన్నికలకయ్యే ఖర్చును ప్రభుత్వమే పెట్టాలని వామపక్షాలు, సిపిఎం కోరుతున్నాయి. అప్పుడే ఈ డబ్బు ప్రమేయం లేకుండా ఉంటుంది. నిజమైన ప్రజాభిప్రాయం వ్యక్తీకరించేందుకు అవకాశముంటుంది. అటువంటి సంస్కరణలు చేయాలని అందరూ కోరుకుంటుంటే ప్రభుత్వం వాటికి రివర్స్ పద్ధతుల్లో చేస్తూ ఎన్నికలను పూర్తిగా కార్పొరేట్ మయం చేస్తోంది. ఇప్పుడు ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)లపైనా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో బిజెపి, టిడిపి కూడా అనుమానాలు వ్యక్తం చేశాయి. ఓడినప్పుడేమో ఇవిఎంలు బాగోలేవనీ, గెలిచినప్పుడేమో బాగున్నాయనే వాదనలు చేస్తున్నారు. కండబలం ఉన్నవాడికి ఇవిఎంలయినా, బ్యాలెట్ అయినా ఒక్కటే. అందువల్ల ఎన్నికల్లో నిజమైన ప్రజాభిప్రాయం వ్యక్తం కావాలంటే దామాషా ప్రాతినిధ్యం తప్ప ఇంకొక మార్గం లేదు. ప్రపంచంలో చాలా చోట్ల ఈ పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపికి వచ్చిన ఓట్లు 31 శాతం. ఇది మెజార్టీ ప్రజల అభిప్రాయమని ఎలా చెబుతాం? నిజంగా మెజార్టీ ప్రజల యొక్క అభిప్రాయంతో ప్రజా ప్రతినిధులు పార్లమెంటులోకి రావాలంటే దామాషా ప్రాతినిధ్య విధానం రావాలి. 31 శాతం ఓట్లు వస్తే 31 శాతం ప్రతినిధులే పార్లమెంటులో ఉండాలి. ఇంకో పార్టీకి 20 శాతం ఓట్లు వస్తే 20 శాతం ప్రతినిధులుండాలి. మరో పార్టీకి 2 శాతమే ఓట్లు వచ్చినా ఆ మేరకు పార్లమెంటులో రెండు శాతం ప్రతినిధులుండాలి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అందువల్ల నిజమైన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే ప్రాథమిక హక్కులను రక్షించుకోవాలి. ప్రజాస్వామిక వ్యవస్థలను కాపాడుకోవాలి. అత్యధిక ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా దామాషా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం కోసం కృషి చేయాలి.

**(రాఘవులు గారి ప్రసంగానికి వ్యాసరూపమిచ్చిన వారు బి అమరనారాయణ)**

# జాతీయ సమైక్యతకు పాలకవర్గాల నుండే ప్రమాదం వస్తుంది



**– మాకినేని బసవపున్నయ్య**

దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చి 36 ఏండ్లు అయినా, ఈనాటికీ కుల, మత, వేర్పాటువాదాలు పెరుగుతుండటం ఎంతో బాధాకరమైన, ఆందోళనకరమైన విషయం. ఇలాంటి పరిస్థితులను సామ్రాజ్యవాద చీకటి శక్తులు ఉపయోగించుకొనడంలో ఆశ్చర్యం లేదు. గతంలో సామ్రాజ్యవాదులు మతపరంగా దేశాన్ని భారతదేశం, పాకిస్తాన్‌లుగా విభజించారు. తమకు చేతనైతే ఈనాడు కూడా అలాంటి విచ్ఛిన్నకర శక్తులను ప్రోత్సహించి, దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తారు.

భారతదేశంలో కాశ్మీర్ చేరికను, అస్సాం, పంజాబ్‌ల్లోలాగా వేర్పాటువాద ఉద్యమాలకు తీవ్రవాద శక్తులకు సహాయపడడం, భారతదేశ ప్రజలలో ఒక భాగపు దేశాభిమానాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విదేశీ మత సంస్థలను ఉపయోగించుకుంటున్న తీరు, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వంటి అనేక ఏజెన్సీలు 'సహాయాన్ని' పరిశీలించడమనే పేరిట ప్రయోగిస్తున్న మోసపూరిత పద్ధతులు వంటి వాటిని పరిశీలిస్తే మనదేశ పురోగమనాన్ని దెబ్బతీయటంలో సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు వెనుకంజ వేయరని స్పష్టంగానే కనిపిస్తున్నది.

శతాబ్దాల తరబడి భారతదేశాన్ని బానిసత్వంలో ముంచి ఉంచేందుకు సామ్రాజ్యవాదులు గతంలో చేసిన కుట్రలను గురించి ఈనాడు బాధపడి ప్రయోజనం లేదు. నూతనంగా సాధించుకున్న మన స్వాతంత్ర్యాన్ని వమ్ము చేసేందుకు వారు చేస్తున్న కుట్రలను గురించి వాపోయి లాభం లేదు. మనం ఒక్క విషయం జాగ్రత్తగా ఆలోచించాలి. సామ్రాజ్యవాదులు దుర్వినియోగం చేసుకునేందుకు వీలైన ఈ అవకాశాలు ఎందుకేర్పడుతున్నాయి అని మనం ప్రశ్నించుకోవాలి. కుల, మత, వేర్పాటువాద శక్తులను ఎదుర్కొనేందుకు మార్గమేమిటో ఆలోచించాలి.

ఈ విచ్ఛిన్నకర శక్తులు ఎలా తలెత్తుతున్నాయి? నిజమైన లౌకిక భారత యూనియన్‌ను నిర్మించాలనే మన లక్ష్యం ఒక నినాదంగానే ఎందుకు మిగిలిపోయింది? విచ్ఛిన్నకర వేర్పాటువాదులకు ఎక్కడి నుండి బలం వస్తున్నది?

నేటి ప్రభుత్వ విధానాలే జాతి విచ్ఛిన్నకర శక్తులు పెరిగేందుకు అనువైన పూర్వరంగాన్ని ఏర్పరుస్తున్నాయి.

ఇంత తీవ్ర విమర్శ చేయడం మాకు ఇది మొదటిసారి కాదు.

"దేశ పారిశ్రామికీకరణ, ఆర్థికవ్యవస్థను ఆధునికీకరణ చేయడం నత్త నడకన సాగుతున్నాయి. అందుకు కూడా విదేశీ గుత్త పెట్టుబడితో షరీకౌతున్నారు. బడా భూస్వామ్యవర్గంతో మైత్రి నెరపుతున్నాయి. భారతీయ గుత్తాధిపతులను ప్రోత్సహించే మార్గం అనుసరిస్తున్నారు. సాంఘీక అవసరాలలో తలెత్తుతున్న డిమాండ్లకు, కుంటి నడకన అతి నెమ్మదిగా సాగుతున్న పారిశ్రామికాభివృద్ధికి మధ్య విపరీతమైన అగాధం ఏర్పడుతున్నది. ఫలితంగా సామూహిక అసంతృప్తి పెరుగుతున్నది. అది సామాజిక ఆందోళనకు దారితీస్తున్నది. అంతేకాదు. రాష్ట్రాల మధ్య అంతఃకలహాలను, వనరులు, పరిశ్రమలు, ఇతర కేటాయింపుల్లో కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో వివాదాలు, పరిశ్రమలు, ఇతర అభివృద్ధి కార్యకలాపాలను వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య కేటాయింపుల సందర్భంలో తగాదాలను పెంచే శక్తులకు కూడా తోడ్పడుతున్నది.

"పరాయిపాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్యోద్యమ రోజులలో జాతీయ సమైక్యతను, జాతీయ ఏకోన్ముఖతను ప్రోత్సహించిన సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలు సన్నగిల్లుతున్నాయి. సమాజ పురోగమనానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మార్గం విఫలమైంది. ఆ వైఫల్యం ఫలితంగా ప్రజాతంత్ర వర్గాల్లో నిరాశా, నిస్పృహలు ఏర్పడుతున్నాయి. ఆనాటి భావాలు సన్నగిల్లేందుకు ఇది ప్రధాన కారణం.

పై వ్యాఖ్యలు స్పష్టంగానే ఉన్నాయి. మరింత వివరణ అనవసరం. నూతన స్వతంత్ర భారత పాలకులు పెట్టుబడిదారీ మార్గం చేపట్టారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అన్నారు. కానీ ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి రేటు నత్తనడకన సాగుతుందని ఆనాడు భావించలేదు. వారు ఎన్నుకున్న మార్గం ఉపాధి కోరే నూరుమందిలో పదిమందికే ఉద్యోగాలు కల్పించగలదని వారు ఊహించలేదు. ఉద్యోగాలు కోరేవారి సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంటుందని వారికి అంచనా లేదు. మరొక మార్గం లేనప్పుడు ఉద్యోగాలకూ పోటీపడేవారు కుల, మత, ప్రాంతీయ తత్వాలను ఆశ్రయించడంలో ఆశ్చర్యమేముంది?

మనమంతా సుఖప్రదంగా జీవించేందుకు అనువైన సమాజాన్ని, ఆకలి, దరిద్రం, నిరుద్యోగంలేని సమాజాన్ని నిర్మించుకోవాలి. భారతదేశంలో అంతర్భాగంగా ఉంటే తమ భాషా సంస్కృతుల వికాసానికి తోడ్పాటు లభిస్తుందనే విశ్వాసాన్ని అన్ని జాతులలోనూ కల్పించేందుకు కృషిచేయాలి. దేశ సమైక్యతను కాపాడుకోవటం అవసరమనే చైతన్యాన్ని ప్రజలలో పెంపొందించటం కోసం నిరంతరం పోరాడాలి.

**(1983 ఆగస్టు 13న ఢిల్లీలో 14 యువజన, విద్యార్థి సంఘాలు 'జాతీయ సమైక్యత'పై నిర్వహించిన సదస్సులో మాకినేని బసవపున్నయ్య చేసిన ఉపన్యాసం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.1. Published on May 1, 2017